


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 42

గురువారం 4-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కేక్ ఆర్టిస్ట్
ప్రాచీ ధబల్





ఆ కేకుల కోసం క్యూ కడతారు

బొమ్మలేసే ఆర్టిస్టు గురించి విన్నాం. కేక్ ఆర్టిస్ట్ గురించి ఎప్పుడైనా విన్నారా? ప్రాచీ ధబల్‌ను మన దేశంలో బేకింగ్ క్వీన్‌గా, గొప్ప కేక్ ఆర్టిస్ట్‌గా పిలుస్తారు. కేక్‌లను కళాత్మకంగా సౌందర్యాత్మకంగా చేసి తినడానికే కాదు చూడటానికి కూడా రుచికరంగా తయారు చేసి అంతర్జాతీయ అవార్డులు పొందుతోందామె. ఈ ఫొటోలు చూడండి. అన్నీ తినే కేకులే. 'మీరూ ఇలా కొత్తగా ట్రై చేసి సక్సెస్ సాధించండి' అంటోంది ప్రాచీ.

ప్రపంచ ప్రఖ్యాత కేక్ ఆర్టిస్ట్ ఎవరో తెలుసా? యూకేకు చెందిన ఎడ్డీ స్పెన్స్. కళాత్మకమైన కేకుల తయారీలో ఆయన ప్రతిభకు అక్కడి ప్రభుత్వం 'సర్' బిరుదుతో గౌరవించింది. 'నేను లండన్ వెళ్లి ఆయన దగ్గర పని నేర్చుకున్నాను. నాకు కేక్ ఆర్ట్ అంటే అంత పిచ్చి' అంటుంది ప్రాచీ ధబల్.

36 ఏళ్ల ప్రాచీ గత సంవత్సరం 100 కిలోల కేక్‌ను తయారు చేసింది. ఇది ఇటలీలో ప్రసిద్ధమైన మిలాన్ కేథడ్రల్ (చర్చ్)కు రెప్లికా. ఆరున్నర అడుగుల పొడవు, నాలుగున్నర అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పు ఉన్న ఈ భారీ చర్చ్ ఆకారపు కేక్‌లో దాదాపు 1500 సున్నితమైన భాగాలు ఉన్నాయి. వాటన్నింటినీ రాయల్ ఐసింగ్ (తెల్ల సొన, చక్కెర పొడుల మిశ్రమం)తో తయారు చేసి 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 2022'లో ఎక్కింది ప్రాచీ. అందుకే ఆమెను 'బేకింగ్ క్వీన్ ఆఫ్ ఇండియా' అంటుంటారు.

చిన్నప్పటి నుంచి

ప్రాచీ ధబల్ సొంత ఊరు డెహరాడూన్. అక్కడే పుట్టి పెరిగింది. 'నాకు పదేళ్లున్నప్పుడు వేసవి సెలవుల్లో కేకుల తయారీని మా అమ్మ నాకు కాలక్షేపంగా నేర్పింది. నేను కప్‌కేక్‌లు తయారు చేసేదాన్ని. రోజులు పెరిగే కొద్దీ ఆ ఆసక్తి కూడా పెరిగింది. నాకు బొమ్మలు వేయడం కూడా వచ్చు. కథల పుస్తకాలు బాగా చదివేదాన్ని. నా పుట్టిన రోజున బయట కేక్ ఆర్డర్ ఇస్తున్నప్పుడు నేను చదివిన కథల్లోని కోటల్లాంటి, రాకుమార్తెల్లాంటి, ఉద్యానవనాల్లాంటి కేక్‌లు తెప్పించమని మా అమ్మను పోరేదాన్ని. కాని అలాంటి కేకులు ఎవరూ తయారు చేయరు. మార్కెట్‌లో మామూలు కేకులు ఉండేవి. నాకు అలాంటివి ఎందుకు తయారు చేయకూడదు అనిపించేది' అంది ప్రాచీ ధబల్.









ప్రాచీ ధబల్ తయారుచేసిన కేక్స్

ఉద్యోగం నచ్చలేదు

ప్రాచీ కోల్‌కతాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. ఆ తర్వాత ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా పూణెలో ఉద్యోగానికి వచ్చి స్థిరపడింది. కాని ఆమెకు ఆ ఉద్యోగం నచ్చలేదు. '2012 నాటికి నాకు ఉద్యోగం బోర్ కొట్టింది. అందులో నాకు ఇష్టమైనదేదో లేదు. నాకు కేక్ ఆర్టిస్ట్‌గా మారాలనిపించింది. కాని ఆ రోజుల్లో ఆ కళకు పెద్దగా గిరాకీ లేదు. ఎవరికీ అలాంటిది ఒకటి ఉంటుందని తెలియదు. కళాత్మక కేకులు తయారు చేయాలంటే కావలసిన మెటీరియల్ మన దేశంలో దొరికేది కాదు. అయినా సరే తెగించి విదేశాల నుంచి కావలసిన సామాగ్రి తెప్పించుకుంటూ రంగంలో దిగాను. నేను తయారు చేసేది షాపులో అమ్మే కేకులు కాదు. కస్టమైజ్డ్ కేకులు. అందువల్ల వీటి ఖరీదు కూడా ఎక్కువ. అలాంటి కస్టమర్లు పెరిగే వరకూ నాకు కొంచెం కష్టంగానే అనిపించింది. కాని నా ప్రత్యేకమైన కేకులు నలుగురి దృష్టిలో పడ్డాక ఇప్పుడు ఊపిరి సలపడానికి కూడా టైమ్ లేదు' అని నవ్వుతుంది ప్రాచీ.

దేశీయత

ప్రాచీ తయారు చేసే కేకులు దేశీయతతో నిండి ఉంటాయి. చీరల మీద డిజైన్లు, ఆర్కిటెక్చర్, సంప్రదాయ చిహ్నాలు అన్నీ ఆమె కేకుల్లో కనిపిస్తాయి. ఇటీవల ఆమె బెనారస్ చీరను, ఆభరణాలను పోలిన కేక్‌ను తయారు చేసింది. 'కుంకుమ భరిణె'లా కనిపిస్తున్న ఆ కేక్ ఎన్నో ప్రశంసలు పొందింది. ఆమె తయారు చేసిన నెమలి కేక్‌లో పైకి ఆభరణాలుగా కనిపించేవి కూడా తినదగ్గ మెటీరియల్‌తో తయారు చేసినవే. అయితే ఈ కళను ప్రాచీ తన దగ్గరే దాచుకోవడం లేదు. యువ బేకర్‌లకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసి నేర్పుతోంది. 'అమ్మాయిలు ముందు తమకు ఇష్టమైన రంగంలో కనీస డిగ్రీ సంపాదించాలి. ఆ తర్వాత ఆ ఇష్టం కోసం కష్టపడాలి. తప్పకుండా విజయం లభిస్తుంది. కష్టపడకుండా ఏదీ రాదు' అంటుంది ప్రాచీ.

పాత దారిలో కొత్తగా నడవడమే విజయం అని ప్రాచీ విజయం తెలుపుతోంది. ●

కిచెన్ టిప్స్











- రోజూ కాఫీ ఒకటే రుచితో బోరుకొడితే వెరైటీ రుచి కోసం అందులో కొద్దిగా బోర్న్‌వీటా కలుపుకోవాలి.
- బొంబాయి రవ్వ హల్వా మరింత రుచిగా ఉండాలంటే ఒక టేబుల్ స్పూన్ శనగ పిండిని కలుపుకోవాలి.
- ఇంగువ గట్టిపడితే అందులో పచ్చిమిర్చి వేయాలి.
- మిగిలిపోయిన అన్నంలో కొంచెం మసాలా దినుసులు, బ్రెడ్ వేసి అన్నాన్ని మెత్తగా చేయాలి. ఈ మిశ్రమంతో కరకరలాడే పకోడీలు తయారు చేసుకుని తినవచ్చు.
- కూరల్లో కారం కాస్త ఎక్కువైతే అందులో కొంచెం నిమ్మరసం లేదా రెండు టీస్పూన్ల నెయ్యి కలిపితే కారం తగ్గుతుంది.
- పిల్లలకు రుచికరమైన ఫ్రూట్ షేక్ ను నిమిషాల్లో అందివ్వాలంటే ఒక టేబుల్ స్పూన్ ఫ్రూట్ జామ్ ను ఒక గ్లాసు చల్లటి పాలలో వేసి మిక్సీలో బ్లెండ్ చేయాలి. రుచికరమైన ఫ్రూట్ షేక్ రెడీ.
- కొత్తిమీర చట్నీ తయారు చేసే సందర్భంలో కొన్ని నట్స్ వేస్తే పోషకాలు అందటంతోపాటు, ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది.
- పనీర్ వంటకం చేసేటప్పుడు నీళ్లకు బదులుగా పాలు వాడితే గ్రేవీ మెత్తగా ఉంటుంది.
- గులాబ్ జామున్ లు గట్టిగా అయితే పంచదార పాకంతో సహా వాటిని ప్రెషర్ కుక్కర్ లో పెట్టి సన్నటి మంట మీద ఐదు నిమిషాలు ఉడికిస్తే మృదువుగా మారతాయి.
- కలిపిన చపాతీ పిండి మిగిలిపోతే ఆ ముద్ద పైన కొద్దిగా నూనె లేదా నెయ్యి వేసి రిఫ్రిజిరేటర్ లో ఉంచాలి.



ఆలూరి లలిత

అవసరం నుంచి ఆకాంక్ష వరకు

మహిళల పురోగతికి ఆకాశమే హద్దు.
నిజమే... మరి!
మహిళ పురోగతి ఎక్కడ మొదలవుతుంది?
ఒక ఆకాంక్ష నుంచి మొదలు కావచ్చు...
అలాగే...
ఒక అవసరం నుంచి కూడా మొదలు కావచ్చు.
అవును...
అవసరమే ఆమెను జాతీయస్థాయిలో నిలిపింది.
ఆమె...
మహిళలకు చేయూతనిచ్చే స్థానంలో నిలిచింది.

ఆలూరి లలిత మహిళాపారిశ్రామికవేత్త. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ చేశారు. పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో వ్యాపార కుటుంబంలో అడుగుపెట్టారు. ఉమ్మడి కుటుంబం కూడా కావడంతో తన మీద పెద్ద బాధ్యతలేవీ లేవు. నాలుగేళ్లు అలా గడిచిపోయాయి. తమ కంపెనీ ఒడిదొడుకుల్లో ఉందని, భాగస్వాములు దూరం జరిగారని తెలిసిన తర్వాత భర్తకు తోడుగా బాధ్యత పంచుకోవడానికి భుజాన్నివ్వాల్సి వచ్చింది. అలా మొదలైన పారిశ్రామిక ప్రస్థానం ఆమెను విజేతగా నిలపడంతోపాటు జాతీయ స్థాయిలో సంఘటితమైన మహిళా పారిశ్రామిక వేత్తల సమాఖ్య (కోవె)కు అధ్యక్షురాలిని చేసింది. ఆ వివరాలను సాక్షితో పంచుకున్నారు లలిత.

'అవసరం'తో పోరాటం

"గృహిణిగా ఉన్న నేను పరిశ్రమ నిర్వహణలోకి అడుగు పెట్టింది 1998లో. అప్పటికే మనుగడ సమస్య మాది. తీరా అడుగు పెట్టిన తర్వాత తెలిసింది బ్యాంకు వాళ్లు మా పరిశ్రమను ఎన్‌పీఏ (నాన్ పెర్ఫార్మింగ్ అసెట్) కేటగిరీలో లిస్ట్ చేశారని. మూడు క్వార్టర్లు బకాయి పడి ఉన్నాం. మరో క్వార్టర్ సమయం కావాలని అడిగాను. మొదట్లో ససేమిరా అన్నారు. 'మీరు హ్యాండోవర్ చేసుకుని మీ డబ్బు ఎలా జమ చేసుకుంటార'ని అడిగాను. మెషినరీ అమ్మేస్తామన్నారు. ఈ మెషీన్‌లతో పని చేయడానికి మా వారు సింగపూర్‌లో శిక్షణ తీసుకుని వచ్చారు, హైదరాబాద్‌లో ఈ టెక్నాలజీ చాలామందికి తెలియదు. మీరు స్క్రాప్ కింద అమ్మాల్సిందే, రెండు లక్షలు కూడా రావు. మాకు టైమిస్తే మీ లోన్ మొత్తం తీర్చేస్తామని చెప్పాను. ఆ తర్వాత అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముల సహాయంతో పది లక్షలు ఎదురు పెట్టి కొత్త టెక్నాలజీతో పరిశ్రమను నడిపించాం. రెండేళ్లపాటు రోజుకు 18 గంటలు పనిచేశాం. మొత్తానికి గట్టెక్కాం. 2005లో పరిశ్రమ విస్తరించాలనే ఆలోచనతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ నెట్‌వర్క్ – జేఎన్ టీయూ తో కలిసి నిర్వహించిన ఎంప్లాయ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో శిక్షణ తీసుకున్నాను. అప్పటి నుంచి ఈ సంస్థలో భాగస్వామినయ్యాను. లైఫ్ మెంబర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్, జాతీయ స్థాయి కమిటీలో జాయింట్ సెక్రటరీ, సెక్రటరీ బాధ్యతలు నిర్వహించి ఇప్పుడు ప్రెసిడెంట్ బాధ్యతలు చేపట్టాను.

ఈ రాష్ట్రాలు ముందున్నాయి!

మహిళా పారిశ్రామిక వేత్తల విషయంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, యూపీ, ఢిల్లీ రాష్ట్రాలు ముందువరుసలో ఉన్నాయి. వెస్ట్‌బెంగాల్, తమిళనాడు, మహారాష్ట్రతోపాటు కొన్ని రాష్ట్రాలు చేయి పట్టి నడిపించాల్సిన దశలోనే ఉన్నాయి. మా సంస్థలో ఉన్న ఎంటర్‌ప్రెన్యూర్స్‌లో ఎక్కువ మంది బాగా చదువుకున్న వాళ్లే. ఐఐటీ, బిట్స్, ఐఐఎమ్ స్టూడెంట్స్ ఉన్నారు. వాళ్లు ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. మా చదువు, పరిశ్రమ నిర్వహణలో మేము నేర్చుకున్న మెళకువలతో కొత్తగా పరిశ్రమల రంగంలోకి వచ్చిన వాళ్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నాం. ఈశాన్య రాష్ట్రాల మీద ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నాం. అలాగే కాలేజీలకెళ్లి విద్యార్థులకు వర్క్‌షాపులు నిర్వహించడం, నగరాల్లోని అల్పాదాయ వర్గాలు నివసించే కాలనీల్లోనూ, గ్రామాల్లోనూ మహిళలకు శిక్షణతోపాటు ఇన్‌క్యుబేషన్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నాం.

మహిళలు మారారు!

మహిళల్లో చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు మహిళలు ఉద్యోగం చేసుకుంటే చాలన్నట్లు, భర్త సంపాదనకు తోడు మరికొంత అన్నట్లు ఉండేవారు. ఇప్పుడు ఆ ధోరణి పూర్తిగా మారిపోయింది. తన ఐడెంటిటీని తామే రాసుకోవాలనే ఆకాంక్ష పెరిగింది. అలాగే విజయవంతం అవుతున్నారు. ఉద్యోగం చేసి పిల్లల కారణంగా కెరీర్‌లో విరామం వచ్చిన మహిళలకు (35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉన్న వారికి) వారి సామర్థ్యం, ఆసక్తిని బట్టి 'రీ ఇగ్నైట్' ప్రోగ్రామ్ కింద సపోర్ట్ చేస్తున్నాం. పదివేల మంది విద్యార్థులను, 30 వేల మంది గ్రామీణ మహిళలను సాధికారత దిశలో నడిపించాలనేది ప్రస్తుతం మా కోవె ముందున్న లక్ష్యం".

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి
ఫొటోలు : మోర్ల అనిల్ కుమార్

ఇలా చేయండి

ఒక మహిళ వ్యాపారం కానీ పరిశ్రమ కానీ పెట్టినప్పుడు అది నిలదొక్కుకుని లాభాల బాట పట్టే వరకు దాదాపుగా మూడు నాలుగేళ్లు జీవితం మనది కాదు మన పరిశ్రమది అనుకుని శ్రమించాలి. మార్కెట్‌ని విశ్లేషించుకోవాలి. రెవెన్యూ మీద అవగాహన ఉండాలి. పెట్టుబడి, రాబడి మాత్రమే కాదు. రాబడికి ఆదాయానికి మధ్య తేడా తెలుసుకోవాలి.


- కౌంటర్‌లోకి వచ్చిన ప్రతిరూపాయి మనది కాదు. ఉద్యోగుల వేతనాలు, అద్దె, కరెంటు, పెట్టుబడి కోసం మనం ఇంటి నుంచి పెట్టిన డబ్బుకు కొంత జమ వేసుకోవడం, బ్యాంకు లేదా ఇతర అప్పులు అన్నీ పోగా మిగిలినదే ఆదాయం. అదే మనం సంపాదించినది. మన కోసం ఖర్చు చేసుకోగలిగినది.
- పరిశ్రమ కోసం ఒక మూలనిధి ఏర్పాటు చేసి ఏటా పదిశాతం లాభాలను మూలనిధిలో జమ చేయాలి. యంత్రాల రిపేరు వంటి అనుకోని ఖర్చులకు, పరిశ్రమ విస్తరణకు ఆ నిధి పనికొస్తుంది. కోవిడ్ దెబ్బకు తట్టుకుని నిలబడినవన్నీ మూలనిధి ఉన్న పరిశ్రమలే.
- మహిళలు గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే... పరిశ్రమ నిర్వహణ బరువైనప్పుడు అది లాభాల బాట పట్టడం కష్టం అని నిర్ధారించుకున్నప్పుడు దాని నుంచి వెంటనే మరొక దానికి మారిపోవాలి.
- మొదట్లో కష్టపడినన్ని గంటలు పదేళ్లు, పాతికేళ్లు కష్టపడలేరు. కాబట్టి ఇంట్లోనూ, పరిశ్రమలోనూ సపోర్టు సిస్టమ్‌ని అభివృద్ధి చేసుకోవాలి.

సైబర్ టాక్

లైక్స్ పేరుతో ట్రాప్

పార్ట్‌టైమ్ జాబ్స్ కావాలంటే ఈ లింక్‌పై ఒక్క క్లిక్ చేయండి.. సోషల్ మీడియాలో పోస్టులకు లైక్స్, కామెంట్స్, వ్యూస్ వచ్చేలా చేస్తే చాలు మీకు డబ్బే డబ్బే.. ఆన్‌లైన్‌లో సంపాదించండి అత్యంత సులభంగా .. అంటూ ఊదరగొట్టే ప్రకటనలకు సోషల్ ఇంజినీరింగ్ మోసాలకు వేదికగా మారింది టెలిగ్రామ్. చదువుకున్న గృహిణులు, విద్యార్థులను ట్రాప్ చేయడానికి స్కామర్లు టెలిగ్రామ్ యాప్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. తస్మాత్ జాగ్రత్త!!

●●●



ఆన్‌లైన్ సంపాదన వైపు ఇప్పుడు నవతరం మొగ్గుచూపుతోంది. అదనపు ఆదాయం కోసం చూస్తున్నవారు ముఖ్యంగా టెలిగ్రామ్ యాప్ ద్వారా వచ్చే ప్రకటనల ఊబిలో కూరుకు పోతున్నారు. అపరిమితమైన సభ్యులుండే పెద్దగ్రూప్ చాట్ ఫీచర్‌కు టెలిగ్రామ్ సపోర్ట్ ఇవ్వడం వల్ల కూడా అధికంగా మోసాలు జరిగేందుకు ఆస్కారం ఇచ్చినట్లయింది.

పైసా వసూలు

ప్రముఖ పెట్టుబడి, కార్పొరేట్ ట్రేడింగ్ కంపెనీలకు చెందిన అధికారులుగా నటించే స్కామర్లు పెద్ద మొత్తంలో డబ్బును లాగేందుకు బాధితులను తరచు ప్రాసెసింగ్ ఫీజు, వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించమని, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు తప్పులు జరిగాయని ... ఇలా రకరకాల సాకులతో డబ్బు వసూలు చేస్తుంటారు.

సులభంగా నష్టం

మోసగాళ్లు టెలిగ్రామ్‌నే ఎక్కువగా ఉపయోగించడానికి కారణాలున్నాయి. వాటిలో..

- టెలిగ్రామ్ వినియోగదారులు వర్చువల్‌గా దేశీ విదేశీ నంబర్లతో సైన్ అప్ అవ్వచ్చు. తమ గుర్తింపును దాచవచ్చు.
- టెలిగ్రామ్ యూజర్లు మల్టిపుల్ అకౌంట్స్‌ను సులభంగా క్రియేట్ చేయవచ్చు. దాంతో సైబర్ పరిశోధకులకు నేరస్థుడిని ట్రాక్ చేయడం, గుర్తించడం కష్టమవుతుంది.
- పైరేటెడ్ సినిమాలు, సాఫ్ట్‌వేర్ ఫైల్స్ సులభంగా షేర్ అవుతాయి. వీటిద్వారా ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లుతుంది.
- యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లను నేరస్థులు లీక్ చేయడానికి యాక్సెస్ ఇస్తుంది.
- చట్టవిరుద్ధమైన లేదా నకిలీ అవుట్‌లెట్‌ల కోసం లగ్జరీ బ్రాండ్లను ఈ గ్రూప్ ద్వారా విక్రయిస్తుంటారు.
- మోసపూరిత స్కీమ్‌లు అధికంగా ఉంటాయి. ఇవి ప్రధానంగా మెసేజింగ్ ద్వారా తమ అప్లికేషన్స్‌లోకి లాగుతాయి.
- స్కామర్లు తమను తాము చట్టబద్ధమైన ఏజెంట్లుగా లేదా వివిధ కార్పొరేషన్ ఉద్యోగులుగా చూపించుకుంటారు.
- స్కామర్లు బాధితులను ఆకర్షించడానికి తరచు ప్రముఖ ఛానెళ్ల నకిలీ వెర్షన్లను సృష్టిస్తారు. ఈ గ్రూప్‌లకు ఒకేవిధమైన పేర్లు, ప్రొఫైల్ ఫొటోలు ఉంటాయి. చట్టబద్ధమైన వాటితో సరిపోలే విధంగా యూజర్ పేర్లతో ఉంటాయి.
- ప్రమోషన్లు, ఉచిత బహుమతులు, రాజకీయ నాయకుల ఆధారిత పథకాలతో కూడిన స్కామ్‌లకు అమాయకులు బలవుతుంటారు.
- ఏదోవిధమైన సమస్యను సృష్టించడం, ఆ సమస్యను పరిష్కరించడానికి మీ డిజిటల్ (ల్యాప్‌టాప్ లేదా ఫోన్) పరికరాల రిమోట్ కంట్రోల్ తీసుకోవడం... ఈ ప్రక్రియలో మీ వ్యక్తిగత, ఆర్థిక సమాచారం కాస్తా స్కామర్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది.
- స్కామర్లు తమను తాము బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ నిపుణులుగా చెప్పుకుంటారు. క్రిప్టో పెట్టుబడులపై రాబడిని హామీగా చూపుతారు. దీంతో బాధితులు వీటిపట్ల మొగ్గుచూపుతారు. అందుకు తగినట్టుగా పెట్టుబడి పెరుగుతున్నట్టుగా గ్రాఫ్‌లు, చార్ట్‌లు చూపుతారు. అయితే, బాధితుడు తమ డ్యాష్‌బోర్డ్‌లో ఉన్న మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోలేడు. ఆ తర్వాత స్కామర్లు కనిపించరు. ఎంత మొత్తుకున్నా, స్కామర్లు గ్రూప్‌లో మరోసారి స్పందించరు.
- ఈ స్కామ్‌లో స్కామర్లు చట్టబద్ధమైన టెక్ సపోర్ట్ ఏజెంట్ల మాదిరిగా నటిస్తారు. స్కామర్లు సమస్యను పరిష్కరించడానికి బాధితుల ల్యాప్‌టాప్ లేదా పరికరాన్ని రిమోట్ కంట్రోల్‌గా తీసుకుంటారు. ఈ ప్రక్రియలో బాధితుల వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సేకరిస్తారు.
- బాధితులు తమకు ఫొటోలు లేదా వీడియోలు పంపమని అడుగుతారు. రొమాన్స్ ఫ్రాడ్‌కు కూడా పాల్పడతారు.
- ఉచిత క్రిప్టో కరెన్సీ లేదా టోకెన్‌లను పంపిణీ చేస్తామని నకిలీ ఎయిర్‌డ్రాప్ ప్రచారాలను సృష్టిస్తారు.
- నకిలీ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన బహుమతులతో తమవైపు ఆకర్షించేలా చేస్తారు. దీనిద్వారా యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని పొందుతారు.

ఇవీ భద్రతా చర్యలు


- కనీసం పది పెద్ద, చిన్న అక్షరాలు, సంఖ్యలు, చిహ్నాలతో కూడి ప్రత్యేకమైన, ఊహించడానికి కష్టంగా ఉండే పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి.
- https://www.unshorten.it or https://www.checkshorturl.com ను ఉపయోగించిన మీకు వచ్చిన లింక్స్ యుఆర్‌ఎల్ లు సరైనవేనా అని ధ్రువీకరించండి.
- తెలియని వారి నుంచి వచ్చే లింక్స్ క్లిక్ చేయడానికి, డౌన్‌లోడ్ చేయడానికి ముందు వెబ్‌లింక్‌ను ఒకటికి రెండుసార్లు చెక్ చేయాలి.
- యూజర్ తమ ప్రొఫైల్‌కి వెళ్లి స్క్రీన్ మూలలో ఉన్న మూడు చుక్కలపై క్లిక్ చేసి 'బ్లాక్ యూజర్'ని ఎంచుకోవాలి.
- పరిచయం ఉన్నవారితోనే చాట్‌ను కొనసాగించండి.
- పెట్టుబడులపై అధిక రాబడి లేదా ఉచిత బహుమతులు వంటి నిజమని అనిపించే ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండండి.
- టెలిగ్రామ్‌లో టెక్స్ట్ చేస్తున్నప్పుడు లేదా వాయిస్ చాట్ చేస్తున్నప్పుడు స్క్రీన్ షేరింగ్ ఎప్పుడూ చేయకూడదు.

టెలిగ్రామ్‌లో మోసపోతే..

- abuse@telegram.org లో మీకు జరిగిన మోసాన్ని రిపోర్ట్ చేయండి. స్కామర్ గురించి @notoscamకు నివేదించండి.
- https://cybercrime.gov.in/లో ఫిర్యాదును నమోదు చేయండి. ఆన్‌లైన్‌లో నష్టపోతే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేసి రిపోర్ట్ చేయండి.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్


'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 42

గురువారం 4-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సీల్డ్ కవర్‌లో అఫిడవిట్ ఇస్తాం

సుప్రీంకోర్టుకు మహిళా రెజ్లర్ల విజ్ఞప్తి.. ప్లేయర్లను కలిసిన పీటీ ఉష - 12లో



మనోబాల కన్నుమూత

అనారోగ్య సమస్యలతో తుదిశ్వాస విడిచిన ప్రముఖ హాస్య నటుడు - 12లో



మీటనొక్కేటప్పుడు 'జై బజరంగబలీ'..

పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేటప్పుడు 'జై బజరంగబలీ' అని నినదించడం ద్వారా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రధాని మోదీ కోరారు.

వివరాలు 6లో ▸



పుతిన్‌పై హత్యాయత్నం

తమ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను హత్య చేసేందుకు ఉక్రెయిన్ డ్రోన్లతో దాడులు చేసిందని రష్యా తీవ్ర ఆరోపణలు చేసింది.

వివరాలు 6లో ▸



వరల్డ్ బ్యాంక్ అధ్యక్షునిగా అజయ్

ప్రపంచ బ్యాంక్ కాబోయే అధ్యక్షునిగా అజయ్ బంగా నియామకం ఖరారయ్యింది. జూన్ 2 నుంచి ఐదేళ్లపాటు సేవలందిస్తారు.

వివరాలు 6లో ▸



టీనేజీ విద్యార్థి ఘాతుకం

సెర్బియా దేశంలో ఓ విద్యార్థి జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో ఎనిమిది మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸


భోగాపురం వద్ద జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

అభివృద్ధికి చిరునామా

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు కిరీటం

శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

30 నెలల్లో ఇక్కడి నుంచి విమానాల రాకపోకలు

రూ.5 వేల కోట్లతో 2026 నాటికి రెండు రన్‌వేలతో టేకాఫ్

రూ.6,300 కోట్లతో విశాఖ నుంచి 6 లేన్ల రహదారి

మరో నాలుగు నెలల్లో శంకుస్థాపన

అదానీ డేటా సెంటర్‌తో ఐటీకి కేరాఫ్‌గా విశాఖ..

జూన్‌లో ఉద్దానం నీటి ప్రాజెక్టు ప్రారంభం.. రెండో దశ పనులకూ శంకుస్థాపన

ఆగస్టు–సెప్టెంబర్‌లో విజయనగరం మెడికల్ కాలేజీ ప్రారంభం

నాలుగేళ్లలోనే ఎంతో మంచి చేసిన ప్రభుత్వం ఒకవైపు

40 ఇయర్స్ ఇండస్ట్రీ అంటూ ఏ మంచీ చేయని చంద్రబాబు మరోవైపు

నాటి పాలనకు, నేటి పాలనకు మధ్య తేడా మీరే గమనించండి

2 లో


అదానీ డేటా సెంటర్‌కు భూమి పూజ చేస్తున్న సీఎం వైఎస్ జగన్, అదానీ గ్రూప్ ఎండీ రాజేష్ అదానీ, సీఈవో కరణ్ అదానీ


విమానాశ్రయం శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించిన సీఎం జగన్. చిత్రంలో జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు తదితరులు

"నాలుగేళ్లుగా మీకు ఇంతగా మంచి చేస్తున్న ప్రభుత్వం ఒకవైపు.. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ ఏ మంచీ చేయని పెద్దమనిషి మరో వైపు.. పేదవారి ప్రభుత్వం ఒకవైపు.. పెత్తందారులకు మద్దతు తెలిపే పార్టీ, దానికి మద్దతు ఇచ్చే వారు మరో వైపు.. పేద వారికి ఇంగ్లిష్ చదువులు చెప్పించాలని తపనపడే మనం ఒకవైపు.. పేద పిల్లలకు ఇంగ్లిష్ చదువులు అక్కర్లేదని చెప్పే పెత్తందారులు మరో వైపు.. పేద వారికి, నా అక్క చెల్లెమ్మలకు మంచి జరగాలని వివక్ష, లంచాలు లేకుండా నేరుగా బటన్ నొక్కే మీ జగన్ ఒకవైపు.. వీరికి మంచి జరగకూడదని, ఇంటి పట్టాలు ఇవ్వకూడదని ఏకంగా సామాజిక సమతుల్యం దెబ్బ తింటుందని కోర్టుకు వెళ్లి అడ్డుకునే వారందరూ మరో వైపు.. నేను నమ్ముకున్నది ధర్మాన్ని, సత్యాన్ని. దేవుడి దయ, మీ చల్లని ఆశీస్సులనే. అదే చంద్రబాబు నమ్ముకున్నది ఆ ఎల్లో పత్రికలను, ఎల్లో టీవీలను. వారి పునాది అబద్ధం, మోసం.

- సీఎం వైఎస్ జగన్

భోగాపురం విమానాశ్రయాన్ని సీఎం జగనే ప్రారంభించాలి



"నేను తొలుత నిర్మించిన హైదరాబాద్ విమానాశ్రయానికి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రారంభోత్సవం కూడా ఆయనే చేశారు. ఇప్పుడు ఆయన తనయుడు జగన్ భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. తిరిగి ఆయనే ప్రారంభోత్సవం చేయాలని కోరుకుంటున్నా. పోర్టులు, విమానాశ్రయాలు హైవేలతో అనుసంధానం కావాలనే ఆలోచన గొప్ప విషయం.

- జీఎంఆర్ అధినేత గ్రంథి మల్లికార్జునరావు

2 లో

దేశానికి గొప్ప బహుమతి సీఎం జగన్



"సీఎం జగన్ యూనిక్ విజనరీ లీడర్. ఏపీ నుంచి దేశానికి లభించిన గొప్ప బహుమతి జగన్. గతేడాది ఆంధ్రప్రదేశ్ సాధించిన జీడీపీ వృద్ధి ఇందుకు ఉదాహరణ. ప్రజలందరికీ సంక్షేమం అందిస్తున్న నవరత్నాల పథకాలను చూసి.. ప్రతి రాష్ట్రం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. త్వరలో ఏపీ డేటా సెంటర్ కేపిటల్‌గా అభివృద్ధి చెందుతుంది.

- అదానీ గ్రూప్ ఎండీ రాజేష్ అదానీ

టైర్–1 సిటీగా విశాఖ!

- 190 ఎకరాల్లో డేటా సెంటర్‌తో నగరానికి బూస్ట్
- అదానీ డేటా సెంటర్‌కు భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్

2 లో

విచారిస్తేనే వెలుగులోకి!

చంద్రబాబు సర్కారు కుంభకోణాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

మంత్రివర్గ ఉపసంఘం, సిట్ ఏర్పాటు జీవోలపై హైకోర్టు ఉత్తర్వులు రద్దు

హైకోర్టు స్టే ఇవ్వడాన్ని తీవ్రంగా ఆక్షేపించిన సుప్రీంకోర్టు

- అలాంటి ఉత్తర్వులు ఇచ్చి ఉండాల్సింది కాదన్న ధర్మాసనం.. ప్రభుత్వ జీవోలను హైకోర్టు తప్పుగా అన్వయించుకుంది
- గత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు, ఉల్లంఘనలపై దర్యాప్తు కోసమే ఆ జీవోలు
- గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించకూడదంటే ఎలా?
- కేంద్రం, ఈడీలను ప్రతివాదులుగా చేర్చకపోవడం సరికాదు.. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాన్ని కొట్టేసి ఉండాల్సింది కాదు
- కేంద్ర ప్రభుత్వం, ఈడీలను ప్రతివాదులుగా చేర్చి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోండి
- మూడు నెలల్లో ప్రధాన వ్యాజ్యాలను తేల్చాలని హైకోర్టుకు అత్యున్నత న్యాయస్థానం ఆదేశం




సాక్షి, అమరావతి: ఇన్నాళ్లూ సాంకేతిక కారణాలతో తప్పించుకుని తిరుగుతున్న మాజీ సీఎం చంద్రబాబు బృందం అక్రమాలపై 'స్టే'లను కొట్టివేస్తూ విచారణ కొనసాగించేందుకు వీలుగా అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. టీడీపీ సర్కారు హయాంలో చోటు చేసుకున్న అవినీతి బాగోతాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా విచారణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. అమరావతి భూ కుంభకోణం, ఏపీ ఫైబర్ నెట్ కుంభకోణం తదితరాల విషయంలో సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. గత సర్కారు తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, అవినీతి ఆరోపణలు, ఉల్లంఘనలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు మంత్రివర్గ ఉపసంఘం, సిట్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోల్లో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ హైకోర్టు 2020లో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తాజాగా అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. అసలు హైకోర్టు ఆ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చి ఉండాల్సింది కాదని వ్యాఖ్యానించింది. కేసు మొత్తం ఇంకా ప్రాథమిక దశలోనే ఉండగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం ఎంత మాత్రం సరికాదంది. ఈ జీవోలపై తదుపరి చర్యల నిలుపుదలకు హైకోర్టు చెప్పిన కారణాలు ఈ వ్యవహారానికి ఎంత మాత్రం సంబంధించినవి కావని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అంతేకాక గత ప్రభుత్వ నిర్ణయాలను ఆ తరువాత వచ్చే కొత్త ప్రభుత్వం సమీక్షించడానికి వీల్లేదన్న హైకోర్టు ఉత్తర్వులను సైతం

మిగతా 10వ పేజీలో ▶

"రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు తప్పుగా అన్వయించింది. గత సర్కారు నిర్ణయాలను రద్దు చేసినట్లుగా హైకోర్టు పరిగణించిందన్న రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ న్యాయవాది వాదనలు సమర్థనీయంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను పరిశీలిస్తే.. గత సర్కారు తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించటాన్ని రద్దు చేస్తున్నట్లుగా భావించలేం.

- 'సుప్రీం' ధర్మాసనం

సూత్రధారి చిక్కి 'నారా'!



- ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో అమరావతిలో ఎల్లో గ్యాంగ్ భూ దందా.. అసైన్డ్ భూములను కొల్లగొట్టిన పచ్చ గద్దలు
- రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాలు హస్తగతం
- నారా–నారాయణ అవినీతి మెలిక 'ఇన్నర్ రింగ్‌రోడ్డు'
- 'స్కిల్' కుంభకోణంలో రూ.241 కోట్లు లూటీ
- 'ఫైబర్ నెట్'లో రూ.284 కోట్ల దోపిడీ
- సిట్ దర్యాప్తులో ఇప్పటికే ఆధారాలతో సహా బహిర్గతం
- పలువురు పాత్రధారులను అరెస్టు చేసిన సిట్
- ఇప్పుడు ఇక సూత్రధారుల వంతు.. దూకుడుగా దర్యాప్తు

11 లో

అమరావతి పేరుతో భారీ అవినీతి

- అది దేశంలోనే అతిపెద్ద భూ కుంభకోణం
- చంద్రబాబు స్కామ్‌లపై అన్ని ఆధారాలున్నాయి
- నిజానిజాలు నిగ్గు తేల్చేందుకే 'సిట్' ఏర్పాటు
- సుప్రీం తీర్పుతో విచారణకు అడ్డంకులు తొలిగాయి
- తప్పు చేయకుంటే వణుకెందుకు?.. స్టే ఎందుకు?
- 'స్కిల్' స్కామ్‌లోనూ చంద్రబాబు హస్తం ఉంది
- భోగాపురం కోసం కొబ్బరికాయ కొట్టడం మినహా ఆయన చేసిందేమీ లేదు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల

10 లో


ఇదండీ సంగతి



పెళ్లి కూతురు తల్లికి

కళ్యాణమస్తు, షాదీ తోఫా సాయం

- ఈ ఏడాది ఫిబ్రవరిలో పెళ్లికుమార్తెల ఖాతాల్లో జమ
- వివిధ వర్గాల వినతుల మేరకు తాజా నిర్ణయం
- పెళ్లి కూతురు తల్లి మరణిస్తే తండ్రి లేదా అన్నదమ్ములకు..



సాక్షి, అమరావతి: ఈసారి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ఆర్థిక సాయాన్ని పెళ్లి కూతురు తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబర్ నెలల మధ్య ఈ పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసింది. అప్పట్లో ఈ ఆర్థిక సాయాన్ని పెళ్లి కూతురు బ్యాంకు ఖాతాలో జమ చేసింది. అయితే, వివిధ వర్గాల నుంచి అందిన వినతుల మేరకు ఈసారి ఆర్థిక సాయాన్ని పెళ్లి కుమార్తెల తల్లుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారులు వెల్లడించారు. ఒకవేళ తల్లి మరణిస్తే పెళ్లి కుమార్తె నిర్ణయం మేరకు ఆమె తండ్రి లేదా అన్నదమ్ములు లేదా గార్డియన్‌గా వ్యవహరించే ఇతరులకు ఆ ఆర్థిక సాయాన్ని అందజేస్తారు.

'ఉద్యానం' పెరిగింది

- మిర్చి, పసుపు, ఉల్లి, మిల్లెట్స్‌కు 'మద్దతు' దేశంలోనే తొలిసారి
- ఏపీలో సాగు విస్తీర్ణం, దిగుబడి, ఎగుమతులు బాగున్నాయి
- 2023–24 ఫోకస్ పత్రంలో వెల్లడించిన నాబార్డు



- వివరాలు 14లో

2030 నాటికి గ్లోబల్ డ్రోన్ హబ్‌గా భారత్



భారత్ దేశం 2030 నాటికి గ్లోబల్ డ్రోన్ హబ్‌గా మారుతుందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణా జిల్లా గంగూరులో బుధవారం డ్రోన్ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

5 లో

'వలస' ఏ పార్టీకో!

దశాబ్దాలుగా కన్నడ నాట ఇరుగు పొరుగు రాష్ట్రాల ఓటర్లు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. వ్యాపారాలు, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారు 65.45 లక్షల మంది వరకు ఉన్నారు. వీరి ఓట్ల కోసం అన్ని పార్టీలూ తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

- వివరాలు 6లో

వస్తోంది తుపాను

ఈ నెల 7న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం.. 8న వాయుగుండంగా, ఆపై తుపానుగా మార్పు

- ఉత్తర దిశగా బెంగాల్ వైపు పయనించే అవకాశం
- రాష్ట్రంపైనా ప్రభావం
- మరికొద్ది రోజులు భారీ వర్షాలు


నంద్యాల జిల్లా పాణ్యంలో జలమయమైన రహదారి

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో ఈ సీజన్‌లో తొలి తుపాను ఏర్పడబోతోంది. ముందుగా ఈనెల 6న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. అదే ప్రాంతంలో 7న అల్పపీడనంగా మారి, 8న వాయుగుండంగా బలపడనుంది. ఆ వాయుగుండం మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి ఉత్తర దిశగా పయనిస్తూ తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం వెల్లడించింది. అల్పపీడనం ఏర్పడ్డాక తుపాను దిశ, కదలిక, వేగం, తీవ్రత వంటి వాటిపై

మిగతా 11వ పేజీలో ▶

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు

రాష్ట్రవ్యాప్తంగా ఎడతెగని వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మండు వేసవిలో వర్షా కాలాన్ని మించి వానలు పడుతున్నాయి. విశాఖ, అనకాపల్లి, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో బుధవారం భారీ వర్షాలు కురిశాయి. కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో అత్యధికంగా 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో 95.75 మిల్లీ మీటర్లు, గుంటూరు జిల్లా తాడేపల్లిలో 95.2, శ్రీకాకుళం జిల్లా హరిపురంలో 90.25 మిల్లీమీటర్లు, కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 88.4, ఘంటసాలలో 80.5 పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 80.2, శ్రీకాకుళం జిల్లా పలాసలో 76.75, నిమ్మాడలో 71, పల్నాడు జిల్లా కారంపూడిలో 63.6, గుంటూరు జిల్లా మంగళగిరిలో 53.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అభివృద్ధికి చిరునామా

- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు కిరీటం
- శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్


భోగాపురం ఎయిర్‌పోర్టు నమూనాను పరిశీలిస్తున్న సీఎం జగన్


మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసిన చంద్రబాబు జనానికి మొహం చూపించగలడా.. అన్న సీఎం జగన్ ప్రశ్నకు.. చూపించలేడంటూ చేతులెత్తి చెబుతున్న జనం

భోగాపురం నుంచి సాక్షి ప్రతినిధి: 'ఉత్తరాంధ్ర ప్రాంతం అభ్యుదయానికే కాదు.. అభివృద్ధికీ చిరునామా. శ్రీకాకుళం జిల్లాలో కొద్దిరోజుల క్రితం శంకుస్థాపన చేసిన మూలపేట పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారమైతే.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కిరీటం' అని సీఎం వైఎస్ జగన్ అన్నారు. భోగాపురం విమానాశ్రయం నుంచి రానున్న 30 నెలల కాలంలో విమానాల రాకపోకలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. కేవలం ఉత్తరాంధ్రకే కాకుండా రాష్ట్ర వైభవానికీ కేంద్ర బిందువుగా మారనుందని అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన రూ.5 వేల కోట్లతో నిర్మించనున్న భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జున రావుతో కలిసి విమానాశ్రయ నమూనాను పరిశీలించారు. అనంతరం విజయనగరం జిల్లాలో 49 గ్రామాలకు తాగు నీరు, 30 వేల ఎకరాలకు సాగు నీటితో పాటు భోగాపురం విమానాశ్రయానికి తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.195 కోట్ల అంచనా వ్యయంతో తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు పనులకు భూమి పూజ చేశారు. రూ.26 కోట్లతో ఫిష్ హ్యాండ్లింగ్ సెంటర్‌కు.. విశాఖలో అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి దశలో రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ విమానాశ్రయానికి విశాఖ నుంచి 6 లేన్ల రహదారికి నాలుగు నెలల్లో శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. అదానీ డేటా సెంటర్‌తో విశాఖ టైర్–1 సిటీగా అభివృద్ధి చెందనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బహుశా దేశంలోనే అతిపెద్ద.. 300 మెగావాట్ల డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుండటం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఉపాధి కోసం ఇక ఇక్కడికే వలసలు

- మంచి మనసుతో చేస్తున్న మన కార్యక్రమాలను వరుణ దేవుడు ఆశీర్వదిస్తున్నారు. ఉత్తరాంధ్ర చరిత్రను మార్చాలనే సంకల్పంతో మనసా, వాచా, కర్మణా అడుగులు ముందుకు వేస్తున్నాం. సంస్కృతికి, సంప్రదాయానికి, కవిత్వానికి, ఉద్యమాలకు కూడా చిరునామా ఈ గడ్డ. కళింగాంధ్ర భావాల విప్లవానికి గజ్జెకట్టిన నేల కూడా ఇదే. అభ్యుదయానికి చిరునామాగా ఉన్న ఈ ప్రాంతం ఇక మీదట అభివృద్ధికి కూడా చిరునామాగా నిలవనుంది.
- ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో శంకుస్థాపన చేసిన మూలపేట పోర్టు రాబోయే రోజుల్లో తలరాతలు మార్చే పోర్టు. మరో 24 నెలల్లో ఇక్కడికి షిప్‌లు రానున్నాయి. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సమాన దూరంలో రాబోతున్న ఈ ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్రకు.. మొత్తంగా రాష్ట్ర వైభవానికి కేంద్ర బిందువుగా నిలవబోతోందని చెప్పడానికి సంతోషంగా ఉంది. విశాఖలో అదానీ డేటా సెంటర్ ద్వారా వచ్చే సబ్‌మెరైన్ కేబుల్స్‌తో మన రాష్ట్ర ఐటీ ముఖచిత్రం మారుతుంది.
- ఈ మూడు బృహత్తర కార్యక్రమాలతో రానున్న రోజుల్లో స్థానికంగా విస్తృత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఈ ప్రాంతానికే వలస వచ్చే పరిస్థితులు రానున్నాయి. టూరిజం, మెడికల్ టూరిజం, ఐటీ, పారిశ్రామికంగా ఈ ప్రాంతం అభివృద్ధిలో దూసుకుపోతుంది.

2026లో ఎయిర్‌పోర్టును నేనే ప్రారంభిస్తా..

- మరో మూడేళ్లలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయితే 2026 నాటికి ఇక్కడి నుంచి విమానాలు ఎగిరే పరిస్థితి రానుంది. ఈ రోజు ఇక్కడ పునాది రాయి వేశాం. 2026లో మళ్లీ మీ బిడ్డ, మీ అన్న, మీ తమ్ముడు ఇక్కడకు వచ్చి.. ఇదే ప్రాంగణం నుంచి ప్రారంభోత్సవం కూడా చేస్తాడని నమ్మకంగా చెబుతున్నా. దేవుని ఆశీస్సులు, మీ అందరి చల్లని దీవెనలతో అది జరుగుతుంది. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ఏమీ చేయలేరు. – భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాది రాయి వేస్తున్నామంటే జీర్ణించుకోలేని వ్యక్తులందరూ ఎలా మాట్లాడుతున్నారో టీవీల్లో, పేపర్లలో చూశాం. ఆశ్చర్యం అనిపించింది. నిజంగానే వాళ్ల హయాంలోనే ఈ స్థాయి ఉండి ఉంటే.. అప్పుడే ఈ ప్రాజెక్టు ఎందుకు ముందుకు కదలలేదు?
- సుప్రీంకోర్టులో, హైకోర్టులో కేసుల దగ్గరి నుంచి, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసుల వరకు అనేక కేసులను పరిష్కరించుకుంటూ వచ్చాం. కేంద్రం నుంచి అనేక అనుమతులు తీసుకొచ్చాం. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి.. నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నాం.
- ఎన్నికలకు 2 – 3 నెలల ముందు వాళ్లు ఇక్కడ టెంకాయ కొట్టి, వెళ్లిపోయారు. మళ్లీ నిస్సిగ్గుగా గతంలోనే మేం శంకుస్థాపన చేశామని చెబుతున్నారు. నిజంగా ఇంతకన్నా దారుణమైన పరిస్థితి ప్రపంచ చరిత్రలో ఎక్కడా ఉండదు.

ట్రాఫిక్‌కు తగ్గట్లుగా డిజైన్

- దాదాపుగా రూ.5 వేల కోట్లతో 2026 నాటికి ఏకంగా రెండు రన్‌వేలతో ఈ ప్రాజెక్టు టేకాఫ్ కానుంది. 7 ఏరో బ్రిడ్జిలతో, ప్యాసింజర్ టెర్మినల్, కార్గో టెర్మినల్, విమానాల మరమ్మతు యూనిట్, ఏవియేషన్ అకాడమీ, ఎనిమల్ క్వారంటైన్ తదితర సదుపాయాలతో పూర్తవుతుంది. ట్రాఫిక్ పెరిగే కొద్దీ ఏకంగా 4 కోట్ల జనాభాకు కూడా సరిపోయేలా డిజైన్ చేశారు.
- ఈ విమానాశ్రయంతో భారీ విమానం.. ఏ–380 కూడా (డబుల్ డెక్కర్ ఫ్లైట్.. ప్రపంచంలోనే అతి పెద్ద విమానం) సునాయాసంగా ల్యాండ్ అయ్యేలా 3.8 కిలోమీటర్ల పొడవైన రెండు రన్‌వేలు నిర్మాణం అవుతున్నాయి. ఎయిర్‌పోర్టు పక్కనే మరో 500 ఎకరాల్లో ఏరోసిటీని కూడా అభివృద్ధి చేయబోతున్నాం.
- ఇదే విమానాశ్రయానికి విశాఖ నుంచి 6 లేన్ల రహదారికి రూ.6,300 కోట్లతో మరో నాలుగు నెలల్లో శంకుస్థాపన చేయబోతున్నాం. దీనికి సంబంధించి ఇప్పుడే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడాను. పోర్టు, ఎయిర్‌పోర్టులతో.. ఇక్కడే ఉత్తరాంధ్రలో రాబోయే రోజుల్లో లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశాలు రాబోతున్నాయి.

24 నెలల్లో పూర్తి చేయాలని కోరాను

- ఈ రోజు ఎయిర్‌పోర్టు పనులు మొదలు పెట్టేందుకు జీఎంఆర్ గ్రూపు అధినేత గ్రంధి మల్లికార్జునరావు వచ్చారు. ఆయన ఈ ప్రాంతం వాసి. 36 నెలల్లో పూర్తి చేయాల్సిన ఈ ప్రాజెక్టును, అన్నా.. ఏమైనా ముందుకు జరపవచ్చా.. 24 నెలల్లో ఏమైనా చేయగలుగుతారా.. అని అడిగాను. 'ఇక్కడే పుట్టా. ఇది నాకు కూడా చాలా ఆత్మీయతతో కూడిన ప్రాజెక్టు. శాయశక్తులా కృషి చేసి 30 నెలల్లో పూర్తి చేస్తా' అని చెప్పారు. 24–30 నెలల్లో ఇక్కడ నుంచి విమానాలు తిరుగుతాయని నాకు గట్టి నమ్మకం ఉంది. ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు ధన్యవాదాలు.
- ఆకాశమంత మనసుతో ఈ విమానాశ్రయ నిర్మాణానికి భూములిచ్చిన ప్రతీ రైతన్నకు గుండెల నిండా ప్రేమతో శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. ఇప్పటికే 4 గ్రామాలకు చెందిన వారిని పునరావాస గ్రామాలకు తరలించాం. ఇందుకోసం దాదాపుగా 50 ఎకరాల్లో సుమారు రూ.80 కోట్లతో 2 గేటెడ్ కమ్యూనిటీలు నిర్మించాం.

చంద్రబాబు మీకు మొహం చూపించగలరా!

- మేనిఫెస్టో అంటే చంద్రబాబు హయాంలో మాదిరిగా 600 పేజీల బుక్కులు వేసి ఎన్నికలు అయిపోయాక చెత్తబుట్టలో వేసేది కాదు. మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.5 శాతం నెరవేర్చాం. మేనిఫెస్టోను ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించాము కాబట్టే అలా చేశాం. ఇదే మాదిరిగా చంద్రబాబు అడగగలడా? మీకు మొహం చూపించగలడా? (జనం రెండు చేతులు పైకెత్తి చూపలేరని చెప్పారు) ఇలా అడిగే అర్హత, నైతికత చంద్రబాబుకు ఉందా?
- 1995లో అధికారం కోసం కూతురిని ఇచ్చిన సొంత మామకు వెన్నుపోటు పొడిచి.. అధికారంలో ఉన్నన్నాళ్లూ చేసిన మంచి పనులంటూ ఏవీ లేవు. 2019లో సీఎం అయిన మీ బిడ్డ జగన్ వల్ల మీకు, మీ కుటుంబానికి జరిగిన మంచి ఏమిటని ఏ ఇంటి తలుపుతట్టినా ఇలా.. మంచి చేశాడని చెప్పే పరిస్థితి ఉంది.
- ఏ మంచి చేయని చంద్రబాబుకు ఒక ఈనాడు, ఒక ఆంధ్రజ్యోతి, ఒక టీవీ 5.. వీరికి తోడుగా ఒక దత్తపుత్రుడు ఉన్నారు. గతంలో ఇదే చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలతో మొదలుపెట్టి ఒక ఈనాడుకు ఇంత.. ఆంధ్రజ్యోతికి ఇంత... దత్తపుత్రుడికి ఇంత అని.. దాచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) అని ఈ గజదొంగల ముఠా రాష్ట్ర ప్రజలను, రాష్ట్రాన్ని దోచేసింది. అందుకే ఏ మంచీ చేయని చంద్రబాబుకు ఇంతగా తోడుగా ఉన్నారు.

మారుతున్న గ్రామాల రూపురేఖలు

- ఈ రోజు గ్రామాలు మారాయి. ఏ గ్రామంలో చూసినా సచివాలయంతో పాటు 50 మందికో వలంటీర్ కనిపిస్తున్నారు. సచివాలయ వ్యవస్థలో మన పిల్లలే చక్కగా చిరునవ్వుతో లంచాలు తీసుకోకుండా మంచి పనులు చేస్తున్నారు. మరో నాలుగడుగులు వేస్తే నాడు–నేడుతో రూపురేఖలు మారిన ఇంగ్లిష్ మీడియం స్కూల్ కనిపిస్తుంది. కొంచెం ముందుకు వెళ్తే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటికే డాక్టర్‌ను తీసుకొచ్చిన విలేజ్ క్లినిక్.. రైతన్నలను చేయి పట్టుకుని నడిపించే ఆర్బీకే కనిపిస్తుంది. అన్‌లిమిటెడ్ ఇంటర్నెట్ సౌకర్యంతో ఇంటి వద్ద నుంచే పనిచేసే డిజిటల్ లైబ్రరీల వ్యవస్థ ఏర్పాటు కానుంది.
- ఈ మార్పు మన కళ్లెదుటే కనిపిస్తోంది. అప్పుడూ, ఇప్పుడూ ఇదే బడ్జెట్.. ఇదే రాష్ట్రం. అప్పులు కూడా చంద్రబాబు చేసిన దానికంటే తక్కువ. అయినా ఇవన్నీ చేస్తున్నాం. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు? ఎందుకు చంద్రబాబు చేయలేకపోయాడని ఆలోచించండి. ఈ విషయాన్ని గ్రామ స్థాయిలో ప్రతీ ఇంటికీ తీసుకెళ్లండి. మీ బిడ్డకు దేవుడి దయ, మీ అందరి చల్లని దీవెనలు ఉండాలని మరోసారి కోరుకుంటున్నా.
- ఈ కార్యక్రమంలో జీఎంఆర్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, అదానీ గ్రూప్ ఎండీ, సీఈవోలు రాజేష్ అదానీ, కరణ్ అదానీ, స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, కలెక్టర్లు మల్లికార్జున, నాగలక్ష్మి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం మనందరి ప్రభుత్వం వేస్తున్న అడుగులను మీకందరికీ గుర్తు చేస్తున్నా. ఉత్తరాంధ్ర అంటే బ్రిటీషర్లను గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి జన్మించిన పౌరుషాల గడ్డ. అందుకే కొత్త జిల్లాకు అల్లూరి సీతారామరాజు జిల్లాగా నామకరణం చేశాం. మూడు జిల్లాలుగా ఉన్న ఉత్తరాంధ్రను మరింత మెరుగు పరుస్తూ.. ముగ్గురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్లు సరిపోరని.. 6 జిల్లాలుగా చేశాం.
- కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే తపన, తాపత్రయంతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనులను మొదలుపెట్టి పూర్తి చేశాం. ఈ జూన్‌లో దానిని జాతికి అంకితం చేయబోతున్నాం. ఇచ్ఛాపురం, పలాస ప్రాంతాలకు తాగునీటిని పైపుల ద్వారా తరలించేందుకు రూ.700 కోట్లతో తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించి ఈ జూన్‌లో పూర్తి చేస్తున్నాం. పాతపట్నం నియోజకవర్గానికి మంచి చేస్తూ.. అదే రోజు అక్కడే మరో రూ.265 కోట్లతో ఇదే తాగునీటి ప్రాజెక్టును విస్తరించే పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నాం.
- కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కాలేజీ పనులు, పాడేరు ట్రైబల్ మెడికల్ కాలేజీ పనులు.. పాతపట్నం, నర్సీపట్నం, విజయనగరంలో మెడికల్ కాలేజీ పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయనగరం మెడికల్ కాలేజీని ఈ ఆగస్టు–సెప్టెంబర్‌లో నేనే వచ్చి ప్రారంభిస్తాను. ఈ నాలుగేళ్లలో ఎప్పుడూ జరగని విధంగా ఈ ఉత్తరాంధ్రలో 4 మెడికల్ కాలేజీలను కడుతున్నామని చెప్పేందుకు గర్వపడుతున్నా. సాలూరులో గిరిజన యూనివర్సిటీకి ఈ జూన్–జూలైలో శంకుస్థాపన చేయబోతున్నాం. దానికి సంబంధించి భూసేకరణ పూర్తి చేశాం.
- విజయనగరంలో జేఎన్‌టీయూ గురజాడ యూనివర్సిటీ ఇప్పటికే నెలకొల్పాం. దశాబ్దాల కల నెరవేరుస్తూ మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేశాం. మరో 24 నెలల్లో ఉత్తరాంధ్ర ప్రజలకు అంకితం చేయబోతున్నాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విశాఖనగరం నుంచి అనుసంధానంగా 6 లేన్ల రహదారికి మరో నాలుగు నెలల్లో శంకుస్థాపన చేయబోతున్నాం.
- వీటన్నింటికి మించి పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకే కాకుండా రాజధాని స్థాయికి కూడా తీసుకెళ్లే విధంగా అడుగులు వేస్తున్నాం. రాష్ట్రంలో అతిపెద్దది, రాష్ట్రంలో అందరికీ ఆమోదయోగ్యమైన నగరం విశాఖలో మీ బిడ్డ కాపురం ఉండబోతున్నారని చెప్పేందుకు సంతోష పడుతున్నా.

నిజాయితీగా ప్రతి తలుపూ తడుతున్నాం


మా నమ్మకం నువ్వే జగనన్నా.. అంటూ ప్రజల ఉత్సాహం

పేదలకు మంచి జరగాలని.. పేదలు, మధ్యతరగతికి అండగా నిలవాలని అడుగులు వేస్తున్నాం. మీ బిడ్డ పాలనలో కులం లేదు, మతం లేదు, ప్రాంతం లేదు, పార్టీ లేదు. మన పార్టీకి ఓటు వేశారా లేదా అన్నది కూడా చూడటం లేదు. కాబట్టే 47 నెలల కాలంలో దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా రూ.2.10 లక్షల కోట్లు.. నేరుగా మీ బిడ్డ బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల అకౌంట్లలోకి వేశారు. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. గతానికి, ఇప్పటికి.. చంద్రబాబుకు, మీ జగన్‌కు మధ్య తేడా మీరే చూడండి.

మనందరి ప్రభుత్వంలో మీకు ఇవి అందాయా అంటూ.. రాష్ట్రంలో కోటి 50 లక్షల కుటుంబాలను ప్రేమగా, ఆప్యాయంగా అడుగుతున్నాం. చంద్రబాబు అన్ని ఏళ్ల పాలనలో కన్నా.. మన ప్రభుత్వంలో పథకాలు అందితేనే, మీకు మంచి జరిగిందని భావిస్తేనే నన్ను ఆశీర్వదించండని రైతన్నలు, బడులకు పోయే పిల్లలు, నా అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు.. అన్నదమ్ములను నిజాయితీగా, చిత్తశుద్ధితో అడుగుతున్నాం.

టైర్–1 సిటీగా విశాఖ!

- అదానీ డేటా సెంటర్‌కు భూమి పూజ కార్యక్రమంలో సీఎం జగన్
- 300 మెగావాట్లతో ఏర్పాటయ్యే డేటా సెంటర్ దేశంలోనే పెద్దది
- అందుబాటులోకి సింగపూర్ నుంచి సబ్‌మెరైన్ కేబుల్ వ్యవస్థ
- తద్వారా మరింత పెరగనున్న కనెక్టివిటీ, ఇంటర్నెట్ స్పీడ్
- ఐటీ రంగానికి ఊతం.. పరిశ్రమలు, ప్రజలకు వరం
- ఈ ఒక్క కేంద్రం నుంచే 40 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు


అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


సీఎంకు జ్ఞాపిక ఇస్తున్న అదానీ గ్రూప్ ఎండీ రాజేష్‌అదానీ, సీఈవో కరణ్ అదానీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: టైర్–2 సిటీగా ఉన్న విశాఖ.. అదానీ డేటా సెంటర్ రాకతో టైర్–1 సిటీగా మారే గొప్ప ప్రక్రియకు అడుగు పడిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మధురవాడ ఐటీ హిల్–4లో అదానీ గ్రూప్ రూ.21.844 కోట్లతో నిర్మిస్తున్న వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్‌కు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. విశాఖలో 300 మెగావాట్ల సామర్థ్యమున్న ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్ పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం చరిత్రాత్మక ఘట్టం అని చెప్పారు. 190 ఎకరాల ప్రాంగణంలో నిర్మించే డేటా సెంటర్ విశాఖకు గొప్ప ప్రోత్సాహకంగా నిలుస్తుందని, విశాఖ రూపురేఖలు మారుస్తుందని ఆకాంక్షించారు. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌గా రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా మారనుందని తెలిపారు. ఇది పూర్తి స్థాయి గ్రీన్ ఎనర్జీతో ఏర్పాటవుతోందని, సహజ వనరుల ద్వారా లభించే విద్యుత్తునే ఈ డేటా సెంటర్‌కు వినియోగించడం చాలా ప్రాధాన్యమైన అంశం అని చెప్పారు. డేటా సెంటర్ ఏర్పాటులో భాగంగా సింగపూర్ నుంచి సబ్‌మెరైన్ కేబుల్ వ్యవస్థను తీసుకువస్తుండటం వల్ల ఇంటర్నెట్ కనెక్టివిటీ, వినియోగం, స్పీడ్ గణనీయంగా పెరుగుతుందన్నారు. డేటా డౌన్లోడ్, అప్‌లోడ్ శరవేగంగా జరుగుతాయని, తద్వారా ఇక్కడి ఐటీ పరిశ్రమలు, ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ తరహా ఆధునిక సదుపాయాల వల్ల విశాఖ నగరం మహా నగరంగా ఎదగడానికి దోహద పడుతుందన్నారు.

ఐటీ కార్యకలాపాల్లో వేగం

కేవలం డేటా సెంటర్ మాత్రమే కాకుండా ఇక్కడ ఐటీ డెవలప్‌మెంట్ పార్క్, ఐటీ స్కిల్ యూనివర్సిటీ, రిక్రియేషన్ సెంటర్.. ఇలా అన్ని కాంబినేషన్స్‌తో వైజాగ్ టెక్ పార్క్‌ను అదానీ గ్రూప్ అభివృద్ధి చేస్తోందని సీఎం జగన్ తెలిపారు. దీంతో పాటు బిజినెస్ పార్కు కూడా ఏర్పాటవుతుందన్నారు. దీనివల్ల క్లౌడ్ సర్వీసులు కూడా మెరుగు పడి, ఐటీ కార్యకలాపాల్లో వేగం పెరుగుతుందని.. తద్వారా విశాఖలో ఐటీ రంగానికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు. 'దశల వారీగా ఏడేళ్లలో రూ.21,844 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా ఈ కేంద్రం నుంచే సుమారు 40 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన అదానీ గ్రూపునకు ధన్యవాదాలు. వీటన్నింటి వల్ల రాష్ట్ర ప్రజలకు ఇంకా మంచి జరగాలని, అలా మంచి చేసే అవకాశం దేవుడు కల్పించాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదానీ గ్రూప్ ఎండీ రాజేష్ అదానీ, గ్రూప్ సీఈవో కరణ్ అదానీ, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ ఆపన్నహస్తం..

సాక్షి ప్రతినిధి, విజయనగరం/పూసపాటిరేగ/భోగాపురం: ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా భోగాపురం ఎయిర్ పోర్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి బుధవారం విచ్చేసిన సీఎం వైఎస్ జగన్ ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందజేశారు. హెలిప్యాడ్ వద్దకు వచ్చిన బాధితులను ఆయన ఆప్యాయంగా పలకరించారు. వారి కష్టాన్ని ఓపికగా విని.. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అవసరమైన వారికి తక్షణ సాయంతోపాటు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ఊరు	వ్యాధి/సమస్య
వై.అనసూయ (కుమారుడు రమణ వినతి)	పేరిపి, చీపురుపల్లి మండలం	బ్రెయిన్ ట్యూమర్
కిలిమి తోటయ్య రెడ్డి	దల్లిపేట, భోగాపురం మండలం	విద్యుత్ షాక్‌తో రెండు చేతులు కోల్పోయాడు
నాజాన సురేష్	సూరమ్మపేట, రణస్థలం మండలం	రెండు కాళ్లకు పెరాలసిస్
పానుగంటి హేమలత (తల్లి లావణ్య కేకలు విని సీఎం హెలీప్యాడ్ వద్దకు పిలిపించారు.)	కందిస, రేగడి ఆమదాలవలస మండలం	కంటి క్యాన్సర్


చిన్నారి హేమలత కంటి క్యాన్సర్ సమస్యను సీఎం జగన్‌కు వివరిస్తున్న తల్లి లక్ష్మీలావణ్య


సాయం చేయాలని సీఎం జగన్‌ను కోరుతున్న విద్యుత్‌షాక్ బాధితుడు తోటయ్య


అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని సీఎంను కోరుతున్న నాజాన సురేష్


బ్రెయిన్‌ట్యూమర్‌తో బాధపడుతున్న తల్లి అనసూయకు సాయం చేయాలని కోరుతున్న కుమారుడు రమణ

భోగాపురం విమానాశ్రయాన్ని సీఎం జగనే ప్రారంభించాలి

- ఈ విమానాశ్రయం ఏపీ ఆర్థిక వ్యవస్థకు ఇంజన్
- జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు



భోగాపురం నుంచి సాక్షి ప్రతినిధి: 'ప్రపంచంలో చాలా విమానాశ్రయాలు నిర్మించాను. నా సొంత ఊరు రాజాం. వైజాగ్ రెండో ఊరు. నేను తొలుత నిర్మించింది హైదరాబాద్ విమానాశ్రయం. దానికి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. మళ్లీ ప్రారంభోత్సవం చేసిందీ ఆయనే. రెండవది ఢిల్లీ విమానాశ్రయం. దాని ప్రారంభోత్సవంలోనూ పాల్గొన్నారు. ఈ రోజు భగవంతుడి నిర్ణయమే కాబోలు.. ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. తిరిగి ఆయనే ప్రారంభోత్సవం చేయాలని భగవంతుడిని కోరుకుంటున్నాను' అని జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తనకిప్పుడు 73 ఏళ్లని, ఇన్నేళ్లలో ఇది తనకు ఎంతో సంతృప్తికరమైన రోజని చెప్పారు. సీఎం జగన్ ముందస్తు ఆలోచన తీరు, విధానాలు, మౌలిక సదుపాయాలపై ఆయనకున్న దృష్టి.. శ్రద్ధ, పోర్టులు, విమానాశ్రయాలు హైవేలతో అనుసంధానం కావాలనే ఆలోచన గొప్ప విషయం అని కొనియాడారు. ఇందువల్లే ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో అంత పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆ సదస్సులో తానూ పాల్గొన్నానని గుర్తు చేశారు. 'ప్రపంచంలో అనేక విమానాశ్రయాలు నిర్మించాం. ఇది 12వ విమానాశ్రయం. ఎక్కడ విమానాశ్రయాలు నిర్మించినా, ప్రపంచ శ్రేణిలో నిర్మాణం చేపడతాం. మొదట్లో హైదరాబాద్ విమానాశ్రయంలో 7 ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉండేవి. ఈ రోజు 500 ఉన్నాయి. విమానాశ్రయ నిర్మాణంతో ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అదే విధానంలో భోగాపురం విమానాశ్రయం ఏపీ ఎకానమీకి ఇంజన్‌గా మారుతుంది. చాలా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. కార్గో ఎయిర్‌పోర్టు రైతులకు, మత్స్యకారులకు, ఫార్మా పరిశ్రమల ఎగుమతులకు ఎంతో ఉపయుక్తం. ఏపీ సంస్కృతికి అనుగుణంగా డిజైన్ చేశాం. మూడేళ్లలో కార్యకలాపాలు ప్రారంభిస్తాం. ఢిల్లీ, హైదరాబాద్ స్థాయిలో భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మిస్తాం. ఈ రోజు వర్షం కురిపిస్తూ ఆ భగవంతుడు మనల్ని దీవించారు. నిజంగా ఇది ఎంతో సంతోషకరమైన రోజు. ఇందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు' అని అన్నారు.

దేశానికి గొప్ప బహుమతి సీఎం జగన్


- ఎన్ని ఇబ్బందులున్నా ఆగని సంక్షేమాభివృద్ధి.. నవరత్నాల ద్వారా ప్రతి రాష్ట్రం నేర్చుకోవాలి
- డేటా సెంటర్, ఇంధనంలో భారత్‌కు పెద్దన్నగా ఆంధ్రప్రదేశ్
- అదానీ గ్రూప్స్ ఎండీ రాజేష్ అదానీ



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అద్వితీయమైన ముందుచూపు ఉన్న నాయకుడు (యూనిక్ విజనరీ లీడర్). ఏపీ నుంచి దేశానికి లభించిన గొప్ప బహుమతి వైఎస్ జగన్. గతేడాది ఆంధ్రప్రదేశ్ 17 శాతం జీడీపీ వృద్ధి సాధించడమే దీనికి ఉదాహరణ. ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా, ఏమాత్రం రాజీ పడకుండా సంక్షేమాభివృద్ధి పథకాల అమలులో ముందుకు వెళ్తున్నారు. పాలన వికేంద్రీకరణలో భాగంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. ప్రజలందరికీ సంక్షేమం అందిస్తున్న నవరత్నాల పథకాలను చూసి.. ప్రతి రాష్ట్రం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది' అని అదానీ గ్రూప్స్ ఎండీ రాజేష్ అదానీ అభిప్రాయపడ్డారు. విశాఖలోని మధురవాడ ఐటీ హిల్స్–4లో ఏర్పాటు చేయనున్న అదానీ డేటా సెంటర్‌కు సీఎం జగన్‌తో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోర్టులు, పునరుత్పాదక ఇంధన వనరులు, లాజిస్టిక్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌తో అదానీ గ్రూప్ బంధం కొనసాగిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే రూ.20 వేల కోట్లు పెట్టుబడులు పెట్టామని, తద్వారా 20 వేల మందికి ప్రత్యక్షంగా, 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద ప్రైవేట్ పోర్టులుగా కృష్ణపట్నం, గంగవరం పోర్టుల్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవలే 15 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనం ఉత్పత్తి ప్రాజెక్టుతో పాటు, ఏడాదికి 10 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తికి సంబంధించిన ప్రాజెక్టులపై ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. డేటా ఉత్పత్తి, వినియోగం, స్టోరేజీలో అడ్వాన్స్ టెక్నాలజీలోనూ రాష్ట్రం ఇకపై దూసుకుపోతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హై డెఫిషియన్స్ కంటెంట్, డిజిటలైజేషన్‌పై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో భౌగోళిక పరిస్థితులు, సుదీర్ఘ సాగర తీరం రెన్యువబుల్ ఎనర్జీకి, ఇతర అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ కేవలం డేటాపార్క్‌కు మాత్రమే కాకుండా, ఇంధన ఉత్పత్తి రంగంలోనూ దేశానికి పెద్దన్నగా మారనుందని వివరించారు.

భారత్‌కు డేటా సెంటర్ కేపిటల్‌గా ఏపీ

దేశంలోని మిగిలిన డేటా సెంటర్లకు.. విశాఖలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ డిజిటల్ ఎంబసీగా వ్యవహరించనుందనడంలో ఎలాంటి సందేహం లేదని రాజేష్ అదానీ స్పష్టం చేశారు. 'దక్షిణాసియా నుంచి అండర్ సీ కేబుల్స్ ద్వారా డేటా సెంటర్ నెట్‌వర్క్ కనెక్ట్ అవ్వనుంది. ప్రారంభం నుంచి 100 శాతం గ్రీన్ పవర్ ద్వారా ఈ డేటాసెంటర్ నిర్వహించాలని అదానీ గ్రూప్ నిర్ణయించుకుంది. దానికనుగుణంగా ప్రాజెక్టుని రూపొందించాం. మొత్తం 300 మెగావాట్లతో రూ.22 వేల కోట్ల పెట్టుబడులతో ఏడేళ్లలోపు డేటా సెంటర్‌ని భాగస్వాములతో కలిసి దశల వారీగా పూర్తి చేస్తాం. వాక్ టూ వర్క్ కాన్సెప్ట్‌తో బిజినెస్ పార్క్ కూడా ఏర్పాటు చేయనున్నాం. దీని ద్వారా వేల మందికి ఉపాధి లభించనుంది. విశాఖపట్నం దేశానికే కాదు.. యావత్ ఆసియా దేశాలకు డేటా సెంటర్ రాజధానిగా మారనుంది. విశాఖలో ఏర్పాటు చేస్తున్న దేశంలోనే మొట్టమొదటి డేటా సెంటర్ బిజినెస్ పార్క్ ద్వారా ఆంధ్రప్రదేశ్.. భారత్‌కు డేటా సెంటర్ కేపిటల్‌గా అభివృద్ధి చెందనుంది' అని తెలిపారు.


JEE (MAIN) 2023లో
నిరంతరం ఛాంపియన్లను తయారు చేస్తున్న ఏకైక సంస్థ
Aakash + BYJU'S
100 Percentile in Physics & Maths AIR 8 Dhruv Sanjay Jain 4 Year Classroom 100 Percentile
100 Percentile in Maths AIR 21 Kamyak Channa 4 Year Classroom 100 Percentile
100 Percentile in Physics & Chemistry AIR 46 Anoop Singh 4 Year Classroom 99.99 Percentile
100 Percentile in Chemistry AIR 64 Aakarsh D Reja 4 Year Classroom 99.99 Percentile
100 Percentile in Maths AIR 89 Nikhilesh Joshi 4 Year Classroom 99.99 Percentile
12918# Aakashians Qualified for JEE (ADV.) 2023
(11473 Classroom + 1445 Distance & Digital)
#Still Counting
974* 99 Percentile & above
11* in Top 100 AIR (All India Rank)
45* in Top 500 AIR (All India Rank)
*Including Students from Classroom, Digital & DLP Courses across all Categories
Top Performers from Our Classroom Programs
AIR 125 Aditya Neeraje 2 Year Classroom 99.99 Percentile
100 Percentile in Physics AIR 127 Mozeel Vanwani 1 Year Classroom 99.99 Percentile
100 Percentile in Physics AIR 130 Adit Jindal 4 Year Classroom 99.99 Percentile
100 Percentile in Maths AIR 165 Tanishq M 4 Year Classroom 99.99 Percentile
100 Percentile in Physics AIR 167 Shivanshu Kumar 4 Year Classroom 99.99 Percentile
AIR 178 Aritra Ray 4 Year Classroom 99.99 Percentile
AIR 199 Amritanshu Singh 2 Year Classroom 99.98 Percentile
100 Percentile in Physics AIR 203 Shreyansh Solanki 4 Year Classroom 99.98 Percentile
AIR 209 Vaibhav Raj 4 Year Classroom 99.98 Percentile
AIR 221 Kundan Maiti 2 Year Classroom 99.98 Percentile
100 Percentile in Physics AIR 229 Shiv Narang 4 Year Classroom 99.98 Percentile
Odisha Topper 100 Percentile in Physics & Maths AIR 243 Priyanka Sar 2 Year Classroom 99.98 Percentile
100 Percentile in Maths AIR 261 Md Sahil Akhtar 4 Year Classroom 99.98 Percentile
AIR 264 Aman Maloo 1 Year Classroom 99.98 Percentile
AIR 274 Amber Agarwal 2 Year Classroom 99.98 Percentile
100 Percentile in Maths AIR 279 V Mithun 4 Year Classroom 99.98 Percentile
100 Percentile in Physics AIR 299 Raktim Kundu 2 Year Classroom 99.98 Percentile
JEE అడ్వాన్స్‌డ్‌లో స్థిరమైన ఫలితాలను అందించడం మా ప్రాముఖ్యత
2020 MIT, USA 1 AIR (Female Category) 2022 IIT Bombay
Chirag Falor 4 Year Classroom
Tanishka Kabra 4 Year Classroom
Scan code to check all the ranks & hear what the toppers have to say
Though every care has been taken to publish the result correctly, yet Aakash Educational Services Ltd. shall not be responsible for inadvertent error, if any.
and many more top performers across 300+ Branches in India
అత్యుత్తమ ప్రదర్శన చూపిన మన దక్షిణ భారత విద్యార్థులు
100 Percentile Mathematics 99.99 Percentile AIR 89 Nikhilesh Joshi 4 Year Classroom
99.99 Percentile AIR 125 Aditya Neeraje 2 Year Classroom
99.98 Percentile AIR 209 Vaibhav Raj 4 Year Classroom
100 Percentile Mathematics 99.98 Percentile AIR 279 V Mithun 4 Year Classroom
99.96 Percentile AIR 468 Yuv Verdia 2 Year Classroom
99.96 Percentile AIR 527 Gunje Manideep Ram 4 Year Classroom
99.96 Percentile AIR 532 Poorvie Sadagopan 2 Year Classroom
and many more...
అడ్మిషన్లు జరుగుచున్నవి
CLASS 12th Appeared / Passed Students Long Term Batch for NEET / JEE 2024
CLASS 8th-10th Studying Students Integrated Courses* for NTSE / Olympiad / School Boards
* Please Contact the nearest Branch for more details...
CLASS 10th Moving to Class 11th 2 Year Integrated Courses for NEET / JEE / EAPCET
CLASS 12th Studying Students 1 Year Integrated Courses for NEET / JEE / EAPCET
90% వరకు స్కాలర్‌షిప్ పొందండి*
11 Branches in Andhra Pradesh
Kadapa: 8800898028
Kakinada: 8800789546
Kurnool: 8800013008
Nellore: 8800012982
Rajahmundry: 8800012983
Tirupati: 8800013010
Vijayawada: 8800013015
VISAKHAPATNAM
Dwarka Nagar: 8800013011
Gajuwaka: 8800013012
Madhurawada: 8800548130
Scan code to locate the nearest branch
Aakash BYJU'S Information Centre: Vizianagaram: 8448799006
Now in Guntur: 8800971868
Telangana Branches: HYDERABAD:(Himayat Nagar): 8800013001, (Kondapur): 8800897955, (Kothapet): 8800013004, (Kukatpally): 8800013003, (Shaikpet): 8800013006, (S R Nagar): 8800013002, (Trimulgherry): 8800013009, KARIMNAGAR: 8800013007, WARANGAL: 8800013016, NIZAMABAD: 8800857521. Two more Aakash BYJU'S Branches in Hyderabad now Suchitra: 9205558729 & Habsiguda: 8800950201. Aakash BYJU'S Information Centre: Mancherial: 9100078157
Download Aakash App
GET IT ON Google Play
Download on the App Store
CALL (TOLL-FREE) 1800-102-2727
VISIT aakash.ac.in
Aakash + BYJU'S



అతి వేగంగా ఖర్చు పెట్టేవాళ్లు ఎప్పటికీ ధనవంతులుగా మారలేరు.
– హొనొరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 4 మే 2023

మహా చాణక్యం

అన్నట్టే అయింది. పదిహేను రోజుల్లో రెండు రాజకీయ ప్రకంపనలు సంభవిస్తాయని జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ కుమార్తె – ఎంపీ అయిన సుప్రియా సులే రెండు వారాల క్రితం అన్నట్టే మొదటి ప్రకంపన మంగళవారం ఎదురైంది. రాజకీయ కురువృద్ధుడూ, 24 ఏళ్ళుగా ఎన్సీపీకి పెద్ద దిక్కూ అయిన శరద్ పవార్ తన సొంత పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలగుతున్నట్టు రాజకీయ బాంబు పేల్చారు. చుట్టూ పార్టీ నేతలు ఉండగా, ఆత్మకథ రెండో ముద్రణ ఆవిష్కరణ వేదికగా శరద్ చేసిన ఆకస్మిక ప్రకటన కొందరిని కన్నీరు పెట్టించింది. మనసు మార్చుకొమ్మంటూ మరికొందరు ప్రాథేయపడేలా చేసింది. అనేక నాటకీయ పరిణామాల మధ్య కొద్ది గంటల వ్యవధిలోనే పునరాలోచనకు తనకు రెండు, మూడు రోజుల సమయం కావాలని శరద్ అంగీకరించేలా చేసింది. అనూహ్య నిర్ణయాలతో అవతలివారిని ఆత్మరక్షణలో పడేయడంలో ఆరితేరిన ఈ అపర చాణక్యుడి తాజా నిర్ణయానికి కారణాలు, పర్యవసానాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. జాతీయస్థాయి ప్రతిపాదిత ప్రతిపక్ష కూటమిలోనూ మల్లగుల్లాలు సాగుతున్నాయి.

అయిదున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న 82 ఏళ్ళ శరద్ భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకొనే రకం కాదు. ఆలోచన నిండిన ఆచరణవాది. అందుకే, ఆయన తాజా ఎత్తుగడ ఆసక్తికరం. నాలుగు విడతల మాజీ డిప్యూటీ సీఎం, శరద్ అన్న కుమారుడైన అజిత్ పవార్ సీఎం పదవిపై కన్నేశారనీ, చివరకు బీజేపీ అండతో కోరిక నెరవేర్చుకునేలా పావులు కదుపుతున్నారనీ కొన్ని వారాలుగా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పైకి ఆ వాదనను అజిత్ సహా అందరూ కొట్టిపారేసినా, శరద్ హఠాత్ ప్రకటనతో ఒక్కొక్క పొర తొలగిపోతోంది. ఆ మధ్య ఎన్సీపీ ఎమ్మెల్యేలు బీజేపీతో జట్టు కట్టనున్నారని తెలిసిన వెంటనే శరద్ అదేమీ పట్టనట్టుగా దర్యాప్తు సంస్థల సమన్లను ఎదుర్కొనలేనివారు పార్టీ వదలిపోవచ్చంటూ ముందరి కాళ్ళకు బంధం వేశారు. తాజాగా పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా ద్వారా, ఒకరకంగా బీజేపీ అండతో అజిత్ సీఎం పీఠాన్ని అధిష్ఠించడానికి మార్గం సుగమం చేస్తూనే, కార్యకర్తలపై పట్టు బిగించారు.

నిజానికి, ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ శిందేల మధ్య శివసేన రెండుగా చీలి, కథ కోర్టుకెక్కిన 'సేన వర్సెస్ సేన' కేసులో సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగ ధర్మాసనం ఏ క్షణంలోనైనా తీర్పు ప్రకటించవచ్చు. వచ్చే తీర్పును బట్టి ఏం జరగవచ్చు, అప్పుడేం చేయాలని రాజకీయ పార్టీలన్నీ ఇప్పటికే లెక్కలు వేసుకుంటున్నాయి. ఉద్ధవ్‌పై తిరుగుబాటు చేసి, ముందుగా జట్టు కట్టిన ఏక్‌నాథ్ సహా 16 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటును సుప్రీం సమర్థిస్తే, సమీకరణాలు మారతాయి. ఆ పరిస్థితుల్లో సీఎం ఏక్‌నాథ్ అనర్హుడవడంతో పాటు ప్రస్తుత బీజేపీ – ఏక్‌నాథ్ శిందే ప్రభుత్వం మైనారిటీలో పడిపోతుంది. అప్పుడిక కొత్త మిత్రపక్షంగా అజిత్‌ను కలుపుకోవాలన్నది బీజేపీ వ్యూహం. దానికి తగ్గట్టే ఎన్సీపీని చీల్చి, శరద్‌కు రాజకీయ వారసుడిగా బీజేపీతో అజిత్ చేతులు కలుపుతారని గుప్పుమంది. అనివార్యతను అర్థం చేసుకున్న శరద్ గతంలో ఎన్టీఆర్, ములాయమ్ సింగ్‌ల లాగా వారసత్వ పోరులో బలికావడం ఇష్టం లేక వ్యూహాత్మకంగా రాజీనామా అస్త్రం సంధించినట్టుంది.

శరద్ రాజీనామాపై ఇతరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ, వయసు, ఆరోగ్యరీత్యా శరద్ నిర్ణయాన్ని గౌరవించాలనీ, ఆయన రాజీనామాను వెనక్కి తీసుకోరనీ భవిష్యత్తు గురించి మాట్లాడుతున్నది ఒక్క అజితే. దీన్నిబట్టి సూక్ష్మం గ్రహించవచ్చు. రక్తసంబంధీకులతో శరద్ తన నిర్ణయాన్ని ముందే చర్చించారట. బాబాయ్ ప్రకటన తర్వాతా తొణకని, బెణకని అబ్బాయ్ అజిత్ అందరిలా రాజీనామా ఉపసంహరణకు అభ్యర్థించకపోగా, 'ఏదో ఒకరోజు ఇది జరగాల్సిందేగా' అనడం పవర్ పాలిటిక్స్‌కు పరాకాష్ఠ. సీఎం కావాలన్న అజిత్ ఆశతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐలను కీలుబొమ్మలుగా ఆడిస్తూ, ప్రత్యర్థులను వేధించే బీజేపీ ఘనచరితా దీనికి కారణమే. దర్యాప్తు సంస్థలు వెంటాడుతున్న ఎన్సీపీ నేతలు ప్రఫుల్ పటేల్ వగైరా సైతం శరద్‌తో అనివార్యత చర్చించి, ఒప్పించారట. ఎమ్మెల్యేలు బీజేపీతో నెయ్యానికి తొందరపడుతున్న వేళ ఈ సుదీర్ఘ లౌకిక రాజకీయవాది పార్టీని కాపాడుకుంటూనే, తన చేతికి మరక అంటని రీతిలో తాజా వ్యూహానికి తెర తీశారు.

మిగిలిన మూడేళ్ళ రాజ్యసభ సభ్యత్వంలోనూ బాధ్యతలేమీ తీసుకోకుండా, దేశం కోసం, మహారాష్ట్ర కోసం పనిచేస్తానని శరద్ ఉద్ఘాటించారు. అంటే, రేపు ఒకవేళ అజిత్ సారథ్యంలో ఎన్సీపీ కాషాయపార్టీతో అంటకాగినా పార్టీ వైఖరికి తాను కట్టుబడట్లేదని అనేందుకు ఆత్మరక్షణ సిద్ధం చేసుకున్నారు. ప్రతిపక్షాలేవీ తనను తప్పుబట్టే వీలు లేకుండా చూసుకున్నారు. పార్టీ అధినేత ఎంపిక బాధ్యతను పైకి 15 మంది సభ్యుల కమిటీకి అప్పగించినా, ఢిల్లీలో చక్రం తిప్పుతున్న కుమార్తె సుప్రియకు పార్టీ అధ్యక్ష బాధ్యతలు, సీఎం అభ్యర్థిగా అజిత్‌కు మహారాష్ట్ర కిరీటం కట్టబెడతారని కథనం. శరద్ రాజీనామాతో ఇప్పటికే పార్టీ జాతీయ కార్యదర్శి సహా పలువురు పక్కకు తప్పుకున్నారు. ఈ పరిణామాలతో ఎన్సీపీకి, మహారాష్ట్రలో మహావికాస్ ఆఘాడీ కూటమికి జరిగే నష్టం మాటేమో కానీ జాతీయస్థాయిలో కాంగ్రెస్‌కే మరింత కష్టం, నష్టం. ప్రతిపక్ష ఐక్యతపైనా, మాజీ కాంగ్రెస్ వాది శరద్ వ్యూహరచనపైనా హస్తం పార్టీ ఆశలు నీరుగారతాయి. 2024 ఎన్నికల వేళ బీజేపీకి ఇది లాభదాయకమే. అయితే, అజిత్‌కు దోవ ఇస్తున్నట్టు ఇస్తూనే, పార్టీపై పట్టు చూపుతున్న శరద్ పవార్ అంత తొందరగా కాడి కింద పడేస్తారా? ఇంతకీ, ముందుగానే జోస్యం చెప్పిన సుప్రియ పేర్కొన్న ఆ రెండో ప్రకంపన ఏమిటి? వేచి చూడాల్సిందే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.10.55 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** చిత్త రా.9.02 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.2.43 నుండి 4.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.41 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** ప.2.18 నుండి 3.57 వరకు.

సూర్యోదయం : 5.37
సూర్యాస్తమయం : 6.15
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

అంతరిక్ష పరిశోధనలో నవ శకం

శాస్త్ర పరిశోధనల రంగంలో భారత్ గొప్ప ముందడుగు వేసింది. 'లిగో–ఇండియా' ఏర్పాటు సైన్స్ చరిత్రలో ఓ సువర్ణాధ్యాయం. విశాల విశ్వం మొత్తం పరచుకుని ఉన్న గురుత్వ తరంగాలను నేరుగా గుర్తించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అమెరికా సహకారంతో మహారాష్ట్రలో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టు 2030 కల్లా పనులు ప్రారంభించవచ్చు. ఇప్పటివరకూ విశ్వాన్ని కేవలం విద్యుదయస్కాంత తరంగాల దృష్టిలోనే చూసేవారు. గురుత్వ తరంగాలకు న్యూట్రినోలు, ఖగోళ కిరణాలు కూడా తోడయితే అంతరిక్షంలో జరిగే సంఘటనలను భిన్న రీతుల్లో పరిశీలించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఎక్కడో కోటానుకోట్ల కిలోమీటర్ల దూరంలోని న్యూట్రాన్ స్టార్లు, కృష్ణబిలాలకు సంబంధించిన గురుత్వ తరంగ ఘటనలను కూడా పరిశీలించవచ్చు. విశ్వ రహస్యాల ఛేదనలో ఇదొక అద్భుతమైన ప్రయత్నం అవుతుంది.

శాస్త్ర పరిశోధనల రంగంలో భారత్ మరో మేలి ముందడుగు వేసింది. అంతర్జాతీయ సైన్స్ ప్రాజెక్టులో భాగంగా భారత్‌లో 'ద లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్–వేవ్ అబ్జర్వేటరీ' క్లుప్తంగా 'లిగో' ఏర్పాటు కానుండటం దీనికి కారణం. కేంద్ర కేబినెట్ ఇటీవలే ఈ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేయడం సైన్స్ చరిత్రలో ఓ సుదినమని చెప్పాలి. అంతేకాదు... అనేక ఇతర ప్రాథమ్యాలను పక్కనబెట్టి ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన సైన్స్ బృందం ఈ ప్రాజెక్టు అమలుకు పూనుకోవడం గొప్ప పరిణామం.



వందేళ్ల తర్వాత...

ఏమిటీ లిగో? దాని ప్రాధాన్యం ఏమిటి? మనకు, ప్రపంచానికి దీనివల్ల ఉపయోగమేమిటి? చాలా ఆసక్తికరమైన ప్రశ్నలివి. ఒక్కొటొక్కటిగా సమాధానాలు తెలుసుకుందాం. అమెరికాలోని కాల్‌టెక్, మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)ల ఆధ్వర్యంలో అమెరికా చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు ఈ లిగో! విశాల విశ్వం మొత్తం పరచుకుని ఉన్న గురుత్వ తరంగాలను నేరుగా గుర్తించడం దీని లక్ష్యం. 1916లో ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ మొట్టమొదటిసారి ఈ గురుత్వ తరంగాల ఉనికిని అంచనా వేయడమే కాకుండా... దాని ఆధారంగా గురుత్వాకర్షణ శక్తిపై విప్లవాత్మకమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. విశాల విశ్వంలో ఎక్కడో కోటానుకోట్ల కిలోమీటర్ల దూరంలో నడిచే అత్యంత శక్తిమంతమైన ఘటనల కారణంగా పుట్టే గురుత్వ తరంగాలను 2015లో మొట్టమొదటిసారి గుర్తించారు. ఇంకోలా చెప్పాలంటే, వాటి ఉనికిని మొదటిసారి అంచనా వేసిన వందేళ్ల తరువాత గుర్తించారని చెప్పాలి. 2015లో గుర్తించిన తరంగాలు సుమారు 130 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో రెండు కృష్ణబిలాలు లయమైపోయిన కారణంగా పుట్టుకొచ్చాయి. ఆ ఆవిష్కరణకు 2017లో భౌతిక శాస్త్రంలో నోబెల్ అవార్డు కూడా దక్కింది.

లిగో ద్వారా గురుత్వ తరంగాల ప్రత్యక్ష పరిశీలన విశ్వ దర్శనానికి రెండు కొత్త కళ్లల్లా మారిందంటే అతిశయోక్తి కాదు. ఇప్పటివరకూ విశ్వాన్ని కేవలం విద్యుదయస్కాంత తరంగాల దృష్టిలోనే చూసే వారు. గురుత్వ తరంగాలకు న్యూట్రినోలు, ఖగోళ కిరణాలు కూడా తోడయితే అంతరిక్షంలో జరిగే సంఘటనలను భిన్న రీతుల్లో పరిశీలించేందుకు అవకాశం ఏర్పడుతుంది. మల్టీ మెసెంజర్ అస్ట్రానమీ అన్నమాట.

ప్రపంచ నెట్‌వర్క్‌లా...

భారతదేశంలో లిగో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పనిచేయడం మొదలుపెట్టినప్పుడు ఈ ప్రపంచానికి ఆకాశం మొత్తాన్ని చూసేందుకు వీలవుతుంది. ఏ దిక్కున ఎప్పుడు రెండు కృష్ణబిలాలు ఢీకొంటాయి? లేదా రెండు భారీ నక్షత్రాలు లయమైపోతాయో నిర్ధారించుకునే సామర్థ్యం లభిస్తుంది. అమెరికాతో కలిసి చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో భాగంగా మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతంలో భారీ డిటెక్టర్ ఒకదాన్ని ఏర్పాటు చేయనున్నారు. అమెరికాలోని లిగో కేంద్రాలతో కలిసి ఈ డిటెక్టర్ కూడా పనిచేస్తుందన్నమాట. న్యూట్రాన్ స్టార్లు, కృష్ణబిలాలకు సంబంధించిన గురుత్వ తరంగ ఘటనలను వీటిద్వారా పరిశీలించవచ్చు. అంతేకాకుండా... సుమారు 1,300 కోట్ల ఏళ్ల క్రితం మహా విస్ఫోటం కారణంగా పుట్టిందని నమ్ముతున్న విశ్వం తొలికాలం నాటి ప్రకంపనలనూ గుర్తించేందుకు బహుశా అవకాశం ఉంటుంది. యూరప్, జపాన్‌లలోనూ లిగో డిటెక్టర్లు ఏర్పాటైతే అది ఒక ప్రపంచ నెట్‌వర్క్‌లా మారిపోతుంది.

భారత్‌లోని లిగో డిటెక్టర్ పని మొదలు కాగానే... ఇప్పటికే అందుబాటులో ఉన్న రేడియో, ఆప్టికల్ టెలిస్కోపుల సాయంతో మరిన్ని అద్భుతమైన ఆవిష్కరణలకు నాంది పలకనుంది. ఖగోళ ఘటనలు జరిగేందుకు కొన్ని నిమిషాల ముందునాటి కాలానికి చేర్చడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. అమెరికా డిటెక్టర్లకు దూరంగా ఉన్న కారణంగా భారత్‌లోని డిటెక్టర్ ఇప్పటివరకూ చూడని ప్రాంతాలపై దృష్టి పెట్టవచ్చు.

భారత్‌లో లిగో డిటెక్టర్ ఏర్పాటు అంతర్జాతీయ దృష్టికోణంలోనూ చాలా ముఖ్యమైన ఘటనగా చెప్పుకోవాలి. ఎందుకంటే ఈ డిటెక్టర్ ఖగోళ ఘటనలను చూడగలిగే సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనుంది కాబట్టి! ఈ దేశ గడ్డపై ఓ అరుదైన పరిశోధనశాల ఏర్పాటైతే... మొదలైన తొలిరోజు నుంచి అంతర్జాతీయ స్థాయి మౌలిక పరిశోధనలు చేపడితే అది మనందరికీ గర్వకారణమైన అంశమే అవుతుంది. పైగా ఇదో అంతర్జాతీయ ప్రాజెక్టు. రియల్‌టైమ్‌లో పరస్పర సహకారం అవసరం అవుతుంది. ఈ క్రమంలో కొత్త ఆలోచనలు పురుడు పోసుకుంటాయి. కొంగొత్త ప్రాజెక్టులు పుట్టుకొచ్చే అవకాశం ఉంటుంది. భారతీయ శాస్త్రవేత్తలు ఈ రంగంలో తగిన అనుభవాన్ని గడించేందుకు సువర్ణావకాశమిది. (లిగో డిటెక్టర్ ప్రయోగాల ద్వారా సైన్స్ మరింత ముందుకు వెళ్లడం మాత్రమే కాదు... నోబెల్ అవార్డు అందుకోగల సత్తా ఉన్న అనేకానేక పరిశోధనలకు కేంద్రబిందువుగానూ మారుతుంది. భారతీయ శాస్త్రవేత్తలకూ నోబెల్ అవార్డులు దక్కే అవకాశం మరింత ఎక్కువవుతుందన్నమాట!)

పరిశోధకులకు అద్భుత అవకాశం

లిగో డిటెక్టర్ల నిర్మాణ దశలో అత్యాధునిక ఫ్యాబ్రికేషన్ పనులన్నీ భారత్‌లోనే జరగనున్నాయి. శక్తిమంతమైన లేజర్లు, అతిపెద్ద, భారీ వాక్యూమ్ పరికరాలు, అణుస్థాయిలో అత్యంత నున్నటి అద్దాలు... క్వాంటమ్ సెన్సింగ్, కంట్రోలింగ్ వ్యవస్థలన్నీ ఇక్కడే తయారైతే... దేశీ 'ప్రిసిషన్ ఇంజినీరింగ్' సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా భవిష్యత్తులో మన పారిశ్రామిక ఉత్పత్తి, నాణ్యత రెండూ ఎక్కువవుతాయి. వీటిని అందిపుచ్చుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు అందుబాటులో ఉండనే ఉన్నారు. ఇప్పటికే నడుస్తున్న కంపెనీలు కూడా హైటెక్ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించే అవకాశం ఉంటుంది. లిగో డిటెక్టర్ల నిర్మాణ బాధ్యతలు చేపట్టి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఏజెన్సీ ఇప్పటికే ఈ దిశగా తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది కూడా. లిగో– ఇండియా యువ భారతీయ శాస్త్రవేత్తలకు ఓ స్ఫూర్తిగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ స్ఫూర్తితోనే చాలామంది విశ్వం దాచుకున్న అనేకానేక రహస్యాలను ఛేదించేందుకు ముందుకొస్తారు.

సైన్స్ రంగంలో లిగో–ఇండియా ఏర్పాటు ఓ అద్భుతం. ఈ ప్రయత్నాలకు నేతృత్వం వహిస్తున్న శాస్త్రవేత్తలు వీలైనంత వేగంగా డిటెక్టర్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు సర్వశక్తులు ఒడ్డాలి. సైన్స్ అంటే ఆసక్తి ఉన్నవారు... సైన్స్ వ్యాప్తికి కృషి చేస్తున్న వారు లిగో–ఇండియా ప్రాముఖ్యత, అవసరం, లక్ష్యాల గురించి ఈ తరం యువతకు తెలియజేయాల్సిన సందర్భం కూడా ఇదే.

భౌతికశాస్త్రం, దాని అనుబంధ రంగాల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ఇదో అత్యద్భుతమైన అవకాశం. స్నాతకోత్తర విద్యలో గురుత్వ తరంగాలపై పరిశోధనలను ఎంచుకోవడం ద్వారా లిగో– ఇండియా నిర్మాణంలో భాగస్వాములయ్యే అవకాశం లభిస్తుంది. అన్నీ సవ్యంగా సాగితే లిగో– ఇండియా నిర్మాణం మొత్తం పూర్తయ్యి సమాచార సేకరణ మొదలుపెట్టేందుకు ఇంకా ఏడేళ్ల సమయం(2030) ఉంది.

రాణా అధికారి, కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకులు; కె.విజయ్ రాఘవన్, కేంద్ర మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు; శివాజీ సోంధీ, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



ఇబ్బంది పడమా?



లండన్‌లో జరిగిన ఒక నెట్‌ఫ్లిక్స్ ఈవెంట్‌లో, టాయ్‌లెట్ల దగ్గర చిహ్నాలు పెట్టారు. మహిళలు, అంగ వికలుర టాయ్‌లెట్లను జెండర్ న్యూట్రల్‌గా మార్చారు. మగ వాళ్లవి మాత్రం మగ వాళ్ల కోసమే ఉంచారు. – సమంతా స్మిత్, కాలమిస్ట్

కలిసే ఉండాల్సింది



అందుబాటు ధరల్లో నాణ్యమైన తాజా పళ్లు, కూరగాయలు దొరకడం బ్రిటన్‌లో కష్టమైపోతోంది. 'బ్రెగ్జిట్' (యూరోపియన్ యూనియన్ నుంచి బయటకు రావడం) దేశానికి స్వీయ హానికారక చర్య. – దేవీ శ్రీధర్, ప్రొఫెసర్

మనకన్నా నయం



ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచిలో, ఇండియా 11 స్థానాలు దిగజారింది. 2022లోని 150 నుంచి 2023లో 161కి వచ్చింది. సోకాల్డ్ ప్రజాస్వామ్య తల్లి అనే మోదీ ఇండియా కన్నా ఈ సూచీ తాలిబన్ల పాలనలో ఉన్న అఫ్గానిస్తాన్‌లోనూ(152), సైనిక నియంత్రణ ఉన్న పాకిస్తాన్‌లోనూ (150) మెరుగ్గా ఉంది. – అశోక్ స్వైన్, ప్రొఫెసర్

మంచి సినిమా



జనానికి పెద్దగా తెలియని, కొంతమంది మాత్రమే చూశారని మీకు అనిపించే ఏ బాలీవుడ్ సినిమాను మీరు స్నేహితులకు కచ్చితంగా చూడమని చెబుతారు? నేనైతే 'సిహర్' అంటాను. అర్షద్ వార్సీ, పంకజ్ కపూర్, సుశాంత్ సింగ్ నటించారు. (దర్శకుడు కబీర్ కౌశిక్) – జాయ్ దాస్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇంకొక సత్యం



ఐర్లాండ్‌లో ఇప్పుడు 'ట్రూత్' (సత్యం) మంత్రిత్వ శాఖ వాస్తవమని నిర్ధారించినదే చదవడానికి అర్హమైన మెటీరియల్. కొత్త శాసనం ప్రకారం, 'ద్వేషపూరితం' లేదా అవాస్తవికం అని ప్రభుత్వ సెన్సార్లు పరిగణించినదాన్ని ఆన్‌లైన్‌లో చూడటం, షేర్ చేయడం కూడా జైలుశిక్షకు అర్హమైనదే. – బెర్నీ స్పాఫోర్డ్, విశ్లేషకురాలు

మాట్లాడుతాం



పాకిస్తాన్‌లో మేము సత్యాన్ని చెప్పే వీలు లేదు. లేదంటే భారీ మూల్యం చెల్లించాలి. బలవంతపు మతమార్పిళ్ల కథనాలు; లేదంటే క్రైస్తవులు, హిందువులు, షియాలు, అహ్మదీలు, ఆఖరికి గిరిజనులను ఎలా చూస్తున్నారన్న కథనాలు రాసినా బాధలు పడవలసిందే. సత్యానికి భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చినా, ధైర్యంగా గొంతెత్తి మాట్లాడవలసిందే. – వీంగాస్, జర్నలిస్ట్

ఎగిరిపోతున్న దేశాలు




ప్రతి సంవత్సరం 'ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ' పరీక్షకు పంజాబ్ నుంచి ఆరు లక్షల మంది విద్యార్థులు హాజరవుతారు. విదేశాలకు వెళ్లాలన్న ఉబలాటాన్ని ఇది తెలియజేస్తోంది. ముందు చదువుకోవడం, అనంతరం అక్కడే ఉద్యోగం సంపాదించుకోవడానికి అత్యధికులు ఎంపిక చేసుకుంటున్న దేశాలు – కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే. – దేవీందర్ శర్మ, కాలమిస్ట్

ఇన్‌బాక్స్

మైసూర్ పులి

భారత స్వాతంత్ర్య చరిత్రలో టిప్పు సుల్తాన్ పాత్ర ప్రత్యేకం. బ్రిటిష్ మూకల కబంధ హస్తాల నుండి దేశాన్ని రక్షించడానికి ఆయన సాగించిన పోరాటం అజరామరం. 1750 నవంబర్ పదవ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా, దేవనహళ్లిలో ఫాతిమా ఫఖ్రున్నీసా, హైదర్ అలీలకు టిప్పు జన్మించాడు. తండ్రి తన స్వీయ పర్యవేక్షణలో యుద్ధ కళల్లోని మెళకువలు నేర్పించాడు. జాతీయ, అంతర్జాతీయ విషయాలపై టిప్పు వ్యక్త పరిచిన అభిప్రాయాలనూ, దౌత్య వ్యూహాలనూ ఆయన శత్రువు డోవ్‌టన్ లాంటి బ్రిటిష్ అధికారి సైతం ప్రశంసించకుండా ఉండలేక పోయాడు. మొదట బ్రిటిషర్ల కూటమి నుండి నిజాంను దూరంచేయడానికి సాగిన ప్రయత్నాల్లో భాగంగా ఎంతో నేర్పుతో, దౌత్య కార్యాన్ని నడిపినప్పుడు... ఆయన వయసు కేవలం పదిహేడేళ్ళు. టిప్పు రాజనీతికి ముగ్ధుడైన నిజాం... 'ఫతే అలిఖాన్' బిరుదుతో సత్కరించాడు.



టిప్పు సుల్తాన్

టిప్పు తండ్రి హైదరలీ 1782లో శత్రువుతో పోరాడుతూ నవంబర్ 6న మరణించినప్పుడు ఆయన వయసు 31 ఏళ్లు. ఆ వయసులో మైసూరుకు రాజయ్యాడు. ఈస్టిండియా పాలకులతో పోరాడుతున్నా క్రైస్తవ మతాచార్యులను అమితంగా గౌరవించేవాడు. మైసూరు రాజ్యంలోని అనేక ఆలయాలకు ప్రతి ఏడాది గ్రాంటులను, ప్రత్యేక నిధులను మంజూరు చేశాడు. ఈమేరకు టిప్పు 156 ఫర్మానాలను జారీ చేశాడు. ఆయన సైన్యంలోని 19 మంది సేనాపతుల్లో 10 మంది... 13 మంది మంత్రులలో ఏడుగురు హిందువులేనని చరిత్ర కారుడు బీఎన్ పాండే పేర్కొన్నారు. చివరికి 1799 మే నాల్గవ తేదీన రణ భూమిలోనే తుదిశ్వాస వదిలిన టిప్పు భారత చరిత్రలో ఒక రగిలే విప్లవ కణం.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్
(నేడు టిప్పు సుల్తాన్ వర్ధంతి)

పరీక్షల పద్ధతి మారాల్సిన తరుణం!

విశ్లేషణ



శ్రీధర్ రాజగోపాలన్

ప్రతి పరీక్షా సీజన్ కూడా ప్రశ్నపత్రాల లీకులు, కాపీయింగులు, అవి జరగకుండా భవిష్యత్తులో కఠిన చర్యలు తీసుకుంటామనే హామీలకు సంబంధించిన వార్తలను ప్రవాహంలా మోసుకొస్తుంది. ఆ ప్రమాణాల ప్రకారం చూసినా గత కొన్ని నెలల్లో తలెత్తిన వరుస వివాదాలు ఎంతో చెరుపు చేశాయి.

గత నెలలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం, రాష్ట్ర నియామక పరీక్షల్లో ఎవరైనా మోసానికి పాల్పడుతూ పట్టుబడితే కనీసం 10 సంవత్సరాల జైలుశిక్ష విధించేలా చట్టాన్ని చేసింది. కొన్ని రోజుల తర్వాత, ప్రశ్న పత్రాల లీకులను నిరోధించడానికి గుజరాత్ శాసనసభ ఏకగ్రీవంగా ఒక బిల్లును ఆమోదించింది. దోషులుగా రుజువైన వారికి పదేళ్ల జైలు శిక్ష, కోటి రూపాయల జరిమానాను ఈ బిల్లులో ప్రతిపాదించారు. ప్రశ్నపత్రాల లీకులను నిరోధించడానికి కఠినమైన, దండనాత్మక చర్యలు తాత్కాలికంగా అవసరమే కావొచ్చు. కానీ ఈ సమస్యకు నిజమైన పరిష్కారం ఏమిటంటే, మన పరీక్షల వ్యవస్థలోనే సంస్కరణ జరగడం!

1970ల నుండి జాబ్ మార్కెట్ అవసరాలను పరిశీలిస్తే – సాధారణ అభిజ్ఞా నైపుణ్యాలు, శారీరక నైపుణ్యాలను పణంగా పెట్టి, రొటీనుకు తావులేని మానవ సహసంబంధాలు, విశ్లేషణాత్మక నిపుణతలు అనేవి నాటకీయంగా పెరుగుతూ వచ్చాయని ఒక పరిశోధన చెబుతోంది. ఆఫీస్ సెక్రటరీ లేక స్టెనోగ్రాఫర్, మానవ బ్యాంక్ టెల్లర్ వంటి సాంప్రదాయికమైన పాత్రలు వాస్తవంగా అదృశ్యమైపోవడం దీనికి ఉదాహరణ. ఇవన్నీ పునరుక్త శారీరక లేక అభిజ్ఞాపరమైన నిపుణతలను ఆశిస్తాయి. జాబ్ మార్కెట్లో ప్రవేశించేవారు అత్యున్నత నైపుణ్య స్థాయితో పోటీపడాల్సిన అవసరాన్ని కృత్రిమ మేధ (ఏఐ) ఉపకరణాల పెరుగుదల తప్పనిసరి చేసింది. ఈరోజు భారతీయ పరీక్షలు చాలావరకు సాధారణ అభిజ్ఞా నైపుణ్యాలను కొలవడం పైనే దృష్టి పెడుతున్నాయి. ఇదే లీకులకు, కాపీల వైపు మొగ్గుచూపే సమస్యలకు కారణమవుతోంది. దీన్ని పరిష్కరించడానికి స్వతంత్రమైనవే అయినా, పరస్పర అనుసంధానిత 4 చర్యలు తీసుకోవచ్చు.

మొదటిది, కంప్యూటర్ ఆధారిత పరీక్షలు. దీనివల్ల విభిన్నమైన ప్రశ్నపత్రాలు ఇవ్వవచ్చు. మొత్తం ప్రశ్నల పూల్ చాలా పెద్దదిగా ఉండటం వల్ల లీకుల సమస్య తగ్గిపోతుంది. వీటి ముద్రణ, రవాణా ప్రక్రియలు గణనీయంగా తగ్గిపోతాయి లేదా దాదాపుగా లేకుండా పోతాయి.



అలాంటి పరీక్షలు అత్యున్నత నైపుణ్యాలను పరీక్షించే నిర్దిష్ట కర్తవ్యాలను కూడా అభ్యర్థులకు ఇవ్వగలుగుతాయి. పైగా కంప్యూటర్‌తోనే దిద్దించవచ్చు (ఉదాహరణకు, గ్రాఫ్ లేదా మ్యాపుపై పాయింటును గుర్తించడం, ఒక ప్యాసేజీలోని పదాన్ని మార్చడం). ఇప్పటికే అతి పెద్ద, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భారతీయ పరీక్షలను చాలావరకు కంప్యూటర్లలో నిర్వహిస్తున్నారని గుర్తుంచుకోవాలి. పరీక్షలు జరపడం కోసం కంప్యూటర్లను అందించడంలో మౌలిక వసతుల ఖర్చు పెరుగుతుంది. కానీ ప్రశ్నపత్రాల ముద్రణ, రవాణా, భద్రత అంశాల్లో ఖర్చులు తగ్గుతాయి. లీకుల వల్ల ఉత్పన్నమయ్యే ఖర్చు కూడా తగ్గుతుంది. (ఇది అనివార్యంగానే పునఃపరీక్షలకు దారితీస్తుంది).

రెండు, ఓపెన్ బుక్ పరీక్షలను మరింతగా పెంచడం. ఈ విధానం పరీక్షా హాల్‌లోకి నిర్దిష్ట సామగ్రిని తీసుకెళ్లడానికి అభ్యర్థులను అనుమతిస్తుంది. ఇవి వాస్తవాలతోపాటు ప్రాథమిక ఫార్ములాలను కలిగి ఉన్న బుక్‌లెట్ల లాంటివి కావొచ్చు. సులభంగా కాపీ చేసే సమస్య దీంతో తొలగిపోతుంది. అభ్యర్థులు తమ జ్ఞానాన్ని వాస్తవ జీవితానికీ, మరింత పెద్ద సమస్యలకూ వర్తింపజేసుకోగలుగుతారు.

మూడు, కేవలం జ్ఞాపకశక్తిని పరీక్షించడం కాకుండా అవగాహనతో కూడిన సమాధానాలు అవసరమైన ప్రశ్నలను ఎక్కువగా ఇవ్వడం. ఒకవేళ కంప్యూటర్లు లేక ఓపెన్ బుక్ పరీక్షలను ఉపయోగించనప్పటికీ, కేవలం గుర్తు తెచ్చుకోవడం మాత్రమే కాకుండా అర్థం చేసుకుని, అన్వయించడంపై ఆధారపడిన నైపుణ్యాల కోసం అభ్యర్థులను పరీక్షించాలి. ఇప్పుడు జరుగుతున్న పరీక్షల్లో గుర్తు పెట్టుకోవడమే ప్రధాన అవసరంగా ఉంటోంది. ఈ విధంగా ప్రశ్నలను మెరుగుపర్చినప్పుడు, సమాధానాలు ఇవ్వడం అనేది ఎప్పుడూ యాంత్రికంగా ఉండదు (ఈ విధానంలో కూడా ప్రశ్నలు ఆబ్జెక్టివ్ లేదా మల్టిపుల్ ఛాయిస్‌గానే ఉండ వచ్చు). ఇలాంటి అనేక ప్రశ్నలు ఒక అపరిచిత నేపథ్యం నుంచి ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు వాటి సందర్భాన్ని అర్థం చేసుకుని ఆ తర్వాతే ప్రశ్నకు సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. జాతీయంగా, అంతర్జాతీయంగా అత్యుత్తమ పరీక్షలు ఇప్పటికే ఇలా జరుగుతున్నాయి. ఇలాంటి ప్రశ్నలను గూగుల్ చేయలేము. పైగా, జీపీటీ–4 వంటి విధానంలో కూడా సులువుగా వీటికి సమాధానాలు కనుగొనలేమని గుర్తించారు (కాకపోతే నెమ్మదిగా అదీ సాధ్యమవుతోంది).

నాలుగు, పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించడం. సులువుగా పరీక్షా ప్రక్రియను మెరుగుపర్చడానికి ఉన్న అవకాశం, పరీక్షలకు సంబంధించిన వివిధ అంశాల గురించి ప్రజావగాహన ప్రచారాలు నిర్వహించాలి. అభ్యర్థులు లేక వారి కుటుంబ సభ్యులు తరచుగా పరీక్షల సంస్కరణలను వ్యతిరేకిస్తుంటారు. ఎందుకంటే పరీక్షల్లో మార్పు చేస్తే తమకు తెలియని పద్ధతిని ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడతారు. ఈ కొత్త పరీక్షల గురించిన ప్రచారం అవెందుకు మెరుగో వివరిస్తుంది. సాపేక్ష గ్రేడింగ్, పర్సెంటైల్స్ వంటి భావనలను కూడా సరిగ్గా వివరించలేకపోతే వ్యతిరేకత మూటగట్టుకుంటాయి. కొన్నిసార్లు కోర్టుల్లో కూడా వీటికి వ్యతిరేకత వ్యక్తం కావొచ్చు.

పరీక్షల్లో మంచి మార్కులే కాకుండా, ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షల్లో కూడా మంచి స్కోర్ సాధించేలా అభ్యర్థులకు ఈ ప్రచారాలు టిప్స్ అందిస్తాయి. ఇలాంటి ప్రచారాలు జరగకపోతే, అభ్యర్థులు జరిగే మార్పుల గురించి తెలుసుకోలేరు. ట్యూషన్, కోచింగ్ క్లాసుల నుంచి అందే వాస్తవాలే వీరికి ప్రామాణికం అవుతాయి. ఇవి దాదాపుగా యథాతథ స్థితినే నిలిపి ఉంచుతాయి.

నియామకాల కోసం గానీ లేక అకెడమిక్ కోర్సుల కోసం గానీ నిర్వహించే పరీక్షల నాణ్యత అనేదే మానవ పెట్టుబడి నాణ్యతను నిర్దేశిస్తుందని చాలా దేశాలు గుర్తించాయి. అందుకే మనం దీనికి గొప్ప ప్రాముఖ్యతను ఇవ్వడానికి ఇదే మంచి తరుణం. కాపీలు, లీకులు అనేవి కునారిల్లుతున్న వ్యవస్థ తాలూకు లక్షణాలను విస్తృతంగా ప్రదర్శిస్తుండటాన్ని మనం చూశాము. అందుకే ఈ రంగంలో మార్పు తప్పనిసరి.

వ్యాసకర్త సహ–వ్యవస్థాపకుడు, 'ఎడ్యుకేషనల్ ఇనీషియేటివ్స్'
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

క్లుప్తంగా...

ఏపీ లోకాయుక్త వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి

కర్నూలు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త వెబ్‌సైట్ బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ వెబ్‌సైట్‌ను కర్నూలులో ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలకు లోకాయుక్త సేవలు అందుబాటులో ఉండేందుకు వీలుగా https://lokayukta.ap.gov.in వెబ్‌సైట్‌ను ప్రారంభించామన్నారు. ఇందులో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరిచినట్లు తెలిపారు. ఫిర్యాదు ఎలా చేయాలి? ఎవరి మీద చెయ్యవచ్చు? ఎప్పుడు ఫిర్యాదు చేయవచ్చు? ఏ విధమైన ఫారాలు జత చేసి పంపాలి? అనే అంశాలను ఇందులో పొందుపర్చినట్లు చెప్పారు. 2022 సంవత్సరానికి సంబంధించిన కేసుల వివరాలు, ప్రజల గ్రీవెన్స్, లోకాయుక్త ఫోన్ నంబర్లు ఉంటాయన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఏపీ లోకాయుక్తకు సంబంధించిన అనేక విషయాలను తెలుసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ పోలయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌ఎంఏఐతో సాంకేతిక విద్యాశాఖ అవగాహన ఒప్పందం

- పాలిటెక్నిక్ విద్యను పారిశ్రామిక రంగంతో అనుసంధానం

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ విద్యను పారిశ్రామిక రంగానికి అనుసంధానం చేసి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించేలా హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియాతో రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యా శాఖ బుధవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియా ప్రతినిధులతో మంగళగిరి సాంకేతిక విద్యాశాఖ కార్యాలయంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. కాంచీపురం కేంద్రంగా ఆటోమొబైల్ రంగంలో కీలక భూమిక పోషిస్తూ బ్రేక్‌ల తయారీ, సరఫరాలో ఈ సంస్థ అగ్రగామిగా ఉంది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి చైర్మన్ చదలవాడ నాగరాణి, హెచ్‌ఎల్ మండో ఆనంద్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ సారథి ఎంవోయూపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ, ఉద్యోగ నియామకాలు, పారిశ్రామిక సంస్థల సందర్శన, అతిథి ఉపన్యాసాలు, పాలిటెక్నిక్ పాఠ్యాంశాల రూపకల్పనలో పరిశ్రమల పాత్ర వంటి అంశాల్లో మరింత సమన్వయం సాధించేలా ఈ ఒప్పందం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యా శాఖ సంయుక్త సంచాలకులు పద్మారావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, హెచ్‌ఎల్ మండో ఆనంద్ గ్రూప్ నుంచి మానవ వనరులు విభాగపు డీజీఎం రాజశేఖర్ కంచర్ల పాల్గొన్నారు.

ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంట్ అమ్మకానికి గ్రీన్ సిగ్నల్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన రాయబరేలీ ఫోర్జ్ డ్ వీల్ ప్లాంట్ అమ్మకానికి కార్యదర్శుల కోర్ గ్రూప్ ఆమోదం తెలిపింది. స్టీల్‌ప్లాంట్ నూరు శాతం వ్యూహాత్మక అమ్మకం ప్రారంభమై తర్వాత దానికి అనుబంధంగా ఉన్న రాయబరేలీ ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంట్‌ను వేరుగా అమ్మడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ సన్నాహాలు ప్రారంభించింది. అందుకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించగా దానికి 3 బిడ్లు వచ్చినట్లు సమాచారం. దానికి సంబంధించి స్ట్రాటజిక్ డిజిన్వెస్ట్‌మెంట్‌పై ఏర్పాటు చేసిన కార్యదర్శుల కోర్ గ్రూప్ ఆమోదముద్రతో వీల్ ప్లాంట్ అమ్మకానికి తుది ఆమోదం లభించినట్టేనని సమాచారం.

'సాక్షి' పాత్రికేయులకు హైబిజ్ పురస్కారాలు



సాక్షి, హైదరాబాద్: 'సాక్షి డెస్క్ సాగుబడి' ఇన్‌చార్జి పంతంగి రాంబాబు, సాక్షి టీవీ న్యూస్ కాస్టర్ కిషోర్ హైబిజ్ పురస్కారాలను అందుకున్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో బుధవారం జరిగిన హైబిజ్ టీవీ మీడియా అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ హోం మంత్రి మహమూద్ అలీ నుంచి రాంబాబు ఉత్తమ ప్రింట్ అగ్రికల్చరల్ జర్నలిస్ట్ పురస్కారాన్ని అందుకున్నారు. సాక్షి టీవీ న్యూస్ కాస్టర్ కిషోర్‌తో పాటు వివిధ పత్రికలు,సోషల్ మీడియా సంస్థలు, శాటిలైట్ చానళ్ల పాత్రికేయులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు కూడా పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి, సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ మార్కెటింగ్ కేఆర్పీ రెడ్డి, ఈవీ నర్సింహారెడ్డి - ఐఏఎస్ (వీసీ-ఎండీ టీఎస్ ఐఐసీ), నరేంద్ర రామ్ నంబుల (సీఎండీ - లైఫ్ స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్), పి.చక్రధర రావు (ప్రెసిడెంట్-ఐపీఈఎంఏ, పౌల్ట్రీ ఇండియా), ఎం.రవీందర్ రెడ్డి (డైరెక్టర్ మార్కెటింగ్-భారతి సిమెంట్స్), వి.రాజశేఖర్ రెడ్డి (జనరల్ సెక్రటరీ-క్రెడాయ్), తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన అవినీతి అనకొండలు

- రాష్ట్రంలో ముగ్గురు అధికారుల నివాసాల్లో ఏసీబీ సోదాలు
- కర్నూలు జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరెస్ట్
- దుర్గగుడి సూపరింటెండెంట్, విజయవాడ సబ్ రిజిస్ట్రార్ నివాసాల్లో కొనసాగుతున్న సోదాలు

సాక్షి, అమరావతి/ద్వారకాతిరుమల: రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) టోల్‌ఫ్రీ నంబర్-14400కు, ఏసీబీ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ముగ్గురు అధికారుల నివాసాలు, కార్యాలయాల్లో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏసీబీ విస్తృతంగా సోదాలు నిర్వహించి భారీగా అక్రమాస్తులను గుర్తించింది.

దుర్గ గుడి సూపరింటెండెంట్ ఇళ్లల్లో..

విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న వాసా నగేశ్ నివాసంలో ఏసీబీ అధికారులు బుధవారం చేపట్టిన సోదాలు అర్ధరాత్రి కూడా కొనసాగాయి. ఆయనకు ఆదాయానికి మించి పెద్దఎత్తున ఆస్తుల్ని కూడబెట్టినట్టు ఏసీబీ గుర్తించింది. నగేశ్ ఉంటున్న విజయవాడలోని నివాసంలో రూ.17.91 లక్షల నగదు, 209.10 గ్రాముల బంగారం, ద్వారకా తిరుమలలో జీ ప్లస్-4 అపార్ట్‌మెంట్, తాడేపల్లిగూడెంలో ఇల్లు, జంగారెడ్డిగూడెంలో ఇల్లు, నిడదవోలులో ఇంటి స్థలం, నిడదవోలులో ఇల్లు, సుజుకి వేగన్-ఆర్ కారు, రెండు యాక్టివా స్కూటర్లు ఉన్నట్టు గుర్తించారు. ఇప్పటివరకు సుమారు రూ.7కోట్ల విలువైన ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. వాసా నగేశ్ ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రం నుంచి విజయవాడ దుర్గ గుడికి గత ఏడాది జూలై 1న బదిలీపై వెళ్లారు. ఏసీబీ అధికారులు తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని అతని సోదరుడు వాసా సురేష్, ఏలూరు జిల్లా భీమడోలులోని అతని బంధువుల ఇళ్లు, ద్వారకాతిరుమలలో నగేశ్‌కు చెందిన శ్రీలక్ష్మి వేంకటేశ్వర అపార్ట్‌మెంట్, విజయవాడ భవానీపురంలో ఆయన అద్దెకుంటున్న లోటస్ లెజెండ్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో సోదాలు చేపట్టారు. కడపటి సమాచారం మేరకు.. నగేశ్ బ్యాంక్ ఖాతాలు, లాకర్లను పరిశీలించడంతోపాటు తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.



ద్వారకాతిరుమలలోని నగేశ్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు



వాసా నగేష్ (ఫైల్)

సహకార అధికారి కూడబెట్టిన ఆస్తులు రూ.15 కోట్లు

కర్నూలు కృష్ణా నగర్‌లోని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రేమరపోగు సుజాత నివాసంలో నిర్వహించిన సోదాల్లో ఏసీబీ అధికారులు భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. ఆమెను అరెస్ట్ చేసి ఆదాయానికి మించి ఉన్న వివిధ ఆస్తులను గుర్తించారు. ప్రభుత్వ ధర ప్రకారమే ఆమె వద్ద రూ.15 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు.

ఆ సబ్ రిజిస్ట్రార్ ఆస్తుల విలువ రూ.15 కోట్లకు పైనే

కాగా, విజయవాడలోని పటమట సబ్ రిజిస్ట్రార్ అర్జ రాఘవరావు నివాసంలో ఏసీబీ అధికారులు రెండో రోజైన బుధవారం అర్ధరాత్రి కూడా సోదాలను కొనసాగిస్తున్నారు. తనిఖీల సందర్భంగా ఆయన ఆదాయానికి మించి భారీగా ఆర్జించిన ఆస్తులను గుర్తించారు. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల్లో విజయవాడలో జీ+ డూప్లెక్స్ ఇల్లు, అవనిగడ్డలో ఖాళీ స్థలం, అన్నపూర్ణ టవర్స్‌లో ఫ్లాట్, గుండాల వద్ద రెండు ప్లాట్లు, ఎస్‌బీఐ కాలనీలో ఒక ప్లాట్‌తోపాటు రెండు కార్లు, రెండు థార్ జీప్‌లు, రెండు ద్విచక్ర వాహనాలు, 1,580 గ్రాముల బంగారం, రూ.12.91 లక్షల నగదు, రూ.18 లక్షలు విలువ చేసే గృహోపకరణాలు, రూ.7 లక్షల విలువ చేసే ప్రామిసరీ పత్రాలు ఉన్నాయి. వీటి విలువ రూ.15 కోట్లకు పైమాటేనని తెలుస్తోంది.

నాసా పోటీలో ఏపీ విద్యార్థుల ప్రతిభ

- సోషల్ మీడియా విభాగంలో హెచ్‌ఈఆర్‌సీ-2023 అవార్డు
- విద్యార్థులను అభినందించిన ఏపీఎస్ఆర్టీఎస్

సాక్షి, అమరావతి: అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) నిర్వహించిన హ్యూమన్ ఎక్స్‌ప్లోరేషన్ రోవర్ చాలెంజ్ (హెచ్‌ఈఆర్‌సీ)-2023లో రాష్ట్ర విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. ఏటా నిర్వహించే ఈ పోటీల్లో ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 60 బృందాలు పోటీ పడ్డాయి. భారతదేశం నుంచి ఆరుగురితో కూడిన బృందం సోషల్ మీడియా అవార్డు సాధించింది. ఈ బృందంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాయి అక్షర వేమూరి, ఆకర్ష్ చిట్టినేని ఉన్నారు. అమెరికాలోని అలబామా రాష్ట్రంలోని హంట్స్‌విల్లేలో ఉన్న స్పేస్ అండ్ రాకెట్ సెంటర్‌లో గత నెలలో ఈ పోటీలు జరిగాయి. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) కార్యకలాపాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను సోషల్ మీడియా ద్వారా నాసాతో పంచుకునే విధంగా ఈ బృందం కృషి చేసింది. వీరు సమర్పించిన ఇంజినీరింగ్ ప్రాజెక్టును నాసా బృందం ప్రత్యేకంగా అభినందించడంతో పాటు భవిష్యత్‌లో ఈ ప్రాజెక్టును ఉపయోగించుకునే విధంగా కృషిచేస్తామని ఆ బృందం తెలిపింది.

విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీఎస్ సన్మానం

నాసా పోటీలో విజయం సాధించిన ఈ విద్యార్థులను బుధవారం తాడేపల్లిలోని ఏపీఎస్ఆర్టీఎస్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారి అనుభవాలు పంచుకున్నారు. విజయవాడకు చెందిన సాయి అక్షర ఇంటర్ పూర్తిచేసింది. హెచ్‌ఈఆర్‌సీ-2023లో స్టూడెంట్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేసింది. చదువుల్లోనే కాకుండా ఆర్చరీ క్రీడాకారిణిగా కూడా రాణిస్తోంది. రక్తదానం కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రెడ్‌క్రాస్ కోసం రూపొందించింది. విజయవాడకు చెందిన ఆకర్ష్ చిట్టినేని 10వ తరగతి చదువుతున్నాడు. హెచ్‌ఈఆర్‌సీ-2023 టీమ్‌కి టెక్నికల్ లీడ్‌గా పనిచేశాడు. జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీల్లో పాల్గొనడంతో పాటు వివిధ సైన్స్ పోటీల్లో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీఎస్ సీఈవో వెంకట్ మేడపాటి మాట్లాడుతూ ఈ విద్యార్థుల ప్రతిభ రాష్ట్రంతో పాటు దేశానికి గర్వకారణమన్నారు. ఏపీ విద్యార్థులు రానున్న సంవత్సరాల్లో మరిన్ని విజయాలను సాధించడానికి ఏపీఎస్ఆర్టీఎస్ అండగా నిలుస్తుందన్నారు.




సాయి అక్షర, ఆకర్ష్‌ను సన్మానిస్తున్న ఏపీఎస్ఆర్టీఎస్ ప్రెసిడెంట్ మేడపాటి వెంకట్ , సీఈఓ రేవతి

వేదపండితుల నియామక జీవోపై స్వరూపానందేంద్ర హర్షం

- భర్తీకానున్న 700 వేద పండితుల పోస్టులు

సింహాచలం/ సీతంపేట: వేద పండితుల పోస్టుల భర్తీకి మార్గాన్ని సుగమం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోపై విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి బుధవారం హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించిన అనేక ఆలయాల్లో వేద పఠనానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని, తద్వారా వేద రక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. చాలాకాలంగా టీటీడీ ద్వారా వేద పారాయణుల పోస్టుల నియామకం జరగలేదని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి పోస్టుల భర్తీకి టీటీడీకి గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చెప్పారు. ప్రస్తుతం టీటీడీ నిర్వహణలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఎస్వీ ఉన్నత వేదాధ్యాయన సంస్థల పరిధిలో 1,433 వేద పారాయణదారులు అనేక ఆలయాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు 700 పోస్టులను ఒకేసారి భర్తీ చేసేలా తీసుకున్న నిర్ణయం వేదాధ్యయానికి దోహదపడేలా ఉండటం ఆనందించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. కొత్త పోస్టుల భర్తీకి నిర్ణయించిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డికి ఆశీస్సులు అందిస్తూ, రాజశ్యామల అమ్మవారి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు.



స్వరూపానందేంద్ర సరస్వతి

గిరిజన ప్రాంతాల్లో 40 ఆలయాలు

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో బుధవారం నిర్వహించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ స్థాపన కార్యక్రమానికి శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి హాజరయ్యారు. టీటీడీ ఆధ్వర్యంలో ఇది వరకే అరకు, పాడేరు వంటి గిరిజన ప్రాంతాల్లో దాదాపు 40 ఆలయాలు నిర్మించినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో హిందూ ధర్మ ప్రచారాన్ని టీటీడీ విస్తృతం చేసిందన్నారు. ఈ నెలలోనే రంపచోడవరంలో శ్రీవారి ఆలయానికి మహా సంప్రోక్షణ జరగనుందని తెలిపారు.

'సిట్'కు సుప్రీం అనుమతి హర్షణీయం

- రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాజధానిలో జరిగిన అవినీతిపై సిట్ విచారణపై హైకోర్టు ఇచ్చిన స్టే తొలగిస్తూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సిట్ పూర్తిస్థాయి విచారణ కొనసాగించాలని సుప్రీం మార్గదర్శకాలు జారీ చేయడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 948వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. చంద్రబాబుతో పాటు రాజధానిలో అవినీతి చేసిన వారిపై సిట్‌తో పాటు సీబీఐ విచారణ చేసి కేసులు నమోదు చేసి అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. విశాఖ వేదికగా పరిపాలన కొనసాగించేందుకు త్వరలో ఈ ప్రాంతానికి వస్తానంటూ భోగాపురం ఎయిర్ పోర్టు శంకుస్థాపన సభ సాక్షిగా సీఎం వైఎస్ జగన్ ప్రకటించడం హర్షణీయమన్నారు. మూడు రాజధానులు, వికేంద్రీకరణ ద్వారానే అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి జరుగుతుందని ముందడుగు వేస్తున్న జగనన్న పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. చిట్‌ఫండ్ వ్యాపారం పేరుతో రామోజీ చేసిన అవినీతిని వెలికితీస్తుంటే దానిని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారానికి తెరలేపడం వెనుక బాబు ప్రయోజనాలు దాగున్నాయన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

పొడపాడు ఘటనపై స్పందించిన హెచ్‌ఆర్సీ

- 'సాక్షి'లో ప్రచురించిన 'మూడు కుటుంబాల వెలి' కథనంపై సుమోటోగా కేసు నమోదు
- నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగానికి నోటీసులు

కర్నూలు(సెంట్రల్): పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం పొడపాడులో సామాజిక బహిష్కరణ అంశంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. సామాజిక బహిష్కరణ నేరమని, దీనిపై పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు జారీ చేసింది. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం పొడపాడులో జరిగిన సామాజిక బహిష్కరణపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని హెచ్‌ఆర్సీ సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసింది. అక్కడ పంచాయతీ ఎన్నికల సమయంలో దూదేకుల కులానికి చెందిన మూడు కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చాయని, కుల పెద్దలు ఆ మూడు కుటుంబాలను ఊరినుంచి వెలివేశారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ జ్యుడీషియల్ సభ్యుడు దండె సుబ్రహ్మణ్యం, నాన్ జ్యుడీషియల్ సభ్యుడు శ్రీనివాసరావు స్పందించి జూన్ 14వ తేదీలోపు పూర్తిస్థాయి విచారణ జరిపి తమకు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

వందేభారత్ రైలుపై రాళ్లదాడి కేసులో నిందితుల అరెస్టు

- ముగ్గురు యువకులకు రిమాండ్
- మరో ముగ్గురు మైనర్‌లను జువెనైల్ హోంకు తరలింపు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): వందేభారత్ రైలుపై రాళ్లతో దాడి చేసిన ముగ్గురు యువకులతో పాటు మరో ముగ్గురు మైనర్లను ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ (డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్) వల్లేశ్వర బీటీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 28న విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20833) పిఠాపురం-సామర్లకోట మధ్యలో వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు రైలుపై రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో కోచ్ నంబర్ ఐఆర్235004లోని సీటు నంబర్ 60, 61,62 వద్ద అద్దాలు పగిలిపోయాయి. అనంతరం 29వ తేదీన రైలుకు విశాఖపట్నం డిపోలో మరమ్మతులు చేపట్టడంతో.. నాలుగు గంటలు అలస్యంగా బయలు దేరింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న రాజమండ్రి, సామర్లకోట ఆర్పీఎఫ్ అధికారులు వందేభారత్ రైలుకు అమర్చిన ఆన్‌బోర్డ్ సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి దాడికి పాల్పడింది స్థానిక గ్రామానికి చెందిన ముగ్గురు యువకులతో పాటు మరో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దాడి చేసినట్లు ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి ముగ్గురు యువకులను న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. మైనర్లను జువెనైల్ కోర్టులో హాజరుపర్చగా జువెనైల్ హోంకు తరలించారు.

2030 నాటికి గ్లోబల్ డ్రోన్ హబ్‌గా భారత్

- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



డ్రోన్ పరిశోధన కేంద్రాన్ని పారంభిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ చలమేశ్వర్

పెనమలూరు: 2030 నాటికి భారత్ గ్లోబల్ డ్రోన్ హబ్‌గా మారుతుందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరు గ్రామంలోని ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం డ్రోన్ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ..ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలో భారత్ అభివృద్ధి చెందుతోందన్నారు. రానున్న కాలంలో ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక పరంగా భారత్ ఉన్నత స్థానానికి ఎదుగుతుందని ఆకాంక్షించారు. భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాలలో ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసినందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. కాలేజీ యాజమాన్యాన్ని అభినందించారు. డ్రోన్ పరిశోధన కేంద్రం వివరాలను గవర్నర్‌కు ఇజ్రాయెల్ ప్రతినిధులు వివరించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ..కృషి ,పట్టుదలతో విద్యార్థులు పరిశోధనల పై దృష్టి పెట్టాలన్నారు. జేఎన్‌టీయూ వీసీ జీవీకే ప్రసాదరాజు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, ఇజ్రాయెల్ డ్రోన్స్ ఇంజినీరింగ్ కంపెనీ సీఈవో నీర్‌జెండ్లర్, కాలేజీ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

చంద్రబాబు, లోకేశ్ అసత్య ప్రచారాలు తిప్పికొట్టాలి

- ముస్లింలలో చైతన్యం తెచ్చేందుకు జిల్లాల్లో మైనారిటీ సదస్సులు
- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

సాక్షి, అమరావతి: దివంగత వైఎస్సార్ ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లు ముస్లిం మైనారిటీ కుటుంబాల్లో వెలుగులు నింపినట్లే.. నేడు వైఎస్ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు ముస్లిం మైనారిటీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు దోహదం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా చెప్పారు. సీఎం జగన్ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ముస్లిం మైనారిటీ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రతి జిల్లాలో ముస్లిం మైనారిటీ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా అధ్యక్షతన ముస్లిం మైనారిటీ మతపెద్దలు, ముస్లిం స్వచ్ఛంద సంస్థలు, మైనారిటీ విభాగం జిల్లాల అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అంజాద్‌బాషా మాట్లాడుతూ ఇటీవల కాలంలో చంద్రబాబు, లోకేశ్, ఇతర టీడీపీ నేతలు ఈ ప్రభుత్వం ముస్లింలకు ఏమీ చేయడంలేదంటూ చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ముస్లింలంతా తిప్పికొట్టాలన్నారు. చంద్రబాబు హయాంలో ముస్లింలపై చేసిన అరాచకాలు ప్రతి ముస్లింను గాయపరిచాయని చెప్పారు. వాటిని ముస్లింలు ఎవరూ మరిచిపోలేదన్నారు. ముస్లిం జనాభా నివసిస్తున్న ప్రాంతాల్లో సీఎం జగన్ చేసిన మేలు, చంద్రబాబు ముస్లింలపై చేసిన అరాచకాలపైన చైతన్యం తేవాల్సిన అవసరం ఉందని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

సీఎం జగన్ చేసిన మేలును ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి: సజ్జల

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని చెప్పారు. గతంలో వీరిని రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకునేవన్నారు. ముస్లిం మైనారిటీలకు సీఎం జగన్ చేసిన మేలును ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. ఆనాడు దివంగత వైఎస్సార్ తీసుకున్న నిర్ణయాలు, నేడు సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు ముస్లిం మైనారిటీల్లో వెనుకబాటుతనాన్ని రూపుమాపాలనేవేనని చెప్పారు. వైఎస్సార్ ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లు వారి కుటుంబాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయన్నారు. నేడు సీఎం జగన్ ముస్లిం మైనారిటీలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా, నామినేటెడ్, స్థానికసంస్థల పదవుల్లో విశేష ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. అమ్మఒడితో పాటు షాదీ తోఫా, విదేశీవిద్య వంటి అనేక పథకాలు ముస్లింలలో పేదరికాన్ని పోగొట్టేవిధంగా ఉన్నాయనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ఆ పథకాలు అందుకుంటున్న ప్రతి ముస్లిం మైనారిటీ సోదరుడు వారి కమ్యూనిటీలో చెప్పి వారిలో చైతన్యం తేవాలని సూచించారు. దేశంలో ముస్లిం మైనారిటీలకు అత్యంత సురక్షితమైన రాష్ట్రం వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని దేశంలోని ఇతర ప్రాంతాల ముస్లిం మైనారిటీలంతా ముక్తకంఠంతో చెబుతున్నారని తెలిపారు. ముస్లిం మైనారిటీల సమస్యల పరిష్కారం కోసం, ప్రయోజనం కోసం అవసరమైతే చట్టాలు సైతం మార్చడానికి సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసలాజం, ఎమ్మెల్సీలు రుహుల్లా, లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రపంచ బ్యాంక్ అధ్యక్షునిగా అజయ్ బంగా



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా పలు దిగ్గజ సంస్థలకు సారథులుగా వెలుగొందుతున్న భారతీయుల జాబితాలో ప్రముఖ భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త అజయ్ బంగా నిలిచారు. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షునిగా ఎంపికయ్యారు! ఆయన నియామకాన్ని ఖరారుచేస్తున్నట్లు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు బుధవారం ప్రకటించారు. జూన్ రెండో తేదీ నుంచి ఐదేళ్లపాటు అధ్యక్షునిగా బంగా సేవలందిస్తారని బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఒక భారతీయ అమెరికన్ అధ్యక్షుడు ప్రపంచ బ్యాంక్ పగ్గాలు చేపట్టడం ఇదే తొలిసారి. 63 ఏళ్ల బంగాను ఫిబ్రవరిలో అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఈ పదవికి నామినేట్‌చేశారు. బంగా జనరల్ అట్లాంటిక్ సంస్థ ఉపాధ్యక్షునిగా, మాస్టర్ కార్డ్ సీఈవోగా చేశారు. కేంద్రం 2016లో ఆయనను పద్మశ్రీతో సత్కరించింది.

ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత్ నేలచూపులు

న్యూఢిల్లీ: ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచీ–2023లో భారత్ 11 స్థానాలు దిగజారింది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా బుధవారం విడుదల చేసిన నివేదికలో 161వ ర్యాంక్‌తో సరిపెట్టుకుంది. 180 దేశాల్లో పత్రికారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల ఆధారంగా ఇచ్చే ఈ ర్యాంకుల్లో గతేడాది భారత్ 150వ స్థానంలో నిలిచింది. దీనిపై పత్రికా సంఘాలు ఆందోళన వ్యక్తంచేశాయి. 'భారత్ సహా పలు దేశాల్లో పత్రికా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కల్గుతోందని స్పష్టమవుతోంది. మీడియా క్రియాశీలక పాత్ర పోషించలేకపోవడం దారుణం'' అని ది ఇండియన్ విమెన్స్ ప్రెస్ కోర్స్, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ప్రెస్ అసోసియేషన్ ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

బలగాలకు మిల్లెట్స్ వంటలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ తృణ ధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకొని సాయుధ బలగాలకు ఇచ్చే ఆహారంలో కేంద్ర హోం శాఖ మార్పులు చేసింది. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్), జాతీయ విపత్తు సహాయ బలగం (ఎన్‌డీఆర్‌ఎఫ్) సిబ్బందికి మిల్లెట్ వంటకాలను అందించనుంది. ఇకపై వారి ఆహారంలో 30% అవే ఉంటాయని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాదిని అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా ఐరాస ప్రకటించడం తెలిసిందే.

పుతిన్‌పై హత్యాయత్నం



క్రెమ్లిన్‌పై డ్రోన్ దాడులు: రష్యా ● ఉక్రెయిన్ పనేనని తీవ్ర ఆరోపణ

భారీ మూల్యం తప్పదని హెచ్చరిక | **అధ్యక్షుడు క్షేమమని వెల్లడి** | **తమకు సంబంధం లేదన్న ఉక్రెయిన్** | **కీవ్‌పై డ్రోన్లు, బాంబుల వర్షం**

కీవ్: అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను హత్య చేసేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తోందని రష్యా తీవ్ర ఆరోపణలు చేసింది. అందులో భాగంగా బుధవారం తెల్లవారజామున అధ్యక్ష భవనం క్రెమ్లిన్‌పై రెండు డ్రోన్ దాడులు జరిగాయని ప్రకటించింది. ఇది మతిమాలిన ఉగ్రవాద చర్య అంటూ మండిపడింది. ఇందుకు తీవ్రస్థాయిలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించింది. భారీ స్థాయిలో ప్రతి దాడి ఉంటుందని ప్రకటించింది. సరైన సమయంలో దీటుగా స్పందిస్తామంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేసింది. ఉక్రెయిన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తామన్నదే వాటి అంతరార్థమని భావిస్తున్నారు. ''దాడులను భగ్నం చేశాం. మా భద్రతా దళాలు డ్రోన్లలో మధ్యలోనే పేల్చేశాయి. ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. క్రెమ్లిన్ భవనానికీ నష్టం జరగలేదు. ఆ సమయంలో పుతిన్ క్రెమ్లిన్‌లో లేరు. మాస్కో ఆవల నోవో ఒగర్యోవో నివాసంలో సురక్షితంగా ఉన్నారు'' అని ఆయన అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ తెలిపారు. మే 9న నగరంలో జరగాల్సిన విక్టరీ డే పరేడ్‌ను అడ్డుకోవడం కూడా దాడి లక్ష్యమని ఆరోపించారు. పరేడ్ యథాతథంగా జరుగుతుందని ప్రకటించారు.

దాడిపై అనుమానాలు

క్రెమ్లిన్‌పై డ్రోన్ దాడులు జరిగినట్టు అధికారికంగా ధ్రువీకరణ కాలేదు. రష్యా కూడా ఇందుకు సంబంధించి ఎలాంటి రుజువులూ బయట పెట్టలేదు. దాడి జరిగితే ఆ విషయాన్ని 12 గంటల పాటు ఎందుకు దాచారన్న దానిపైనా వివరణ లేదు. క్రెమ్లిన్‌పై డ్రోన్ దాడిగా చెబుతున్న వీడియోలు మాత్రం వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో మాస్కోలో డ్రోన్లపై పూర్తిస్థాయి నిషేధం విధించారు. రష్యా ఆరోపణలను ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది. క్రెమ్లిన్‌పై జరిగినట్టు చెబుతున్న డ్రోన్ దాడులతో తమకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేసింది. తమపై యుద్ధాన్ని తీవ్రతరం చేసేందుకు బహుశా ఈ ఉదంతాన్ని సాకుగా రష్యా వాడుకోవచ్చని అభిప్రాయపడింది. తమ నగరాలపై జరుపుతున్న తీవ్ర స్థాయి సైనిక దాడులను ఇలా సమర్థించుకోజూస్తోందని ఆరోపించింది. ఉక్రెయిన్‌తో రష్యా 14 నెలలుగా పూర్తిస్థాయి యుద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. రష్యా అంచనాలను పూర్తిగా తలకిందులు చేస్తూ దాడులను ఉక్రెయిన్ దీటుగా తిప్పికొడుతూ వస్తోంది.



క్రెమ్లిన్ భవనంపై డ్రోన్‌ను పేల్చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో సర్కిల్లో) పేల్చివేతకు క్షణాల ముందు డ్రోన్

ఏం జరిగింది?

దాడికి సంబంధించి పలు వీడియోలు వైరల్‌గా మారాయి. ఒకదాంట్లో క్రెమ్లిన్‌పైకి డ్రోన్ దూసుకొస్తూ కన్పించింది. అతి సమీపానికి వచ్చాక పేలిపోయి నేల కూలింది. క్రెమ్లిన్, సమీప భవనాల మీదుగా పొగ వస్తున్న వీడియోలు కూడా వైరల్‌గా మారాయి. దాడికి సంబంధించి క్రెమ్లిన్ పక్కనున్న నది ఆవల నుంచి తీసినట్టు చెబుతున్న వీడియో మాస్కో స్థానిక టెలిగ్రాం చానల్లో రాత్రి పూట ప్రసారమైంది. డ్రోన్ శకలాలు అధికార భవన ఆవరణలో పడ్డట్టు క్రెమ్లిన్ వెబ్‌సైట్ కూడా పేర్కొంది. తెల్లవారుజాము 2 గంటల ప్రాంతంలో భారీ శబ్దాలు, పొగ వచ్చినట్టు స్థానికులు చెప్పుకొచ్చారు. దీనిపై రష్యాలో ప్రభుత్వ అనుకూల వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తక్షణం ప్రతి దాడులకు దిగి ఉక్రెయిన్ సీనియర్ నాయకులను వరుసబెట్టి అంతం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

జెలెన్‌స్కీ 'నిర్ణాయక దాడి' వ్యాఖ్యల నేపథ్యంలో ఘటన

- ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తాజాగా ఫిన్లండ్‌లో ఆకస్మికంగా పర్యటించారు.
- రష్యాను ఎదుర్కొనేందుకు మరిన్ని శక్తిమంతమైన ఆయుధాలు అందజేయాలని ఐదు నోర్డిక్ దేశాలు ఫిన్లండ్, స్వీడన్, నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్‌లను గట్టిగా కోరారు.
- ఈ సందర్భంగా హెల్సింకీలో మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్ అతి త్వరలో ప్రతిదాడికి దిగనుందని ప్రకటించారు.
- ''విజయం కోసం నిర్ణాయక దాడి చేయనున్నాం'' అని చెప్పు కొచ్చారు. తర్వాత కాసేపటికే రష్యా నుంచి డ్రోన్ దాడి ఆరోపణ వెలువడింది.
- మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మరింత తీవ్రతరమయ్యాయి. రాజధాని కీవ్‌పై ఇరాన్ తయారీ డ్రోన్లతో రష్యా సైన్యం దాడులకు పాల్పడింది.
- 21 డ్రోన్లను కూల్చేసినట్టు ఉక్రెయిన్ సైన్యం ప్రకటించింది. మరోవైపు దక్షిణ రష్యాలో క్రాస్నోడర్ ప్రాంతంలో ఓ చమురు డిపోలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది.
- ఇది రష్యా సరఫరా వ్యవస్థలను లక్ష్యం చేసుకుని కొంతకాలంగా ఉక్రెయిన్ చేస్తు న్న దాడుల్లో భాగమేనని భావిస్తున్నారు.



కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్లే దారిలో భైరవ్/కుబేర్ గ్లేసియర్ వద్ద బుధవారం భారీగా హిమపాతం జరగడంతో మంచులో కూరుకుపోయిన యాత్రికులను రక్షిస్తున్న ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు స్పందన దళ సభ్యులు

టీనేజీ విద్యార్థి ఘాతుకం

- తుపాకీ కాల్పుల్లో ఎనిమిది మంది చిన్నారుల దుర్మరణం
- సెర్బియాలో దారుణం

బెల్‌గ్రేడ్: ఐరోపా దేశం సెర్బియాలో ఓ విద్యార్థి జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో అభంశుభం తెలియని ఎనిమిది మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. స్కూల్ గార్డు సైతం తూటాలకు బలయ్యాడు. దేశ రాజధాని బెల్‌గ్రేడ్ సమీపంలోని వ్లాదిస్లావ్ రిబ్నివాక్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉదయం 8.40గంటలకు ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తండ్రి తుపాకీని పాఠశాలకు పట్టుకొచ్చిన 13 ఏళ్ల కోస్టా కెక్‌మనోవిక్ అనే కుర్రాడు చరిత్ర పాఠాలు చెబుతుండగా తరగతి గదిలోకొచ్చి కాల్పులు జరిపాడు. అంతకుముందు అడ్డుకోబోయిన స్కూల్ గార్డ్‌పైకీ కాల్పుల మోత మోగించాడు. దీంతో ఎనిమిది మంది చిన్నారులు, గార్డు అక్కడికక్కడే మరణించారు. 'ముందుగా టీచర్‌పైకి తుపాకీ ఎక్కుపెట్టి కాల్చాడు. భయంతో డెస్కుల మాటున దాక్కున్న విద్యార్థులపైకి తుపాకీ గుళ్ల వర్షం కురిపించాడు. అదృష్టంకొద్దీ కొందరు వెనుక తలుపు నుంచి తప్పించుకున్నారు' అని ప్రత్యక్ష సాక్షి అయిన ఒక విద్యార్థిని చెప్పింది. గాయపడిన ఆరుగురు విద్యార్థులు, ఒక టీచర్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. విషయం తెల్సుకుని అక్కడికి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు అక్కడే ఉన్న ఆ పిల్లాడిని అదుపులోకి తీసుకున్నారు. 'అప్పుడు నేను కింది అంతస్తులో స్పోర్ట్స్ క్లాస్‌లో ఉన్నా. హఠాత్తుగా తుపాకీ శబ్దం మొదలై ఆగకుండా వినిపి స్తూనే ఉంది' అని ఆ స్కూల్ విద్యార్థి ఒకరు చెప్పారు.



పక్కా ప్రణాళికతో..

ముందస్తు ప్రణాళికతోనే టీనేజర్ కాల్పులకు తెగబడ్డాడని పోలీసులు చెప్పారు. 'దాడి చేయాల్సిన గది స్కెచ్‌లు నెల క్రితమే గీసుకున్నాడు. ఎవరెవరిపై తుపాకీ ఎక్కుపెట్టాలో జాబితా రాసుకున్నాడు. మొదట గార్డును చంపేశాడు. తర్వాత హాల్‌లో ముగ్గురు విద్యార్థుల్ని మట్టుబెట్టాడు. ప్లాన్ ప్రకారం ఎంట్రన్స్ దగ్గరే ఉన్న క్లాస్‌రూమ్‌లో కాల్పులకు దిగాడు. తర్వాత పోలీసులకు ఫోన్ చేశాడు'' అని వివరించారు.

స్వలింగ సమస్యలపై కమిటీ

- సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదన
- అభిప్రాయాల ఆధారంగా పోలేం
- నిబంధనలను బట్టే వెళ్తాం: సీజేఐ



న్యూఢిల్లీ: స్వలింగ జంటల సమస్యల పరిష్కారానికి కేబినెట్ సెక్రెటరీ సారథ్యంలో కమిటీ ఏర్పాటు చేస్తామని కేంద్రం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలంటూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. స్వలింగ జంటలకు జాయింట్ బ్యాంకు ఖాతాలు, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ పథకాల్లో స్వలింగ భాగస్వామిని నామినీగా చేర్చడం వంటివాటిపై నెలకొన్న సమస్యలను ఏప్రిల్ 27 నాటి విచారణ సందర్భంగా ధర్మాసనం లేవనెత్తింది. వీటి పరిష్కారానికి ఏం చేయొచ్చో ఆలోచించాలని సూచించింది. ఈ విషయంలో కేంద్రం సానుకూలంగా ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. కోర్టు అంగీకరిస్తే కమిటీ వేసి అన్ని అంశాలనూ కూలంకషంగా పరిశీలిస్తామని వివరించారు. పిటిషనర్ల సలహాలు, సూచనలను కూడా కమిటీ పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. అందుకు తమకభ్యంతరం లేదని పిటిషనర్ల తరఫున సీనియర్ లాయర్ ఎ.ఎం.సింఘ్వి అన్నారు. అయితే దీనివల్ల పరిష్కారం లభించదన్నారు. ధర్మాసనమే దీనిపై సమగ్రమైన తీర్పు వెలువరించాలని కోరారు. కేంద్రం సూచనను ఓ చక్కని ముందడుగుగా న్యాయమూర్తి జస్టిస్ భట్ అభివర్ణించారు. స్వలింగ జంటలు ఎదుర్కొంటున్న చాలా సమస్యలకు కమిటీతో పరిష్కారం లభించగలదని అభిప్రాయపడ్డారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత అంశాన్ని సమగ్రంగా పరిశీలించి తీర్పు వెలువరిస్తామని సీజేఐ పేర్కొన్నారు. సహజీవనం చేస్తున్న స్వలింగ జంటల్లో 99 శాతం మంది పెళ్లి చేసుకోవాలనే కోరుకుంటున్నట్టు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సౌరభ్ కృపాల్, మేనకా గురుస్వామి తదితరులు చెప్పగా సీజేఐ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''అవతలి వర్గం కూడా తమ వాదనకు మద్దతుగా బోలెడన్ని గణాంకాలు చూపిస్తారు. అందుకే మేం ఇలాంటి మెజారిటీ నైతికతనో మరోదాన్నో ప్రాతిపదికగా తీసుకుని విచారణ జరపలేం. రాజ్యాంగ నియమ నిబంధనలను బట్టే ముందుకెళ్తాం'' అని స్పష్టం చేశారు. తదుపరి వాదనలు మే 9న కొనసాగనున్నాయి.

ఈడీ డైరెక్టర్‌గా ఇంకెవరూ పనికిరారా?

ఈడీ డైరెక్టర్‌గా వరుసగా మూడోసారి సంజయ్ కుమార్ మిశ్రాకు పదవీ కాలం పెంచడంపై సుప్రీం కోర్టు మండిపడింది. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పదవిని చేపట్టడానికి మిశ్రా తప్ప సంస్థలో మరెవరూ లేరా అని ప్రశ్నించింది. మూడోసారి కూడా ఆయనకే పదవీ కాలం పొడిగించాల్సిన ఆవశ్యకత ఏముందని ప్రశ్నించింది. మిశ్రా పదవీకాలాన్ని పొడిగించవద్దని ఆదేశాలు జారీ చేసింది. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వారికి పదవీకాలం ఎక్కువగా పొడగించకూడదని సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేసింది. ''ఈడీ డైరెక్టర్‌గా మిశ్రాకు మించిన వారు మరెవరూ లేరని మీరు భావిస్తున్నట్టున్నారు. ఆయన రిటైరయ్యాక ఎవరిని నియమిస్తారు?'' అని జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్‌ల బెంచ్ నిలదీసింది. కీలక కేసుల్ని విచారిస్తున్నప్పుడు ఒకరి ఆధ్వర్యంలో అయితే విచారణ సరిగా సాగుతుందని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు.

ఆరు రాష్ట్రాలతో సరిహద్దులు | 40-50 స్థానాల్లో తెలుగువారి ప్రభావం

వలస ఏ పార్టీకో..!

సాక్షి బెంగళూరు : కర్ణాటక ఎన్నికల్లో ఒక పార్టీ విజయం సాధించాలంటే కన్నడిగుల ఓట్లు మాత్రం పడితే చాలనుకుంటే పొరపాటు పడ్డట్లే..! దశాబ్దాలుగా కన్నడ నాట ఇరుగు పొరుగు రాష్ట్రాల ఓటర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. మరే ఇతర రాష్ట్రానికి లేని విధంగా దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక ఏకంగా ఆరు రాష్ట్రాలతో సరిహద్దుల్ని పంచుకుంటోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలతో సరిహద్దులున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే వలసలు ఎక్కువే. బెంగుళూరు వంటి మహానగరంలో వ్యాపారాలు, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారెందరో ఉన్నారు. రాష్ట్రంలో 65.45 లక్షల మందివరకు వలసదారులు ఉన్నారు. వీరి ఓట్ల కోసం అన్ని పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇక ఈ సారి ఎన్నికల బరిలో కూడా ఎందరో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తెలుగు మూలాలున్న వారు 100 మంది, మరాఠా మూలాలున్న వారు 50 మందికి పైగా, తమిళులు 10 మంది వరకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

తెలుగు వాడి వేడి

కర్ణాటకలో దాదాపుగా 40–50 అసెంబ్లీ స్థానాల్లో తెలుగువారి ప్రభావం అధికంగా ఉంది. రాష్ట్రంలో సుమారు కోటి మంది వరకు తెలుగు ప్రజలు కర్ణాటకలో నివసిస్తున్నట్లు అనధికారిక సమాచారం. పలు దశాబ్దాలుగా వివిధ కారణాలతో కర్ణాటకకు వచ్చి ఇక్కడి కన్నడిగులతో మిళితమై తెలుగు వారు జీవనం సాగిస్తున్నారు. ఉద్యోగ, వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడిపోయారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని నిర్వహిస్తున్న వారిలో అధిక భాగం తెలుగు ప్రాంత ప్రజలే కావడం గమనార్హం. ఒక్క బెంగళూరులోనే సుమారు 25 లక్షలకు పైగా తెలుగు వారు ఉన్నారు. కర్ణాటకలో కన్నడ, ఉర్దూ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాషల్లో తెలుగు మూడో స్థానంలో ఉంది. బెంగళూరులోని కేఆర్ పురం, రామ్మూర్తినగర, హెబ్బాళ, మారతహళ్లి, మహదేవపుర, యలహంకా, దేవనహళ్లితో పాటు ఏపీ, తెలంగాణ సరిహద్దు కలిగిన బళ్లారి జిల్లా, బీదర్, కలబురిగి, రాయచూరు, యాదగిరి, బసవ కల్యాణ, కోలార, తుమకూరు, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర జిల్లాల్లో తెలుగు వారు అధికంగా ఉన్నారు. 1947లో ఏర్పడిన మైసూరు రాష్ట్రానికి తెలుగు వ్యక్తి క్యాసంబల్లి చెంగరాయరెడ్డి ఎన్నికయ్యారు. 1956లో కర్ణాటక రాష్ట్రం ఏర్పడ్డాక ఎందరో తెలుగువారు రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు.



బెంగళూరులో ఎవరి జనాభా ఎంత?

- రాజధానిలో 44 శాతం కన్నడిగులు ఉంటే 56 శాతం ఇతర భాషా ప్రజలు ఉన్నారు. తెలుగు వారు అత్యధికంగా 25-30 లక్షల మంది ఉన్నారు.
- తమిళులు 16-17 లక్షల మంది ఉంటే మళయాలీలు 4-5 లక్షలు ఉన్నారు
- ఇక ఉత్తరాది రాష్ట్రాల జనాభా 11-12% ఉన్నారు. రాజస్తాన్, బిహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. ఇటీవల కాలంలో జార్ఖండ్, త్రిపుర నుంచి కూడా వలసలు పెరిగాయి.
- రాజస్తాన్‌కు చెందిన జైన సామాజికవర్గం ప్రజలు బెంగళూరులో చాలా చోట్ల నివసిస్తూ ఎన్నికల్లో నిర్ణయాకత్మక మైన పాత్రను పోషిస్తున్నారు.

కన్నడ పోరు

ఓట్ల కోసం వ్యూహాలు

కర్ణాటకకు పొట్ట చేతపట్టుకొని వచ్చిన వలసదారులు గుర్తింపు సమస్యని అధికంగా ఎదుర్కొంటున్నారు. 65 లక్షల మంది వలసదారుల్లో ఎంత మందికి కర్ణాటకలో ఓటు హక్కు ఉందో అన్న దానిపై స్పష్టమైన గణాంకాలేవీ లేవు. కార్మికులుగా పని చేస్తున్న వారికి తాగు నీరు, ఉండడానికి ఇల్లు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటివన్నీ సమస్యలుగానే ఉన్నాయి. టీ, కాఫీ తోటల్లో పని చేస్తున్న కూలీలు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. అధికార బీజేపీ వీరిని సంప్రదిస్తూ రేషన్ కార్డులు ఇప్పించడం, ప్రభుత్వం పథకాలు వారికి అందేలా చూస్తామని హామీలు ఇస్తోంది. వలసదారుల ఓట్లను రాబట్టేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన యువ ఎమ్మెల్యేలు, ఎంపీలను రంగంలోకి దింపింది. గుజరాత్‌కు చెందిన హార్దిక్ పటేల్ సహా వివిధ రాష్ట్రాల యువ నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా వివిధ భాషలకు చెందిన వారి ఓట్లను రాబట్టేందుకు ఆయా రాష్ట్రాల నాయకుల్ని ప్రచార పర్వంలోకి తీసుకువచ్చింది.

'జై బజరంగ బలీ' అంటూ ఓటేయండి

కర్ణాటక ఓటర్లకు ప్రధాని మోదీ పిలుపు ● కాంగ్రెస్‌పై ధ్వజం



శివాజీనగర/ముల్కీ: 'కాంగ్రెస్ అవినీతి వ్యవస్థను కూల్చేశానని నాపై పీకలదాకా కోపం పెంచుకున్నారు. నన్ను నిరంతరం అవమానిస్తున్నారు. నన్ను దూషిస్తూ ఓట్లడుగుతున్నారు. ఇలాంటి అవమాన సంస్కృతిని మీరు అంగీకరిస్తారా? పోలింగ్ కేంద్రంలో మీట నొక్కేటపుడు జై బజరంగ బలీ అని నినదించండి. తద్వారా వారికి బుద్ధి చెప్పండి' అని కర్ణాటక ఓటర్లకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్రంలో మూడు బహిరంగ సభల్లో మోదీ ప్రసంగించారు. ప్రతిచోటా మొదట్లో, చివర్లో జై బజరంగ బలీ అంటూ నినదించారు. బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీపై ప్రధాని మండిపడ్డారు. 'విభజించు, పాలించు సిద్ధాంతమే ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ రాజకీయం నడుపుతుంది. ప్రపంచదేశాలు భారత్‌ను ఘనంగా కీర్తిస్తుంటే కాంగ్రెస్ నేతలు మాత్రం విదేశాల్లో పర్యటిస్తూ దేశ ప్రతిష్టను, సైన్యాన్ని అవమానించేలా దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. దేశాభివృద్ధికి, శాంతియుత వాతావరణానికి ప్రబల శత్రువు కాంగ్రెస్. ఎన్నికల లబ్ధి కోసం దేశ వ్యతిరేకులతోనూ ఒప్పందం చేసుకుంటోంది'' అంటూ దుయ్యబట్టారు.

ప్రజలే నా రిమోట్‌కంట్రోల్

140 కోట్ల మంది ప్రజలే తన రిమోట్ కంట్రోల్ అని మోదీ అన్నారు. ''కర్ణాటకను కాంగ్రెస్ ఏటీఎంలా వాడుకోవాలని చూస్తోంది. అలాంటి పార్టీని రాష్ట్రం నుంచి తరిమేయండి'' అని పిలుపునిచ్చారు.

40 శాతం కమీషన్లు కన్పించడం లేదా?

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రధానికి ప్రియాంక గాంధీ ప్రశ్న



సాక్షి, బళ్లారి: రాష్ట్రంలో మూడున్నర సంవత్సరాలు క్రితం అడ్డదారిలో ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం 40 శాతం కమీషన్లు వసూలు చేస్తోందని కాంట్రాక్టర్లు ఆరోపిస్తుంటే ప్రధాని నరేంద్రమోదీ ఎందుకు నోరు మెదపడం లేదని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ ప్రశ్నించారు. కర్ణాటకలో విజయపుర జిల్లాలోని ఇండి నియోజకవర్గంలో బుధవారం ఎన్నికల ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ప్రధాని మోదీ సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి అని అందరూ కొనియాడుతూ ఉంటారని అలాంటప్పుడు ఆయనకు కర్ణాటకలో ప్రభుత్వం ఏం చేస్తోందో తెలీదా అని ఆమె ఎద్దేవా చేశారు. ప్రతీ పనికి 40% కమీషన్లు తీసుకుంటూ ఉంటే కర్ణాటకను అభివృద్ధికే సమూనాగా తీర్చిదిద్దుతానని ప్రధాని మోదీ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంట్రాక్టర్లు, రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పటికీ బీజేపీ పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ అవినీతితో కంపెనీలు హైదరాబాద్, చెన్నై వైపు వెళుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ ప్రాంతం సమగ్రాభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఓట్ల కోసం తాను రాలేదని, వారి భవిష్యత్, పిల్లల భవిష్యత్ కోసమే వచ్చానంటూ ప్రియాంక భావోద్వేగంతో మాట్లాడారు.

'ఉపాధి'కి తగ్గిన బడ్జెట్

తగ్గిన లబ్ధిదారుల కుటుంబాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో లబ్ధి పొందుతున్న కుటుంబాల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ప్రతి ఏటా తగ్గుతున్న నిధుల కేటాయింపులకు తోడు ఆధార్ అనుసంధానిత చెల్లింపులు, ఆన్‌లైన్ హాజరు వంటి చర్యలతో పథకం కింద పనిచేసే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. కోవిడ్ సమయంలో సొంతూళ్లకు తిరిగి వచ్చిన వలసదారులకు ప్రధాన ఆర్థిక భద్రతగా ఉంటూ ఆసరాగా నిలిచిన ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య 2021 ఆర్థిక సంవత్సరం నుంచి తగ్గుతూ వస్తోందని కేంద్ర గణాంకాలు చాటుతున్నాయి. కోవిడ్ సమయంలో 2020–21లో రికార్డు స్థాయిలో 7.55 కోట్ల కుటుంబాలు దీనిద్వారా ఉపాధి పొందాయి. ఆ తర్వాత 2021–22 వచ్చేసరికి ఈ సంఖ్య 7.25కోట్లకు తగ్గింది. 2022–23 నాటికి 6.19 కోట్లకు పడిపోయింది. తగ్గిన కుటుంబాలకు తోడు పనిదినాల సంఖ్య కుచించుకుపోవడం ఆందోళనకరం. 2020–21లో సగటు పనిదినాల సంఖ్య 51.42 రోజులుకాగా, ఆ సంఖ్య 2022–23 ఏడాదికల్లా 47.84 రోజులకు పడిపోయింది. 2021–22లో కేంద్ర బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.98,467కోట్లు కేటాయించారు. 2022–23లో ఆ కేటాయింపులు కేవలం రూ.89వేల కోట్లకు పరిమితమయ్యాయి. ఈసారి బడ్జెట్‌లో కేవలం రూ.60వేల కోట్లే విదిల్చేందుకు సిద్ధమైంది. బడ్జెట్‌లేక పనిదినాలను కుదిస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

చొరబాటు యత్నం భగ్నం

సైన్యం కాల్పుల్లో ఇద్దరు ముష్కరుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని మఛిల్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వెంట భారత భూభాగంలోకి చొరబడేందుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను సైన్యం హతమార్చింది. 'నిఘా సమాచారంతో వర్షం, మంచులోనూ సైన్యం, పోలీసులు రెండు రోజులు మాటు వేశారు. బుధవారం ఉదయం ఉగ్రవాదుల రాకను గుర్తించారు. రెండువైపుల నుంచి కాల్పులు జరిగాయి. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ముష్కరుల హతమయ్యారు' అని శ్రీనగర్‌లోని ఆర్మీ అధికార ప్రతనిధి చెప్పారు. రెండు ఏకే రైఫిళ్లు, భారీగా మందుగుండు దొరికాయి.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 4 । మే । 2023



నేడు నాంచారమ్మ జాతర

కోడూరు: మందపాకలో వేంచేసి ఉన్న అద్దంకి నాంచారమ్మవారి గుడిజాతరను గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కోట గాదె కృష్ణబాబు తెలిపారు.



శిక్షణ తరగతుల పరిశీలన

పెనమలూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ శిక్షణ తరగతులను కృష్ణా డీఈఓ తాహెరా సుల్తానా పరిశీలించారు.



శ్రీమన్నారాయణుడి కల్యాణం

ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. -8లో▸

న్యూస్‌రీల్

వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): చిన్నారులకు వేసే వ్యాధి నిరోధక టీకాలను సక్రమంగా వేయాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. బుధవారం గిరిపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రామవరప్పాడు సచివాలయం-3లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం వద్ద పాటించాల్సిన నియమ నిబంధనలు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మాతా, శిశు సంరక్షణ కార్డులు, వ్యాక్సిన్ నిర్వహణ వంటి అంశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల వైద్యాధికారులతో పాటు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నూతన రైతు బజార్లలో సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, ఆఫీస్ ఫర్నిచర్లను సరఫరా చేసేందుకు ఆసక్తిగల కాంట్రాక్టర్లు ముందుకు రావాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలో ఇటీవల ప్రారంభించిన మూడు నూతన రైతు బజార్లలో 48 సీసీ కెమెరాలు, మూడేసి చొప్పున 30 కేజీల ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, 150 కేజీల ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, ఆఫీస్ టేబుల్స్, ఎస్ టైప్ కుర్చీలు, 14 ప్లాస్టిక్ కూర్చీలు, 3 ఇనుప బీరువాలు, 2 ఇనుప రాక్‌లు సరఫరా చేసేందుకు ఆసక్తి కలిగిన కాంట్రాక్టర్ల నుంచి సీల్డ్ కవర్‌లో టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు కొటేషన్‌తో ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు టెండర్లను సమర్పించాలన్నారు. టెండర్లతో పాటు రూ. 15 వేల ధరావతు సొమ్మును అగ్రికల్చర్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్, రైతుబజార్లు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వారి పేరున డీడీ తీసి జత చేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు విజయవాడ సమీపంలోని గొల్లపూడి మార్కెట్ యార్డ్ నందు గల జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి వారి కార్యాలయం నందు స్వయంగా గానీ లేదా 9182361119/91823 61456, 0866-2972417లో గానీ సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ ఆ ప్రకటనలో సూచించారు.

జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా వ్యాప్తంగా బుధవారం మోస్తరు వర్షం కురిసింది. 16.0 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కంకిపాడు మండలంలో 104.0 మిల్లీమీటర్లు, అత్యల్పంగా 0.4 మిల్లీమీటర్లు మచిలీపట్నంలో మండలంలో వర్షం కురిసింది. జిల్లాలో ఆయా మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెదపారుపూడి మండలంలో 60.8, పెనమలూరు 45.0, తోట్లవల్లూరు 43.4, నందివాడ 33.8, గుడివాడ 31.2, ఉయ్యూరు 28.2, గన్నవరం 14.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. బాపులపాడు మండలంలో 12.8 మిల్లీమీటర్లు, పమిడిముక్కల 10.6, ఉంగుటూరు 9.6, పామర్రు 3.2, కోడూరు 1.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు.

భక్తుల ఫిర్యాదులను నమోదు చేయండి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనం, ప్రసాదాలు, ఇతర అంశాలపై భక్తుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు నమోదు చేసుకోవడంతో పాటు ఆ ఫిర్యాదులను ప్రతి నెలా చైర్మన్, ఈవోలకు పంపాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. మహా మండపం గ్రౌండ్ ఫ్లోర్‌లోని టోల్‌ఫ్రీ నంబర్ కార్యాలయాన్ని చైర్మన్ రాంబాబు బుధవారం తనిఖీ చేశారు. టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే కాల్స్ వివరాలను నమోదుతో పాటు ఫిర్యాదులను వివరంగా నమోదు చేయాలన్నారు. అమ్మవారి దర్శనం, పూజలు, ఇతర అంశాలకు భక్తులు అడిగే ప్రశ్నలకు సమాచారం అందించాలని సూచించారు. ఇక ఫిర్యాదులను తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా సూచించారు.

అవినీతి జలగలకు ఝులక్!

ఏసీబీ దూకుడుతో అధికారుల్లో గుబులు

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో విస్తృతంగా దాడులు
- ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో ఇద్దరు అధికారుల ఆస్తులపై తనిఖీలు
- పటమట సబ్ రిజిస్ట్రార్ వద్ద అక్రమాస్తులు రూ. 10కోట్ల నుంచి 15కోట్లు గుర్తింపు
- దుర్గగుడి సూపరింటెండెంట్ వద్ద రూ. 5కోట్ల నుంచి 7కోట్లు
- కొనసాగుతున్న సోదాలు



పటమట సబ్ రిజిస్ట్రార్ రాఘవరావు ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఏసీబీ.. అవినీతి అధికారుల భరతం పడుతోంది. 14400 కాల్‌సెంటర్, ఏసీబీ యాప్‌లకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా పక్కా ఆధారాలతో కేసులు నమోదు చేసి, అవినీతి జలగలను కటకటాల వెనక్కి పంపుతున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై విజయవాడలోని పటమట సబ్ రిజిస్ట్రార్ అజ్జా రాఘవరావుకు సంబంధించిన ఆస్తులపై మంగళవారం సాయంత్రం నుంచి ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్న విషయం తెలిసింది. బుధవారం కూడా ఈ సోదాలు కొనసాగాయి. అలాగే దుర్గగుడి సూపరింటెండెంట్ వాసా నగేష్‌పై వచ్చిన ఆరోపణలపైనా ఏసీబీ అధికారులు బుధవారం ఇంద్రకీలాద్రికి వచ్చి తనిఖీలు నిర్వహించారు.



నగేష్ ఇంట్లో ఏసీబీ స్వాధీనం చేసుకున్న నగదు

పెద్ద చేపే..

పటమట సబ్ రిజిస్ట్రార్ అజ్జా రాఘవరావు ఆస్తులపై తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు రాఘవరావుతో పాటు మరో ముగ్గురు ప్రైవేటు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి పటమట కార్యాలయం, ఆయన ఇల్లు, బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఇళ్లు, తదితర ప్రాంతాల్లో మొత్తం ఆరుచోట్ల జరిపిన సోదాల్లో భారీ ఎత్తున అక్రమాస్తులకు సంబంధించిన విలువైన పత్రాలు, నగదు, వాహనాలు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్‌కు డబ్బులు కలెక్టు చేస్తున్న ముగ్గురు కీలక ప్రైవేటు వ్యక్తులు అదుపులోకి తీసుకొని ఎవరెవరి నుంచి డబ్బులు కలెక్ట్ చేశారో ఆరా తీస్తున్నారు. తాజాగా ఇటీవల రెండు భవనాల కొనుగోలు చేసేందుకు రూ.50 లక్షల అడ్వాన్స్ ఇచ్చినట్లు గుర్తించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం నాలుగు నుంచి ఐదుకోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు కనుగొన్నారు. మార్కెట్ విలువ ఆధారంగా వీటి విలువ రూ.10కోట్ల నుంచి రూ.15కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంకా కొన్ని లాకర్స్‌ను ఓపెన్ చేయాల్సి ఉన్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో 2018లో అవనిగడ్డ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో జరిగిన సోదాలకు సంబంధించి శాఖాపరమైన చర్య ఇంకా పెండింగ్‌లో ఉంది.



దుర్గగుడి సూపరింటెండెంట్ నగేష్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

నగేష్ మామూలోడు కాదు..

విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవాలయం సూపరింటెండెంట్ వాసా నగేష్ ఆస్తుల పైనా సోదాలు కొనసాగుతున్నాయి. కుమ్మరిపాలెంలోని లోటస్ లెజెండ్ అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నంబర్ ఎఫ్-34లోని నివాసం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మరో 6 చోట్ల, దుర్గ గుడిలోని ఏఓ కార్యాలయంతో పాటు ఏఓ బంధువుల ఇళ్లల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఇంకా పలు చోట్ల సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు అధికారుల సోదాల్లో రూ.5కోట్ల నుంచి రూ.7కోట్ల విలువైన అక్రమాస్తులు గుర్తించారు.

ఇంద్రకీలాద్రిపై కలకలం..

దుర్గగుడి సూపరిండెంటెంట్ వాసా నగేష్‌పై బుధవారం అవినీతి నిరోధక శాఖ సోదాలు చేయడంతో ఇంద్రకీలాద్రిపై కలకలం రేగింది. నగేష్ తన వ్యక్తిగత పనులపై బుధ, గురువారాలు సెలవుపై వెళ్లారు. అయితే ఏసీబీ అధికారులు దాడులు చేసినట్లు తెలిసిన వెంటనే కొంత మంది నాల్గో అంతస్తులోని కార్యాలయానికి వెళ్లి ఆరా తీసేందుకు ప్రయత్నించగా నగేష్ అందుబాటులోకి రాలేదు. గతంలో పాలకవర్గ సమావేశంలో సైతం ఈయన అవినీతిపై ఈవోను పలువురు ప్రశ్నించారు. ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. అయితే నగేష్‌పై ఆరోపణలు చేసిన వారు సాక్ష్యాలు ఉంటే నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని ఈవో భ్రమరాంబ ఆ సమావేశంలో దాట వేశారు. పాలక మండలి ఫిర్యాదును సైతం ఈవో బుట్టదాఖలు చేయడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఈయనపైన చర్య తీసుకోకపోడటానికి ప్రధాన కారణం ఈయనే షాడో ఈవోగా వ్యవహరిస్తూ, అన్నీ చక్కబెడుతుండటమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కీలక బాధ్యతలు ఆయనకే..

ద్వారకాతిరుమల నుంచి ఇంద్రకీలాద్రికి బదిలీపై వచ్చిన నగేష్‌కు ఈవో భ్రమరాంబ ఆలయంలోని పలు విభాగాల్లో కీలక బాధ్యతలు అప్పగించారు. దేవస్థానంలో కీలకమైన అంతరాలయ పర్యవేక్షణతో పాటు ప్రసాదాల కౌంటర్లు, టోల్‌గేట్లు నిర్వహణ బాధ్యతలు నగేష్ చూస్తారు. అంతే కాకుండా ఆలయం సిబ్బంది పొరపాటున ఏదైనా తప్పు చేసినట్లు గుర్తిస్తే దానికి నగేష్‌నే విచారణ అధికారిగా నియమించడం సర్వసాధారణమైంది. నకిలీ టికెట్ల వ్యవహారంలో లోతుగా విచారణ చేస్తే నగేష్ మెడకు చుట్టుకునే అవకాశం ఉన్నప్పటికీ ఈవో వెనకేసుకురావడంతో అది తప్పింది. ఇప్పుడు ఏసీబీ తనిఖీలతో ఆలయ ప్రతిష్ట మసకబారే పరిస్థితి ఏర్పడిందని పలు భక్తులు ఆరోపిస్తున్నారు.

లబ్ధిదారులను చైతన్య పరచండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న కాలనీల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులను చైతన్య పరచాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సంబంధిత అధికారులకు సూచించారు. నిర్మాణంలో లబ్ధిదారులను కూడా భాగస్వాములను చేయడం ద్వారా పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు, నాడు- నేడు పనుల ప్రగతి, స్పందన అర్జీల పరిష్కారంపై కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను ప్రతిరోజూ ఎంపీడీఓలు, ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇళ్ల నిర్మాణ బాధ్యత కేవలం గృహనిర్మాణ శాఖ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లదేనన్న భావన ఎంపీడీఓలు విడనాడాలన్నారు. లబ్ధిదారుల్లో చైతన్య పరచడం ద్వారా వారంవారం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిలో అలసత్వం చూపే సిబ్బందిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనుకాడవద్దన్నారు. ఇప్పటివరకు జగనన్న కాలనీలలో సుమారు 11 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. మిగిలినవి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు.

నాడు-నేడు పనులు జూన్ నెలాఖరుకు పూర్తి..

నాడు-నేడు పథకం కింద జిల్లాలో 503 పాఠశాలలు, 9 కళాశాలలు, 84 అంగన్‌వాడీ కేంద్రాలలో చేపట్టిన పనులను జూన్ నెల చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. 249 పాఠశాలలో 1,046 అదనపు గదుల నిర్మాణాలను, 391 పాఠశాలలకు మంజూరు అయిన టాయిలెట్లు, కిచెన్ షెడ్ల నిర్మాణాలను పాఠశాల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ రజనీ కుమారి, డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాస్‌రావు, ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, డీఈఓ సీవీ రేణుక, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వీడని ముసురు

- కొనసాగుతున్న ద్రోణి ప్రభావం
- ఐదో రోజు కొనసాగిన వర్షాలు
- కల్లాల్లోనే పలు పంటలు
- పంట నష్టం అంచనాల్లో అధికారులు

కంకిపాడు(పెనమలూరు): వాతావరణం స్వల్పంగా తెరపిచ్చింది. అయినా అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. ద్రోణి ప్రభావంతో గత ఐదు రోజులుగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పంట పొలాల్లో ఉన్న పంటను సంరక్షించుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లాలో వర్షాల కారణంగా పంట పొలాల్లో రాశులుగా పోసి ఉంచిన మొక్కజొన్న, జొన్న, ధాన్యం, పసుపు, అరటి, మిర్చి పంటలను పొడి ప్రదేశాలకు చేర్చి ఆరబెట్టారు. హుటాహుటిన ధాన్యం కాటాలు వేసి లారీల్లో మిల్లులకు తరలిస్తున్నారు. ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న, జొన్న పంటలను కూలీలతో మెరక ప్రాంతాలకు చేర్చారు. పసుపు పంట నాలుగు రోజులు పాటు నీటిలో నానటంతో కొమ్ములు నలుపు రంగుకుమారాయి. కోతకు సిద్ధంగా ఉన్న జొన్న, మొక్కజొన్న పైర్లు ఫంగస్ బారిన పడ్డాయి. గింజలు నల్లబడటంతో మార్కెట్‌కు చేర్చే అవకాశం కూడా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట మీద ఉన్న మొక్కజొన్న, జొన్న చేలల్లో మురుగునీటిని తొలగించేందుకు ఆయిల్ ఇంజిన్లు వినియోగిస్తున్నారు. పంట బోదెల్లోకి నీటిని తోడే పనులను రైతులు చేపడుతున్నారు. పంట నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు పర్యటించి రైతులకు ధైర్యం చెప్పారు. ప్రాథమికంగా పంట నష్టం వివరాలను సమర్థంగా నమోదు చేయాలని ఆయా శాఖలకు సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యవసాయాధికారి ఎం. విజయభారతి కంకిపాడు, తోట్లవల్లూరు ప్రాంతాల్లో పర్యటించి వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పంటలకు జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. పంట సంరక్షణ చర్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు.



గొడవర్రులో దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి విజయభారతి

నష్టం అంచనాలు ఇలా..

అకాల వర్షానికి ఉమ్మడి జిల్లాలో పంటలకు జరిగిన నష్టంపై వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే ప్రాథమిక అంచనాలను సిద్ధం చేయాలని మౌఖికంగా సూచించారు. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం జిల్లాలోని తోట్లవల్లూరు, కంకిపాడు, గన్నవరం, పమిడిముక్కల, మోపిదేవి, పెనమలూరు, అవనిగడ్డ ప్రాంతాల్లోని సుమారు 44 గ్రామాల్లో మొక్కజొన్న, జొన్న, ధాన్యం, ఉద్యానశాఖ పంటలకు సంబంధించి అరటి, పసుపు పంటలకు నష్టం వాటిల్లింది. మొక్కజొన్న 897.72 హెక్టార్లలోనూ, జొన్న 78.5 హెక్టార్లలోనూ, వరి 152.27 హెక్టార్లలోనూ నష్టం వాటిల్లినట్లు అంచనాలను రూపొందించారు. కల్లాల్లో ఆరబోసిన స్థితిలో మొక్కజొన్న 647 హెక్టార్లలో, జొన్న 209 హెక్టార్లలో, వరి 96.23 హెక్టార్లలోనూ ఉంది. కల్లాల్లో ఉన్న పంటను మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు రైతులు త్వరపడుతున్నారు.

కృష్ణా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, తుపాను రానున్నట్లు వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు బుధవారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు ఈ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కంట్రోల్‌రూమ్‌లో 24 గంటలు సిబ్బంది ఉండేలా మూడు షిఫ్టులుగా నియమించామన్నారు. కంట్రోల్ రూమ్ నంబర్ 08672-252572ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో అకాలవర్షాలు, తుపాను ప్రభావంతో ఏదైనా నష్టం జరిగినా ఆ ప్రాంతవాసులు ఈ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలిపిన వెంటనే సహాయకచర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు.

నేటి నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు..

పామర్రు నియోజకవర్గంలో పంట నష్టం జరిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పరిశీలించారు. తోట్లవల్లూరు మండలంలోని లంక ప్రాంతాలను సైతం పరిశీలించి, రైతులను అడిగి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆ వివరాలను వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే నేటి నుంచే రైతు భరోసా కేంద్రాల ద్వారా మొక్క జొన్న కొనుగోళ్లు చేస్తామని చెప్పారు.



తోట్లవల్లూరులో ధాన్యం రాశిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ముమ్మరంగా ఫిషింగ్ హార్బర్ పనులు

పరిశీలించిన ఎంయూడీఏ చైర్‌పర్సన్ దుర్గాభవాని

మచిలీపట్నంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రారంభించిన ఫిషింగ్ హార్బర్ పనులు 75 శాతం పూర్తయ్యాయని ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని అన్నారు. బుధవారం నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, ఎంయూడీఏ వీసీ కె. రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)లతో కలిసి సముద్రం మొగ వద్ద జరుగుతున్న ఫిషింగ్ హార్బర్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని మత్స్యకారులు చేపలవేటకు వెళ్లేందుకు ఉన్న పాయలో ఇసుక మేట వేసి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను గుర్తించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లటంతో పూడికతీత (డ్రెడ్జింగ్) పనులు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ. 322 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో 18 నెలలుగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఈ పనులు 75శాతం పూర్తయ్యాయని అక్టోబర్ నాటికి పనులు పూర్తయితే మత్స్యకారుల బోట్లలో వేటకు వెళ్లేందుకు ఇబ్బందులు తొలగుతాయన్నారు. డ్రెడ్జింగ్ పనుల్లో భాగంగా మూడున్నర మీటర్ల లోతున 22 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టిని తొలగించామన్నారు. మూడు కిలోమీటర్ల మేర ఉన్న ఈ పాయలో పనులు జరుగుతున్నాయన్నారు. పాయలో ఇకపై ఇసుక మేటలు వేయకుండా దక్షిణం వైపున 1240 మీటర్లు, ఉత్తరం వైపున 1150 మీటర్ల బండరాళ్లతో గోడ నిర్మిస్తామన్నారు. మత్స్యకారులు ఫిషింగ్ చేసిన తర్వాత దిగుమతి కోసం ఒకేసారి 600 బోట్లను నిలబెట్టేందుకు 790 మీటర్ల కె-వాల్ కూడా నిర్మిస్తున్నట్లు చెప్పారు.



హార్బర్ పనులను పరిశీలిస్తున్న ఎంయూడీఏ చైర్మన్ దుర్గాభవాని, మేయర్ వెంకటేశ్వరమ్మ

గతంలో లేని అభివృద్ధి..

బందరు మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ గతంలో మత్స్యకార వర్గానికి చెందిన వారు ఎమ్మెల్యేలు, మంత్రులుగా పనిచేసినా ఈ విధమైన అభివృద్ధి చేయలేదన్నారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక చొరవతో సీఎం జగన్ నిధులు విడుదల చేయటంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులకు సంబంధించి పలు వివరాలను పోర్టు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. మునిరెడ్డి వీరికి వివరించారు. ఈ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే పేర్ని నాని, సీఎం జగన్ చేస్తున్న ఈ మేలును ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. ఫిషింగ్ హార్బర్ పనులు పరిశీలించిన అనంతరం తపసిపూడి గ్రామ సముద్రతీరాన జరుగుతున్న బందరు పోర్టు నిర్మాణ పనుల శంకుస్థాపన పనులను వారు పరిశీలించారు. ఈ నెల 22వ తేదీన ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు.

నిధులొచ్చాయ్.. పనుల్లో వేగం పెంచండి

అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాకు మంజూరైన గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి(ఆర్ఐడీఎఫ్)తో చేపట్టిన ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. నాబార్డ్ ద్వారా ఆర్ఐడీఎఫ్ నిధులతో చేపట్టిన పనుల ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాబార్డ్ ద్వారా 192 ప్రాజెక్టులకు ఆర్ఐడీఎఫ్ కింద రూ. 188.39 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ఈ నిధులలో రూ.154.24కోట్లు అభివృద్ధి పనులు చేపట్టేందుకు వివిధ శాఖలకు కేటాయించామన్నారు. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ నందు ఒక ప్రాజెక్టుకు రూ. 84 లక్షలు, పశుసంవర్ధక శాఖలో ఎనిమిది ప్రాజెక్టులకు రూ.1.12 కోట్లు, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఐదు ప్రాజెక్టులకు రూ. 56.94కోట్లు, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్‌లో మూడు ప్రాజెకులకు రూ. 97.41లక్షలు, వ్యవసాయ శాఖలో నాలుగు ప్రాజెక్టులకు రూ.2.62 కోట్లు, పంచాయతీరాజ్ శాఖలో నాలుగు ప్రాజెక్టులకు రూ. 3.55 కోట్లు, ఆరోగ్య శాఖలో ఐదు ప్రాజెక్టులకు రూ.11.13 కోట్లు, రోడ్లు భవనాల శాఖలో మూడు ప్రాజెక్టులకు రూ. 4.02 కోట్లు, గ్రామీణ నీటి సరఫరా శాఖలో రెండు ప్రాజెక్టులకు రూ. 7. 82 కోట్లు, సమగ్ర శిక్ష శాఖలో 59 ప్రాజెక్టులకు రూ. 56.36 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖలో ఐదు ప్రాజెక్టులకు రూ. 4.89 కోట్లు, మహిళ శిశు సంక్షేమ శాఖలో 93 ప్రాజెక్టులకు రూ. 3.92 కోట్లు, కేటాయించామన్నారు. ఈ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆయా శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో నాబార్డ్ ఏజీఎం మిలింద్ చౌ సాల్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

95.85 శాతం పెన్షన్ కానుక పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ పింఛను కానుక పథకం ద్వారా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం మూడో రోజైన బుధవారం కొనసాగింది. లబ్ధిదారులు వేరే ప్రాంతాల్లో ఉన్నా కూడా సంబంధిత వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందజేయటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,28,303 మందికి గాను మొదటి మూడు రోజుల్లో 2,18,832 మందికి పెన్షన్ కానుక అందజేశారు. దీంతో 95.85 శాతం పంపిణీ పూర్తయింది. అత్యధికంగా జి.కొండూరులో 98.41 శాతం ఇబ్రహీంపట్నంలో 98.34 శాతం, నందిగామ (అర్బన్)లో 97.67 శాతం, గంపలగూడెంలో 97.5 శాతం పంపిణీ పూర్తయింది.



విజయవాడ కొత్తపేటలో వృద్ధురాలు అనసూయమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ దుర్గారావు

రెండో జాబితాలో 65 మంది ఎంపిక

కంకిపాడు: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద రెండో జాబితాలో 65 మంది విద్యార్థులకు పాఠశాలలను కేటాయించినట్లు డీఈఓ తాహెరా సుల్తానా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పేద వర్గాలకు ప్రైవేటు, అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించేందుకు ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. తొలి విడతలో ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి అర్జీలు స్వీకరించామన్నారు. తొలి విడతలో మొదటి జాబితాలో 150 మందిని లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసిందన్నారు. వీరిలో 129 మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరారన్నారు. రెండో జాబితాలోని విద్యార్థులు వారికి కేటాయించిన పాఠశాలల్లో ఈనెల 9లోపు ప్రవేశాలను పొందాలని సూచించారు.

క్లుప్తంగా

ఆక్వా రంగంలో అవకాశాలపై సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆక్వా కల్చర్, ఆక్వా డయాగ్నోస్టిక్స్ రంగాల్లో అవకాశాలపై శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల జంతు, మత్స్య సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథులుగా జెనిసిస్ బయో సైన్సెస్ ఫౌండర్ బి.అమరేంద్ర, ఒమిక్స్ నెక్స్‌జెన్ లేబొరేటరీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.మధుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ జీవ సాంకేతిక విజ్ఞానం, వ్యాధి నిర్ధారణ గురించి వివరించారు. అనుజీవశాస్త్రం, పీసీఆర్, ఆర్టీపీసీఆర్, డీఎన్‌ఏ ప్రతిరూపం గురించి, వాటిని ఉపయోగించి మన కంటికి కనిపించని సూక్ష్మజీవులు సృష్టించే వ్యాధులకు ఎలా తెలుసుకుంటామో వివరించారు. ఈ విజ్ఞాన విధానాలను ఉపయోగించి వాటిని గుర్తించి ఎలా నిర్మూలించవచ్చునో తెలిపారు. అనంతరం అమరేంద్ర మాట్లాడుతూ మత్స్య పరిశ్రమలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఉద్యోగ అవకాశాలు ల్యాబ్స్, ప్రాసెసింగ్ యూనిట్స్, మార్కెటింగ్, హేచరీస్, టీచింగ్, ఫీడ్ మిల్స్, ఆక్వా కన్సల్టెంట్‌గా కూడా రాణించవచ్చునన్నారు. సదస్సులో జంతుశాస్త్ర విభాగాధిపతి కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పత్రికలు జనం పక్షాన నిలవాలి

సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పత్రికలు జనం పక్షాన నిలవాలని ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా నాగార్జున యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్నలిజం డిప్లొమో కోర్సు ఆన్‌లైన్ తరగతులకు బుధవారం హాజరైన వారిని ఉద్దేశించి కొమ్మినేని శ్రీనివాసరావు ప్రసంగించారు. చైనాలో కంటే మనదేశంలోనే పత్రికా స్వేచ్ఛ చాలా మెరుగ్గా ఉందని కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు.

కృష్ణపట్నం పోర్టు, గతిశక్తి టెర్మినల్ తనిఖీ



కృష్ణపట్నం పోర్టు అధికారులతో సమీక్షిస్తున్న పీసీసీఎమ్ రవీన్‌కుమార్ రెడ్డి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య ప్రిన్సిపల్ రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎమ్) రవీన్‌కుమార్ రెడ్డి బుధవారం విజయవాడ డివిజన్‌లోని అదాని కృష్ణపట్నం పోర్టు ప్రైవేట్ సైడింగ్ లిమిటెడ్, బీపీసీఎల్ గతిశక్తి కార్గో టెర్మినల్‌లను తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ముందుగా అదాని కృష్ణపట్నంను తనిఖీ చేసి 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా బొగ్గు లోడింగ్ సాధించడంలో పోర్టు అధికారుల సహకారాన్ని ప్రశంసించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పనితీరు, రాబోయే త్రైమాసికాల్లో లోడింగ్ అంచనాలు, సరుకు రవాణా ఆదాయ అంచనాలపై పోర్టు అధికారులతో చర్చించారు. అనంతరం లోడింగ్ పాయింట్‌లు, వే బ్రిడ్జి, టార్పాలిన్ ప్యాకింగ్ విధానాన్ని పరిశీలించారు. ప్రస్తుత డిమాండ్‌లో ఉన్న సరుకు రవాణా లక్ష్యాన్ని సాధించేందుకు రైల్వేశాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

అనంతరం నూతనంగా ప్రారంభించిన బీపీసీఎల్ గతిశక్తి కార్గో టెర్మినల్‌ను ఆయన పరిశీలించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్రోలియం, ఆయిల్ లూబ్రికెంట్‌ల లోడింగ్ అంచనాలపై చర్చించారు. లోడింగ్ పాయింట్‌లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, భద్రతా చర్యలను పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గంలో నెల్లూరు రైల్వే స్టేషన్ చేరుకుని ప్లాట్‌ఫారాలను పరిశీలించారు. ప్రయాణికులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో జరుగుతున్న రీడెవలప్‌మెంట్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాల్సిందిగా సూచించారు. ఈ పర్యటనలో పీసీసీఎమ్‌తో పాటు సీనియర్ డీసీఎం వావిళ్లపల్లి రాంబాబు, ఏసీఎం రవివర్మ, ఏఓ తేజస్ తదితరులు ఉన్నారు.

మతతత్వ అజెండా అమలే బీజేపీ లక్ష్యం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పాఠ్యాంశాలలో చరిత్రను తొలగించి మతతత్వ అజెండాను అమలు చేయడమే బీజేపీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మొవ్వా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బుధవారం పాఠ్యాంశాలలో డార్విన్ జీవపరిణామ సిద్ధాంత తొలగింపుపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ పదో తరగతి పాఠ్యాంశాలలో డార్విన్ సిద్ధాంతం తొలగింపును ఖండిస్తూ 1800 మంది చరిత్రకారులు రాష్ట్రపతికి మొమోరాండం ఇచ్చారన్నారు. పదకొండో తరగతి పాఠ్యాంశాలలో ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఎట్ వర్క్ అనే ఒక పాఠంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గురించి తొలగించారన్నారు. హిస్టరీ లెక్చరర్ అజయ్‌బాబు మాట్లాడుతూ డార్విన్ పరిణామ క్రమాన్ని తొలగించటమంటే ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని తీసివేయడమేనన్నారు. సమావేశంలో ఎం.బి.విజ్ఞాన కేంద్ర బాధ్యులు ఎస్.పి.రామరాజు, టి.క్రాంతి, యు.వి. రామరాజు, ఉషారాణి, వెలగా శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీమన్నారాయణుడి కల్యాణం

కోడూరు(అవనిగడ్డ): వేదపండితుల మంత్రోచ్చరణ.. మంగళవాయిద్యాల మధుర స్వరాలు.. పూల పరిమళాల నడుమ శ్రీమన్నారాయణుడి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం లోని గోద, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు పంచరామ ఆగమశాస్త్రబద్ధంగా ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. శ్రీమన్నారాయణ స్వామిని రాజకుమారుడుగా అలంకరించి కల్యాణవేదిక వద్దకు తీసుకొచ్చారు. అమ్మవార్లను ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో స్వామివార్ల కల్యాణ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. కల్యాణంలోని వివిధ ఘట్టాల గురించి అష్టాక్షరీ స్వామిజీ భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. కర్నూలు, నల్లగొండ, మచిలీపట్నం, విజయవాడ ప్రాంతాలకు చెందిన దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కల్యాణాన్ని జరిపించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కల్యాణం తిలకించేందుకు ఆశేషంగా భక్తులు తరలివచ్చారు. రాత్రికి కల్యాణమూర్తులను ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. గురువారం స్వామివారి ఉత్సవమూర్తలకు తిరుమంజన సేన, గరుడవాహనంపై ఊరేగింపు నిర్వహించనున్నట్లు అష్టాక్షరీ స్వామిజీ చెప్పారు.

లారీని ఢీకొన్న టీఎస్ ఆర్టీసీ బస్సు

- 23 మందికి స్వల్ప గాయాలు
- మరొకరి పరిస్థితి విషమం
- డ్రైవర్ నిద్ర మత్తే కారణం
- జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు వద్ద ఘటన



చిల్లకల్లు వద్ద లారీని ఢీకొట్టిన టీఎస్ ఆర్టీసీ బస్సు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): లారీని బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరు తీవ్రంగా మరో 23 మంది స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజాము ఐదు గంటల సమయంలో జరిగింది. తెలంగాణకు చెందిన ఆర్టీసీ రాజధాని బస్సు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు చెందిన 37 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరింది. ఈ క్రమంలో గ్రామంలోని ఫ్లైఓవర్ పై నుంచి కిందకు దిగుతున్న బస్సు అదే సమయంలో గ్రామంలోని సర్వీస్ రోడ్డు నుంచి 65వ నంబరు జాతీయ రహదారి ఎక్కేందుకు వస్తున్న లారీని పెట్రోల్ బంకు సమీపంలో వెనుకగా ఢీకొట్టింది. ఈ సమయంలో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నారు. లారీని బస్సు ఢీకొన్న సమయంలో పెద్ద శబ్దం వచ్చింది. ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడి భయంతో ఆర్తనాదాలు చేశారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సమీపంలోని జీఎంఆర్ టోల్‌ప్లాజా సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు.

పోలీసులు కూడా వచ్చి టోల్‌ప్లాజా సిబ్బందితో కలిసి ప్రయాణికులను బస్సు నుంచి బయటకు తీసుకువచ్చారు. డ్రైవర్ తన్నీరు లక్ష్మీనారాయణ తన సీటులో ఇరుక్కుపోవటంతో బయటకు తీసేందుకు పోలీసులు రెండు గంటల పాటు శ్రమించారు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ రెండు కాళ్లు విరిగాయి.



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది


తీవ్రంగా గాయపడిన కొనిశెట్టి లక్ష్మి

బస్సులో ప్రయాణిస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్.అన్నవరానికి చెందిన కొనిశెట్టి లక్ష్మి అనే మహిళకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమించటంతో విజయవాడ తరలించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం లేకపోవటంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉదయభాను చొరవతో అంబులెన్స్‌లు ఏర్పాటు

ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేట్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయించి గాయపడిన 24 మందిని జగ్గయ్యపేట, విజయవాడ ప్రభుత్వాస్పత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కట్టా వీరబాబు వైద్యులతో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. ఈ ప్రమాదానికి డ్రైవర్ నిద్ర మత్తు కారణమని అధికారులు అంటున్నారు. ఘటనా స్థలాన్ని విజయవాడ డీసీపీ అజిత, ఏసీపీ జనార్దన్ నాయుడు, సీఐ జానకిరామ్, ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తదితరులు పరిశీలించారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

- హత్యాయత్నం చేసింది ముగ్గురు
- పురికొల్పింది ఇద్దరు
- రూ.2 లక్షలు సుపారీకి ఒప్పందం
- నిందితులను అరెస్టు చేసిన కంకిపాడు పోలీసులు


నిందితులను మీడియా ఎదుట హాజరుపర్చి వివరాలు వెల్లడిస్తున్న సీఐ పరమేశ్వర్, ఎస్‌ఐ సుధాకర్

కంకిపాడు: హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐ కె.సుధాకర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. సీఐ పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన వెన్న సుబ్బారావుపై గత నెల 29న ఆటోనగర్‌లో దుకాణం మూసివేసి బైక్‌పై అర్ధరాత్రి సమయంలో వస్తుండగా వెనుకగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు పునాదిపాడు–గొల్లగూడెం మార్గమధ్యంలో బైక్‌తో ఢీకొట్టి అరటికాయలు కోసే కత్తి, కోడికత్తులతో పొడిచారు. తీవ్ర గాయాలపాలైన సుబ్బారావు విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదైంది. కోపూరి పెద్ద వాసు తనపై హత్యాయత్నం చేయించాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొనటంతో సీసీ ఫుటేజ్ ఆధారంగా హత్యాయత్నంకు పాల్పడ్డ నిందితులను గుర్తించారు. జిల్లా ఎస్పీ పి.జాషువా, ఇన్‌చార్జి డీఎస్పీ సత్యానందం సూచనలతో ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు జరిపారు. గునపర్తి ప్రసాద్, ఆళ్ల గణేష్, మోపాడ దుర్గాప్రసాద్ హత్యాయత్నంకు పాల్పడ్డట్లు, వారిని కోపూరి చిన్న వాసు, కోపూరి పెద్ద వాసు హత్యాయత్నంకు పురికొల్పినట్లు పోలీసుల విచారణలో తేలింది. కోపూరి పెద్ద వాసు, వెన్న సుబ్బారావుకు మధ్య పాత గొడవలే హత్యాయత్నంకు దారితీసినట్లు విచారణలో స్పష్టమైంది. శ్రీకాకుళం, బాపట్ల, పటమట ప్రాంతాల్లో నిఘా వేసి హత్యాయత్నానికి పథకం రూపొందించిన కోపూరి చిన్న వాసు, కోపూరి పెద్దవాసు, హత్యాయత్నంకు పాల్పడ్డ గునపర్తి ప్రసాద్, ఆళ్ల గణేష్, మోపాడ దుర్గాప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నారు. హత్య చేసేందుకు రూ.2 లక్షలు సుపారీకి ఒప్పందం కూడా చేసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. పెద్ద వాసు, గునపర్తి ప్రసాద్, ఆళ్ల గణేష్, మోపాడ దుర్గాప్రసాద్‌లపై పలు పోలీసుస్టేషన్‌లో కేసులు కూడా ఉన్నాయి. నిందితులను బుధవారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బైక్, హత్యాయత్నంకు వినియోగించిన అరటికాయలు కోసే కత్తి, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించినందుకు జిల్లా ఎస్పీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఉయ్యూరు చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్టు

ఉయ్యూరులో జరిగిన చైన్‌స్నాచింగ్ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పరమేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన కంకిపాడులో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 31న ఉయ్యూరు పట్టణంలో అడ్రస్ అడిగే నెపంతో ఇద్దరు వ్యక్తులు వృద్ధురాలిని పలకరించి ఆమె మెడలో ఉన్న 4.5 కాసుల బంగారు గొలుసు అపహరించుకు పోయారన్నారు. కేసు నమోదు చేసి 3 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి నిందితుల కోసం గాలింపు జరిపామన్నారు. వైజాగ్ సమీపంలోని గాజువాక వద్ద చైన్‌స్నాచింగ్ నిందితులు ప్రవీణ్‌కుమార్, దానియేలును గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని వివరించారు. అపహరించుకుపోయిన 4.5 కాసుల బంగారు ఆభరణాన్ని ఓ ప్రైవేటు సంస్థలో కుదువ పెట్టారని, త్వరలోనే రికవరీ చేస్తామని వివరించారు.

రాముడికి 14 రోజులు రిమాండ్

పెడన: యాసిడ్ మీద పడి పట్టణానికి చెందిన మహిళ గాయాలపాలైన ఘటనలో నిందితుడు వాసా రాముడుకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు పెడన పోలీసులు బుధవారం తెలిపారు. రాముడును మంగళవారం అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు. నిందితుడిని అవనిగడ్డ సబ్ జైలుకు తరలించినట్టు తెలిపారు.

బస్సు ఇంజిన్‌లో చెలరేగిన మంటలు



జి.కొండూరు: బస్సు ఇంజిన్‌లో మంటలు చెలరేగిన ఘటన జి.కొండూరు మెయిన్ సెంటర్లో బుధవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలలోకి వెళ్తే...ఇబ్రహీంపట్నం డిపోకి చెందిన ఏపీఎస్ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో విజయవాడ నుంచి మైలవరం వెళ్తూ బుధవారం మధ్యాహ్నం జి.కొండూరు మెయిన్ సెంటర్లో ఆగింది. ఆ సమయంలో బస్సు ఇంజిన్‌లో మంటలు చెలరేగడం గమనించిన డ్రైవర్, కండక్టర్ వెంటనే అప్రమత్తమై స్థానికుల సాయంతో మంటలను అదుపు చేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

హత్యకేసులో నిందితుడు అరెస్టు

చెన్నవరం(గంపలగూడెం): మండలంలోని చెన్నవరంలో జరిగిన హత్య కేసులో నిందితుడు మరీదు వెంకటేశ్వర్లును బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు. గ్రామానికి చెందిన మరీదు వెంకమ్మను కన్న కొడుకు డబ్బుకోసం కర్రతో కొట్టి హత్య చేసిన విషయం విదితమే. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మరీదు వెంకటేశ్వర్లును తిరువూరు సీఐ రుద్రరాజు భీమరాజు అరెస్టు చేశారని ఎస్‌ఐ వివరించారు. నిందితుడిని తిరువూరు కోర్టుకు హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అందచందనాల నమో నారసింహా..


కలశాభిషేకంలో పాల్గొన్న భక్తులు, స్వామి వారి ఉత్సవ విగ్రహాలు

పల్నాడు యాదాద్రిగా పేరొందిన భూ సమేత నరసింహ స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు నాలుగో రోజు బుధవారం వైభవంగా కొనసాగాయి. పల్నాడు జిల్లా గురజాల నగర పంచాయతీ జంగమహేశ్వరపురంలో రైల్వే గేటు సమీపంలో ఉన్న ఆలయాన్ని ఇటీవలే పునర్నిర్మించారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఉదయం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అష్టోత్తర కలశాభిషేకం అనంతరం చందనాలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను తిరుమల తిరుపతి వేద పండితులు యుగంధరాచార్యులు, సునీల్ నరసింహాచార్యులు, ఆలయ అర్చకులు కారంపూడి రాఘవాచార్యులు, వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. – గురజాల

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి



నందిగామ: ఆయన నిత్యం ఎంతోమంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తాడు. అయితే తాను మాత్రం ఈరోజు ప్రాణంతో ఇంటికి చేరలేకపోయాడు. వివరాలిలా.. ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి నందిగామలో జరిగింది. ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపిన సమాచారం ప్రకారం మండలంలోని అంబారుపేట గ్రామానికి చెందిన ఎరబడి రామకృష్ణ (50) ఆర్టీసీ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. బుధవారం ఆయనకు వీక్లీ ఆఫ్. నందిగామకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళుతున్న సందర్భంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై పట్టణంలోని చైతన్య కళాశాల సమీపంలో వాహనం అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రామకృష్ణను స్థానికులు వెంటనే నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామకృష్ణ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జేపీనగర్, ఎల్ఐసీ కాలనీ, మిథులా నగర్, క్రీస్తురాజపురం కొండ ప్రాంతం, అమ్మ కల్యాణ మండపం ఏరియా, సున్నపుబట్టీల సెంటర్, ఆర్సీఎం చర్చి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

16వ డివిజన్‌లో 97.40 శాతం పింఛన్ల పంపిణీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని 16వ డివిజన్‌లో పింఛన్ పంపిణీ పూర్తి అయ్యింది. మూడు రోజుల్లో 97.40 శాతం పంపిణీ చేశామని వార్డు పరిపాలన కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 16వ డివిజన్‌లో మొత్తం 1078కి గాను 1050 మందికి పింఛన్ ఇచ్చామన్నారు. మిగిలిన వారికి ఈ నెల 5వ తేదీలోగా పింఛన్ అందిస్తామన్నారు. డయాలసిస్ పేషెంట్ షేక్ జిలానికి రూ.10 వేలును వలంటీర్ కె.నాగలక్ష్మి బుధవారం ఇచ్చారని ఆయన తెలిపారు.

ఎస్ఆర్ఆర్‌లో ఇంటర్ సప్లిమెంటరీ తరగతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు మరింత మెరుగైన మార్కులు సాధించేందుకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళకుమారి తెలిపారు.

సహాయ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ ముందంజ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రాజకీయాలతో పాటుగా సహాయ కార్యక్రమాలు చేయడంలోనూ తమ పార్టీ ఎల్లప్పుడు ముందంజలో ఉంటుందని వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి, వైఎన్నార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. గాయత్రీనగర్ నివాసం ఉంటున్న మక్కానా కొండలరావు, దుర్గాభవానీలకు జీవనోపాధి నిమిత్తం ఇస్త్రీబండి కావాలని అభ్యర్థించారు. రూ.20 వేలు విలువ చేసే ఇస్త్రీబండిని యలమంచిలి జయప్రకాష్ తన సొంత నిధులతో కొనుగోలు చేసి వైఎన్నార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారికి బుధవారం అందచేశారు. పార్టీ నాయకులు పిన్నమనేని సాయి ప్రసాద్, తుమ్మల శివరామకృష్ణ, జైహింద్‌రావు, ఝాన్సీ, పాల్వాయి రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం లబ్ధిదారుల గృహాల నిర్మాణం ప్రారంభం

పెనమలూరు: చోడవరం గ్రామంలోని లబ్ధిదారులకు వణుకూరులో కేటాయించిన ఇళ్ల స్థలాల్లో బుధవారం గృహాల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం శంకుస్థాపన చేశారు. చోడవరంలో మొత్తం 199 మందికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో మొదటి దశలో భాగంగా 156 మందికి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం 79 మంది లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్ల నిర్మాణానికి సిద్ధపడ్డారని సర్పంచ్ తెలిపారు.

నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు

- వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- అభివృద్ధి పనుల పరిశీలన



వారధి వద్ద రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ పుండ్కర్



అంబేడ్కర్ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో అభివృద్ధి పనులను శరవేగంగా చేపట్టాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా వీరు బుధవారం గాంధీహిల్‌ను సందర్శించారు. గాంధీ హిల్‌ను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. నగర ప్రజలు సాయంత్రం వేళల్లో గాంధీ హిల్‌కు వచ్చే విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. అందులో భాగంగా ప్లానిటోరియంలో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో చిన్నారులకు ఆట పరికరాలు, గాంధీ హిల్ కాంపౌండ్ వాల్, కొండపైకి వెళ్లే దారిలో ఉన్న గోడకు మరమ్మతులు చేయాలని చెప్పారు. మెట్ల మార్గానికి ఇరువైపులా చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయడంతో పాటు కొండపైన పిచ్చిచెట్ల గుబురు తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు.

ఆగస్టుకు పనులు పూర్తి చేయాలి

విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కార్యాలయ భవనాన్ని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ పరిశీలించారు. భవన మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆగస్టుకు భవనంలోని రెండు ఫ్లోర్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

తలమానికంగా రిటైనింగ్ వాల్ బ్యూటిఫికేషన్

కృష్ణలంక వారధి పక్కన రాణిగారి తోటలో కృష్ణానది రిటైనింగ్ వాల్ వెంబడి వీఎంసీ నిర్మిస్తున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కు పనులను పరిశీలించారు. విజయవాడ నగరానికి తలమానికంగా అన్ని వర్గాల ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును అభివృద్ధి చేస్తున్నామని, పనులను ఇంజినీరింగ్ అధికారులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానికంగా ఇళ్ల వెంబడి త్వరితగతిన డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. రోడ్లు, బేస్‌మెంట్ పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని చెప్పారు.

అంబేడ్కర్ పార్కు పరిశీలన

కృష్ణలంక జాతీయ రహదారి వెంబడి అభివృద్ధి చేస్తున్న అంబేడ్కర్ పార్కులో జరుగుతున్న పునరుద్ధరీకరణ పనులను, గ్రీనరీని కమిషనర్ పరిశీలించారు. పార్కులో ఫ్లోరింగ్‌కు వేసిన గ్రానైట్ డిజైన్స్ వివరాలను తెలుసుకుని ఇబ్బందులు లేకుండా పని పూర్తిచేయాలని అవసరమైతే అదనంగా యంత్రాలు, వర్కర్లను ఏర్పాటు చేసుకుని పని పూర్తి చేయాలన్నారు. పార్కులో అన్ని వయస్సుల వారికి ఆహ్లాదాన్ని అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పార్కులో ఆకర్షణీయంగా ఉండేలా కళాకృతులు మరింత సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కమిషనర్‌తో పాటు చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, కార్పొరేటర్ అబ్దుల్ హకీమ్ హర్షద్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వరరెడ్డి, ఏఎస్ఎన్ ప్రసాద్, వి.చంద్రశేఖర్, డీఈఈ కరిముల్లా, ఏడీహెచ్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

పింఛన్లు పునరుద్ధరించాలని వినతి



కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తన డివిజన్ పరిధిలో వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన అర్హులైన వారి పింఛన్లను పునరుద్ధరించాలని 6వ డివిజన్ కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్ కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును కోరారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం అమర్‌నాథ్ కలెక్టర్‌ను కలిసి అర్హులైన పింఛనుదారుల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ 6వ డివిజన్‌కు చెందిన దివ్యాంగులు కొయ్యాని మంగడు, ముద్దాడా సాయికుమార్‌కు ఒక్కొక్కరికి రూ.3 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆ నగదును కలెక్టర్ ఢిల్లీరావు వారికి అందించారు.

ముగిసిన సహస్ర చండీయాగం



విశేష పూజలు నిర్వహిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నైనవరం ఫ్లై ఓవర్ సమీపంలోని కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో వారం రోజులుగా జరుగుతున్న సహస్ర చండీయాగం బుధవారంతో ముగిసింది. శక్తిపీఠం ఆవరణలోని యాగశాలలో బుధవారం నిర్వహించిన మహా పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజైన బుధవారం అమ్మవారిని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనుగ్రహ భాషణం చేశారు.

దుర్గగుడి స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో 80 మంది రుత్విక్కుల చేతుల మీదగా రెండు యాగశాలల్లో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండప ఉద్వాసనలు, మహా కుంభాభిషేకం నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం పలికారు. శక్తిపీఠం ఉత్తరాధికారి కరుమారి దాసు పర్యవేక్షణలో యాగ నిర్వాహకులు, ఉభయదాతలు, దాతలు, భక్తులకు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

అమ్మ వారి సేవలో కాణిపాకం దేవస్థానం చైర్మన్

కాణిపాకం దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి బుధవారం కరుమారి అమ్మన్‌ను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మోహన్‌రెడ్డిని ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మ వారిని దర్శించుకున్న అనంతరం మోహన్‌రెడ్డి కాణిపాకం దేవస్థానం స్వామి వారి శేషవస్త్రాలను అందజేశారు. కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో నిర్వహించిన సహస్ర చండీయాగం సందర్భంగా అన్నదానానికి 350 బస్తాల బియ్యం అందజేసిన కుంటముక్కల కుమార్‌తో పాటు పెదపులిపాకలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి దేవస్థాన పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామి, గజల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, హనుమత్ దీక్షాపీఠం కన్వీనర్ రాంపిళ్ల జయప్రకాష్ తదితరులకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని భక్తులకు భారీగా అన్న ప్రసాద వితరణ జరిగింది. ఉత్సవాలను లఖంరాజు సునీత, కోడూరి సుందరి, చలువాది ప్రకాష్, ఉత్సవ కమిటీ సభ్యులు జ్ఞానేశ్వర్, వై.వి.నాగేందర్, ఫణికుమార్, చంద్రకళ, బత్తుల వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

పేదలకు ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న కడియాల బుచ్చిబాబు

గుణదల(విజయవాడతూర్పు): రాజకీయాలకు అతీతంగా పేదలకు సేవ చేయటంలో ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు అన్నారు. గుణదలలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇద్దరు పేదలకు ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కృషి చేస్తున్నారన్నారు. పేదలకు సేవ చేసేందుకు తన తండ్రి దేవినేని నెహ్రూ పేరిట చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పేదలకు బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ వద్దకు వచ్చిన సమస్యలను పరిష్కస్తూనే పేదలకు ఆర్థిక సాయం అందచేస్తున్నారన్నారు. అనంతరం 17 డివిజన్‌కు చెందిన సూర్యకుమారి, 20వ డివిజన్‌కు చెందిన శాస్త్రిలకు జీవనోపాధి నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బచ్చు మురళీ, సొంగా రాజ్‌కమల్, కొరివి చైతన్య పాల్గొన్నారు.

విశ్వకర్మ లెజండరీ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్, వెంకట్ విశ్వకర్మ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అనాదిగా దేశ సంస్కృతికి మూలస్తంభాలుగా నిలిచింది విశ్వకర్మలేనని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న 'విశ్వకర్మ లెజండరీ అవార్డ్స్' 2023, విశ్వకర్మ నేషనల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన బుధవారం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి..

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక యుగంలో దేశవ్యాప్తంగా సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్న విశ్వకర్మలను గుర్తించి వారిని సన్మాన పూర్వకంగా గౌరవించుకోవడం హర్షణీయమన్నారు. ప్రతి ఏడాది వివిధ రాష్ట్రాల్లో జరిగే విశ్వకర్మ లెజండరీ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఈ ఏడాది విజయవాడలో నిర్వహిస్తున్నందున రాష్ట్రం నలుమూలల నుంచి విశ్వకర్మలు తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకట్ విశ్వకర్మ మాట్లాడుతూ విశ్వకర్మ సంస్కృతి, సంక్షేమం, అభివృద్ధి తదితర రంగాల్లో విశేషమైన కృషి చేసిన విశ్వకర్మలకు ఈ పురస్కారాలను అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం, రుంజ వాయిద్య శబ్ద విన్యాసం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వివరాలకు 99661 02201 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమానికి 10 రాష్ట్రాల నుంచి విశ్వకర్మ సమాజ ప్రతినిధులు, పురస్కార గ్రహీతలు హాజరవుతారని తెలిపారు.

వదలని వర్షం



వన్‌టౌన్‌లో అలుముకున్న కారుమబ్బులు

జిల్లా వ్యాప్తంగా అల్ప పీడన ద్రోణి కారణంగా నాలుగు రోజులుగా వర్షం కొనసాగుతోంది. నగరంలో బుధవారం సైతం దట్టమైన కారు మబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. ప్రజలు రక్షణ చర్యలు చేపట్టి రాకపోకలు సాగించారు. గ్రామాల్లో పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విజయవాడలో వర్షంలోనే రాకపోకలు



నున్న శివారు ప్రాంతంలో రహదారిపై ఆరబోసిన మొక్కజొన్న

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్నూలుకు చెందిన పింజారి చాంద్‌బాషా(57) వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. హైకోర్టు పని నిమిత్తం ఈయన మంగళవారం ఉదయం 5.30 గంటలకు నగరానికి వచ్చి బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్‌లో గది అద్దెకు తీసుకున్నాడు. అప్పటి నుంచి గది నుంచి బయటకు రాలేదు. హోటల్ సిబ్బంది తలుపు తట్టినా, ఫోన్ చేసినా అతని నుంచి సమాధానం లేదు. అనుమానం వచ్చి హోటల్ సిబ్బంది బుధవారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలగొట్టి లోపలకు వెళ్లి చూడగా కిందపడిపోయి అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతనిని పరీక్షించి చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

110 మందికి కంటి పరీక్షలు

కంకిపాడు: కంటి సంరక్షణపై శ్రద్ధ వహించాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులు 110 మందికి రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

అఖిలపక్ష నాయకుల అరెస్ట్



నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర రాస్తారోకో కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేశారు. విశాఖ ఉక్కును పరిరక్షించాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో బుధవారం వారధి సర్కిల్ వద్ద అఖిలపక్ష నేతలు రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టేందుకు నిర్ణయించారు. ఇందిరాగాంధీ స్టేడియం నుంచి వారధి వద్దకు బయలు దేరగా పశువుల హాస్పిటల్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. ప్రధాని మోడీ ఎన్ని ప్రయత్నాలు చేసిన ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. పోలీసులు అఖిల పక్షం నాయకులను అరెస్ట్ చేసి భవానీపురం స్టేషన్‌కు తరలించారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు లంబాడీపేటకు చెందిన ధారావత్ పూజ ఏడాదిన్నర క్రితం లక్ష్మణ్‌నాయక్‌ను వివాహం చేసుకుంది. భర్త క్యాటరింగ్ పనిచేస్తుంటాడు. కొంతకాలంగా భర్త దురలవాట్లకు బానిసగా మారి భార్యను అనుమానిస్తూ వేధించసాగాడు. భర్త వేధింపులు తాళలేక భార్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పటమట(విజయవాడతూర్పు): మీడియాలో దళితుల ప్రాతినిధ్యం అంతంత మాత్రంగానే ఉందని, దళిత జర్నలిస్టుల సమస్యలను పరిష్కారించాలని ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ నెట్‌వర్క్(ఐడీజేఎన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రత్నబాబు, దళిత జర్నలిస్టులు బొంతా విలియం పాల్, ఓ.సురేష్, శ్రీనివాస్ ప్రసన్న కోరారు. ఈ మేరకు ఎన్టీయార్ జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావును కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఇందులో రాష్ట్ర, జిల్లాస్థాయిలో ఏర్పడిన ప్రెస్ అక్రిటేషన్ల కమిటీల్లో దళితులకు ప్రత్యేకంగా ప్రాతినిధ్యం కల్పించాలని, మీడియా రంగంలో ఉన్న దళిత జర్నలిస్టులందరికీ ప్రెస్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరారు. జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీలతో పాటు ఇతర కమిటీల్లో దళిత జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలంటూ పలు అంశాలను ప్రస్తావించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

క్లుప్తంగా...

నేటినుంచి మొక్కజొన్న కొనుగోలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా మేలురకం (ఫైన్ క్వాలిటీ) మొక్కజొన్నను గురువారం నుంచి కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస మద్దతు ధర రూ.1,962కు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. 2022–23 సీజన్‌లో 16.63 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఇప్పటికే 60 శాతం మార్కెట్‌కు వచ్చిందని తెలిపారు. క్వాలిటీని బట్టి క్వింటా రూ.1,500 నుంచి రూ.2,500 వరకు ధర పలికిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్బీకేల ద్వారా మేలురకం మొక్కజొన్న కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఫైన్ క్వాలిటీ మొక్కజొన్నకు కనీస మద్దతు ధర దక్కని పక్షంలో ఆర్బీకేలో విక్రయించుకోవచ్చునని ఆయన రైతులకు సూచించారు.

టీటీడీ రెలీజియస్ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంపు

65 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో అర్చకులు, పరిచారకులతో పాటు మతపరమైన విధులలో పాల్గొనే రెలీజియస్ కేటగిరి ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. 1987 డిసెంబరు 16న జారీ చేసిన 1171 జీవో ప్రకారం రెలీజియస్ కేటగిరి కింద గుర్తించిన ఉద్యోగులకు ఈ నోటిఫికేషన్ వర్తిస్తుందని దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు. టీటీడీ వేద పాఠశాలలో పనిచేసే వేద పండితులు కూడా ఈ పరిధిలోకి వస్తారని స్పష్టం చేశారు. ప్రాథమిక నోటిఫికేషన్‌పై 30 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆ తర్వాత తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు.వంశపారంపర్య అర్చకత్వం పరిధిలోకి రాని.. నిర్ణీత వేతనంతో పనిచేసే అర్చకులు సహా పరిచారకులు, మత సంబంధిత ఉద్యోగులకు కూడా మేలు చేస్తూ ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ జారీ చేసిందని దేవదాయ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

కుప్పంలో మీనాన్న ఏం అభివృద్ధి చేశాడు?

లోకేశ్‌కు మంత్రి బుగ్గన ప్రశ్న

ప్యాపిలి: కుప్పం నియోజకవర్గం నుంచి ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మీనాన్న చంద్రబాబునాయుడు ఆ నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ను ప్రశ్నించారు. ఆయన బుధవారం నంద్యాల జిల్లా ప్యాపిలిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. డోన్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన తాను నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. ఎనిమిదిసార్లు కుప్పం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రబాబునాయుడు కనీసం ఒక్క గ్రామానికైనా ఇంటింటికి తాగునీరు అందించగలిగారా? అని ప్రశ్నించారు.

చంద్రబాబుకు మతిభ్రమించింది

- ఎమ్మెల్సీ తలశిల రఘురాం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం ధ్వజమెత్తారు. బుధవారం ఆయన తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. శంషాబాద్ విమానాశ్రయానికి శంకుస్థాపన, ప్రారంభోత్సవం రెండూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేశారని, ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఆయన కుమారుడు సీఎం జగన్ శంకుస్థాపన చేయడం సంతోషమని విమానాశ్రయాన్ని నిర్మిస్తున్న జీఎంఆర్ చైర్మన్ మల్లికార్జునరావు చెప్పారని, దీంతో హైదరాబాద్ అభివృద్ధి పేటెంట్ హక్కు తనదేనని చంద్రబాబు చెప్పేదంతా బూటకమని తేటతెల్లమయిందని అన్నారు. చంద్రబాబు జీవితమంతా అబద్ధాలు, హడావుడితోనే సాగిందని విమర్శించారు.

ఈ సారైనా టీడీపీని గెలిపించండి..

- ఆ పార్టీ జాతీయ కార్యదర్శి లోకేశ్

కర్నూలు(అర్బన్)/కోడుమూరు : తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అమలు చేస్తామని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా బుధవారం కోడుమూరు నియోజకవర్గం వెంకటగిరి గ్రామంలో ఎస్సీ సామాజికవర్గం ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ 40 ఏళ్లుగా గెలవలేదని, ఈసారైనా గెలిపించండని లోకేశ్ కోరారు.

పాదయాత్రకు దళితుల నిరసన సెగ

కోడుమూరులో కొనసాగుతున్న లోకేశ్ పాదయాత్రకు దళిత సంఘాల నేతలు నిరసన తెలిపారు. దళితులను అవమానించేలా మాట్లాడిన లోకేశ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలంటూ దళితులతో పాటు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్ల కండువాలతో నిరసనకు దిగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు.

సుజనాపై లుక్‌అవుట్ నోటీసులు ఎత్తివేత కుదరదు

తేల్చిచెప్పిన తెలంగాణ హైకోర్టు

- రూ. 6 వేల కోట్ల స్కాంకు పాల్పడ్డారని సీబీఐ వాదనలు
- మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: బ్యాంకుల నుంచి రూ. 6 వేల కోట్లు రుణాలు తీసుకొని, అక్రమంగా దారి మళ్లించిన వ్యవహారంలో కంపెనీల మీద సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసినందున వ్యక్తిగతంగా తనపై లుక్‌అవుట్ (ఎల్‌వోసీ) నోటీసులు ఎత్తివేయాలని మాజీ ఎంపీ సుజనా చౌదరి కోరడాన్ని తెలంగాణ హైకోర్టు తప్పుబట్టింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తున్నాం కదా అని ఎల్‌వోసీ నోటీసులు కొట్టివేయాలని కోరడం సరికాదని తేల్చి చెప్పింది. తనపై లుక్ అవుట్ నోటీసులను సస్పెండ్ చేయాలని, ఏప్రిల్ 29 నుంచి విదేశీ పర్యటనకు అనుమతించాలని కోరుతూ సుజనా చౌదరి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ జరిపారు. సీబీఐ తరఫున స్పెషల్ పీపీ నాగేంద్రన్, కేంద్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, పిటిషనర్ తరఫున టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

డైరెక్టర్‌గా ఉన్నప్పుడే రుణాలు పొందారు

రూ.6 వేల కోట్ల కుంభకోణంలో సుజనా ప్రధాన సూత్రధారి అని సీబీఐ వాదించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయని తెలిపింది. పెద్ద ఎత్తున డొల్ల కంపెనీలను తెరిచి, వాటి పేరుతో రుణాలు పొందిన తర్వాత వాటిని మూసివేశారని పేర్కొంది. ప్రస్తుతం సుజనా ఆ కంపెనీలతో సంబంధం లేదని చెబుతున్నప్పటికీ, రుణాలు పొందే నాటికి ఆయన డైరెక్టర్‌గా ఉన్నారని పేర్కొంది. ఇప్పుడు వాటితో సంబంధం లేదని చెప్పడం తప్పించుకోవడమే అవుతుందని వెల్లడించింది. సీబీఐ వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించారు. కంపెనీల మీద కేసులు నమోదు చేసినందున లుక్‌అవుట్ నోటీసులు ఎత్తివేయాలని కోరడం సరికాదన్నారు. విదేశీ పర్యటనపై కూడా సీబీఐ కోర్టునే ఆశ్రయించాలని ఆదేశించారు.

బ్యాంకు రుణాలు దారి మళ్లింపు

బెస్ట్ క్రాంప్టన్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ (బీసీఈపీఎల్) లిమిటెడ్ రూ. 6 వేల కోట్ల వరకు మోసం చేసిన కేసులో సుజనా చౌదరి పాత్ర ఉందంటూ 2017లో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. చట్టవ్యతిరేకంగా బ్యాంకుల నుంచి బీసీఈపీఎల్ రుణాలు పొందినట్లు పేర్కొంది. ఈ మొత్తాన్ని అక్రమంగా ఇతర ప్రయోజనాల కోసం దారి మళ్లించారని, ఈ స్కాంలో సుజనాకు భాగం ఉందని పేర్కొంది. ఈ క్రమంలో సుజనాపై సీబీఐ లుక్ అవుట్ నోటీసు జారీ చేసింది. దీంతో ఆయన విదేశాలకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది.



నూతన వధూవరులకు సీఎం ఆశీస్సులు

విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు శరత్ చౌదరి, జ్ఞానిత దంపతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు అందజేశారు. బుధవారం విశాఖ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో సీఎం జగన్ రుషికొండలోని ఎంపీ నివాసానికి విచ్చేశారు. ఇటీవలే వివాహం చేసుకున్న శరత్, జ్ఞానిత దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. - కొమ్మాది (భీమిలి)

విచారిస్తేనే వెలుగులోకి!

▶ మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఈ విషయం అసలు ప్రధాన కేసుకు ఎంత మాత్రం సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈమేరకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎం.ఎం.సుందరేష్‌ల ధర్మాసనం బుధవారం 13 పేజీల తీర్పును వెలువరించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వి, నిరంజన్‌రెడ్డి వాదించగా, ప్రతివాదులు వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ దవే వాదనలు వినిపించారు.

కేంద్రం, ఈడీని ప్రతివాదిగా చేర్చాలి..

గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించేందుకు, తిరగరాసేందుకే మంత్రివర్గ ఉప సంఘం, సిట్ ఏర్పాటైనట్లు హైకోర్టు తప్పుగా భావించిందన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను సుప్రీంకోర్టు సమర్థించింది. ఆ రెండు జీవోలను పరిగణలోకి తీసుకుంటే గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించేందుకు, తిరగరాసేందుకు అవి జారీ అయ్యాయని ఎంత మాత్రం చెప్పజాలమంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఉల్లంఘనలు, అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకే మంత్రివర్గ ఉప సంఘం, సిట్ ఏర్పాటయ్యాయని సుప్రీంకోర్టు తెలిపింది. అలాగే జీవోలను సవాల్ చేస్తూ టీడీపీ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కేంద్ర ప్రభుత్వం, ఈడీలను ప్రతివాదులుగా చేర్చాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. హైకోర్టు ఆ పని చేసి ఉండకూడదని వ్యాఖ్యానించింది. ప్రధాన వ్యాజ్యాలను ఇంకా పరిష్కరించకుండా, సీబీఐ దర్యాప్తు కోరుతూ రాష్ట్రం రాసిన లేఖపై కేంద్రం నిర్ణయం తీసుకోక ముందే హైకోర్టు ప్రభుత్వ అనుబంధ పిటిషన్‌ను కొట్టేయడం సరికాదంది. అసలు ప్రభుత్వ జీవోలను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేసిన టీడీపీ నేతలే కేంద్రం, ఈడీలను ప్రతివాదులుగా చేర్చి ఉండాల్సిందని స్పష్టం చేసింది. టీడీపీ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కేంద్ర ప్రభుత్వం, ఈడీలు తప్పనిసరిగా అవసరమైన పార్టీలని తేల్చి చెప్పింది. వారిని హైకోర్టు ముందున్న వ్యాజ్యాల్లో ప్రతివాదులుగా చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాక కేంద్రం, ఈడీ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలంది. చట్ట ప్రకారం కేసు పూర్వాపరాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని టీడీపీ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాలను మూడు నెలల్లో పరిష్కరించాలని హైకోర్టుకు సూచించింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లను అనుమతించింది.

నిగ్గు తేల్చిన ఉపసంఘం, సిట్...

టీడీపీ హయాంలో జరిగిన అమరావతి భూ కుంభకోణం, ఏపీ ఫైబర్ నెట్ స్కామ్‌లతో పాటు నాటి విధానపరమైన నిర్ణయాలు, చేపట్టిన ప్రాజెక్టులపై వచ్చిన అవినీతి ఆరోపణలు, ఉల్లంఘనలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తూ 2019లో జీవో 1411 జారీ చేసింది. గత ప్రభుత్వ విధాన నిర్ణయాలతో పాటు పలు అంశాలపై సమీక్ష జరిపిన మంత్రి వర్గ ఉప సంఘం పలు ప్రాథమిక ఆధారాలతో ప్రభుత్వానికి ఓ నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలు, ఉల్లంఘనలపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2020లో జీవో 344 జారీ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సిట్ ఈ కుంభకోణాలు చాలా విస్తృతమైనవని, ఇందులో చాలా కీలక అంశాలు ముడిపడి ఉన్నందున దీనిని సీబీఐ దర్యాప్తునకు ఇవ్వడం సమంజసంగా ఉంటుందని ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఓ లేఖ రాసి, ఈ కుంభకోణాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరింది.

పార్టీ ప్రయోజనం కోసమే వేశామన్నా పట్టించుకోని హైకోర్టు...

రాష్ట్ర ప్రభుత్వ లేఖపై కేంద్రం నిర్ణయం తీసుకోక ముందే టీడీపీ నేతలు వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రప్రసాద్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం, సిట్ ఏర్పాటు జీవోలను సవాలు చేశారు. ఈ వ్యాజ్యాల్లో వారు ఉద్దేశపూర్వకంగానే సీబీఐ, ఈడీలను ప్రతివాదులుగా చేర్చలేదు. తమ పార్టీ ప్రయోజనాల కోసమే పిటిషన్లు దాఖలు చేశామని వర్ల రామయ్య లిఖితపూర్వకంగా కోర్టుకు చెప్పారు. టీడీపీ నేతలు వేసిన ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు విచారణ

> **కేసు విచారణ సందర్భంగా 'సుప్రీం' వ్యాఖ్యలివీ**
>
> ▲ పారదర్శకంగా ఉన్నప్పుడు సిట్ దర్యాప్తునకు ఎందుకు భయపడుతున్నారు?
>
> ▲ గత ప్రభుత్వ అవినీతిని సమీక్షించకూడదంటే వందశాతం ఇమ్యునిటీ ఇచ్చినట్లే కదా?
>
> ▲ పాలనలో దురుద్దేశం ఉన్నప్పుడు విచారణ జరగాలి కదా?
>
> ▲ సీబీఐ విచారణకు స్వీకరించలేదంటే తప్పు జరగలేదని ముందే ఎలా ఊహించుకుంటారు?
>
> ▲ ప్రతి ఒక్కరూ చీకట్లోనే వెతుకుతారు? విచారణ జరిగితే అన్నీ వెలుగులోకి వస్తాయి

జరిపారు. అసలు మంత్రివర్గ ఉప సంఘం, సిట్ ఏర్పాటు వల్ల పిటిషనర్లు వ్యక్తిగతంగా ఏ విధంగానూ ప్రభావితం కావడం లేదని, వారు దాఖలు చేసిన వ్యాజ్యాలకు విచారణార్హత లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. అంతేకాకుండా సీబీఐ, ఈడీలను ఈ వ్యాజ్యాల్లో ప్రతివాదులుగా చేర్చాలంటూ అనుబంధ వ్యాజ్యాలను దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతల వ్యాజ్యాలపై సుదీర్ఘ విచారణ జరిపిన న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలన్నింటినీ తోసిపుచ్చారు. టీడీపీ నేతలు కోరిన విధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. జీవోల్లో తదుపరి చర్యలన్నీ నిలిపేశారు. గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించే అధికారం కొత్త ప్రభుత్వానికి లేదని తేల్చి చెప్పేశారు.

హైకోర్టు పరిగణలోకి తీసుకుని ఉండాల్సింది..

2020లో హైకోర్టు ఇచ్చిన ఈ మధ్యంతర ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వ పిటిషన్‌పై విచారణ చేపట్టి తీర్పును రిజర్వ్ చేసిన జస్టిస్ షా ధర్మాసనం బుధవారం తమ ఉత్తర్వులను వెలువరించింది. మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిన ప్రధాన ఉద్దేశాలను హైకోర్టు పరిగణలోకి తీసుకుని ఉండాల్సిందని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన పలు న్యాయపరమైన అంశాలను హైకోర్టు పరిగణలోకి తీసుకోలేదని ధర్మాసనం ఆక్షేపించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు రాసిన లేఖను హైకోర్టు ఏ మాత్రం పరిగణలోకి తీసుకోలేదని సుప్రీంకోర్టు ధర్మాసనం తప్పుపట్టింది.

చంద్రబాబుకు జైలు శిక్ష తప్పదు

అమరావతిలో అక్రమాలు బయటపడతాయి: హోం మంత్రి వనిత

- చంద్రబాబు బండారం బట్టబయలే: మంత్రి కారుమూరి
- నిజాలు నిగ్గు తేలుస్తాం: మంత్రి జోగి రమేష్
- దోషులు తప్పించుకోలేరు: మంత్రి ఆదిమూలపు
- బాబుకు ఎదురుదెబ్బ: మంత్రి అమర్‌నాథ్

సాక్షి, రాజమహేంద్రవరం/భీమవరం/బంటుమిల్లి/అమరావతి/విశాఖపట్నం: అమరావతిలో భూ కుంభకోణాలు.. భారీ ప్రాజెక్టుల్లో అవకతవకలు.. రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు వంటి అంశాలకు సంబంధించి సిట్ దర్యాప్తుపై హైకోర్టు ఇచ్చిన స్టేను సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని రాష్ట్ర మంత్రులు స్వాగతించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అనేక భూ కుంభకోణాలు జరిగాయని, వాటిపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించిందన్నారు. చంద్రబాబు హయాంలోని భూ అక్రమాలపై దర్యాప్తు కొనసాగుతుందని, అమరావతి భూ కుంభకోణంలో దోషులు తప్పించుకోలేరని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు రమేష్ బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే..

దోషుల్ని చట్టం ముందు నిలబెడతాం: హోం మంత్రి తానేటి వనిత



అత్యున్నత న్యాయస్థానం తీర్పు దరిమిలా అమరావతి కుంభకోణాలపై సిట్ దర్యాప్తు కొనసాగుతుంది. అక్రమాలన్నీ బహిర్గతమవుతాయి. సిట్ దర్యాప్తు కొనసాగితే రాజధానిలో దళితుల భూములను బలవంతంగా ఆక్రమించుకోవడం, ఔటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సంబంధించిన అక్రమాలన్నీ బట్టబయలవుతాయి. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో అవినీతికి పాల్పడ్డారు. అందుకే కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారన్నారు. దళితులు, అసైన్డ్ భూములను అక్రమంగా లాగేసుకున్నారు కనుకే దర్యాప్తు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సిట్ దర్యాప్తును పారదర్శకంగా పూర్తిచేసి త్వరలోనే దోషులను చట్టం ముందు నిలబెడతాం.

బాబు బండారం బయటపడుతుంది: మంత్రి కారుమూరి



అమరావతిలో చంద్రబాబు నాయుడు చేసిన అక్రమాల బండారం బట్టబయలు కానుంది. ఆయన హయాంలో అమరావతిలో అక్రమాలు, అన్యాయాలు జరిగాయనే ఆరోపణలు రావడంతో ప్రభుత్వం సిట్‌ను నియమించగా.. తన గుట్టు బయటపడుతుందనే భయంతో చంద్రబాబే కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నారు. దానిని కొట్టేసిన సుప్రీంకోర్టు విచారణ కొనసాగించవచ్చని తేల్చిచెప్పడంతో చంద్రబాబు అక్రమాలు తప్పక బయటపడతాయి. లిక్కర్ స్కాం, ఏలేరు స్కాం, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి ఎన్నో స్కాంలకు పాల్పడి దోపిడీదారుడిగా చంద్రబాబు గుర్తింపు తెచ్చుకున్నారు. తన అక్రమాలపై విచారణ జరగకుండా స్టేలు తెచ్చుకుని అవినీతి బతుకు బతుకుతున్నారు.

చంద్రబాబుకు చెంపపెట్టు: మంత్రి జోగి రమేష్



దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బుధవారం సిట్ విచారణపై ఇచ్చిన స్టే ఎత్తివేయడం చంద్రబాబుకు చెంపపెట్టులాంటిది. టీడీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన అవినీతిపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. సిట్ విచారణలో అవినీతి ఎక్కడ బయటపడుతుందోననే భయంతో న్యాయస్థానాలను ఆశ్రయించిన చంద్రబాబు మూడేళ్లుగా విచారణ చేయకుండా స్టే తెచ్చుకుని అడ్డుకున్నారు. అమరావతి భూములు, పక్కా గృహాల నిర్మాణాలు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర సంస్థలో పెద్దఎత్తున టీడీపీ అనేక అవినీతి కుంభకోణాలకు పాల్పడింది. ఈ కుంభకోణాలపై విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేలుస్తాం. త్వరలో చంద్రబాబు జైలు తప్పదు.

దోషులు తప్పించుకోలేరు: మంత్రి ఆదిమూలపు



టీడీపీ హయాంలో అన్నీ స్కాములే జరిగాయి. తప్పు చేసినవారు తప్పించుకోలేరు. బాబు హయాంలో భూ కుంభకోణాలపై విచారణకు ప్రత్యేక విచారణ బృందాన్ని నియమిస్తే స్టే తెచ్చుకున్నారు. స్టేను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. భూ అక్రమాలపై దర్యాప్తు జరుగుతుంది. అమరావతి భూ కుంభకోణంలో దోషులెవరూ తప్పించుకోలేరు. చట్టాలను వక్రీకరించి రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని కాజేసిన దోషులకు శిక్ష తప్పదు. వారి హయాంలో చేపట్టిన పలు ప్రాజెక్టుల్లో కూడా భారీ అవినీతి చోటుచేసుకుంది. దర్యాప్తులో అవకతవకలన్నీ వెలుగులోకి వస్తాయి.

బెంబేలెత్తిపోతున్న చంద్రబాబు: మంత్రి అమర్‌నాథ్



చంద్రబాబు హయాంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలను బహిర్గతం చేసేందుకు ఏర్పాటు చేసిన సిట్ కార్యకలాపాలను అడ్డుకునేందుకు హైకోర్టులో స్టే తెచ్చుకున్న చంద్రబాబుకు ఎదురుదెబ్బ తగిలిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల టీడీపీ హయాంలో జరిగిన అవినీతి బాగోతాలు ఎక్కడ బయటపడుతాయోననే భయంతో చంద్రబాబు మీడియా ముందుకు వచ్చి ప్రజలను పక్కదారి పట్టించేలా అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. అమరావతి పేరిట చేసిన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌ను కేబినెట్ సబ్ కమిటీ గుర్తించిందన్నారు. సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వుల నేపథ్యంలో.. అవసరమైతే ఈ కేసు విచారణలో సీబీఐ, ఈడీ కూడా జోక్యం చేసుకునే అవకాశాలు లేకపోలేదన్నారు. భోగా పురం ఎయిర్‌పోర్టుకు తానే శంకుస్థాపన చేశానని, భావనపాడు పోర్టును తానే నిర్మించతలపెట్టానని, హైదరాబాద్‌లో రింగ్ రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు తానే నిర్మించానని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బుధవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో జీఎంఆర్ సంస్థ అధినేత గ్రంధి మల్లికార్జునరావు హైదరాబాద్‌లో గల శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, ప్రారంభోత్సవాలు వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగాయని బహిరంగంగా స్పష్టం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర ప్రాంత ముఖచిత్రాన్ని మార్చటానికి శ్రీకాకుళం జిల్లాలో మూలాపేట పోర్టు, విజయనగరం జిల్లాలో భోగాపురం ఎయిర్‌పోర్టు, విశాఖ జిల్లాలో ఆదాని డేటా సెంటర్, స్కిల్ యూనివర్సిటీ, అనకాపల్లి జిల్లాలో ఆటోనగర్ ఏర్పాటు చేయడానికి శంకుస్థాపనలు చేశారన్నారు.

టీడీపీ హయాంలో అవార్డులు ఎందుకు ఇవ్వలేదు?

- అశ్వినీదత్ అప్పుడెందుకు బాబును ప్రశ్నించలేదు?
- ఇక్కడ పన్ను కడుతున్న వాళ్లు తెలంగాణ ప్రభుత్వాన్ని అడగగలరా?
- దర్శక, నిర్మాత నట్టి కుమార్

సాక్షి, హైదరాబాద్ : 'రౌడీలకు, గూండాలకు అవార్డులు ఇచ్చుకోండని ఇటీవల ఓ కార్యక్రమంలో అశ్వినీదత్ మాట్లాడటం తగదు. నేను సినిమా ఇండస్ట్రీ వాడిని. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడ్ని. అశ్వినీదత్ పొలిటికల్ మనిషిగా టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడారు. అందుకే ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నా. తెలుగుదేశం పార్టీ హయాంలో నంది అవార్డులు ఎందుకు ఇవ్వలేదని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అశ్వినీదత్ ఎందుకు అడగలేదు?' అని నిర్మాత నట్టి కుమార్ ప్రశ్నించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు సినిమా ఇండస్ట్రీని అగ్ర హీరోలు, నిర్మాతలే రోడ్డున పడేశారన్నారు. 'ఇండస్ట్రీ పెద్దలు అని చెప్పుకునే వాళ్లు టీడీపీ హయాంలో అమరావతిలో భూములు తీసుకున్నది వాస్తవం కాదా? తెలుగుదేశం ప్రభుత్వం రెండేళ్లకు కలిపి ఇచ్చిన నంది అవార్డులపై విమర్శలు వచ్చింది నిజం కాదా?'



అని నిలదీశారు. చంద్రబాబు చేసిన తప్పును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయరని స్పష్టం చేశారు. నట్టి కుమార్ ఇంకా ఏమన్నారంటే..

ఏపీలో షూటింగ్ మాటేంటి?

▲ తెలంగాణలో ఉంటూ ఆ ప్రభుత్వానికి పన్నులు కడుతున్న ఇండస్ట్రీ పెద్దలు తెలంగాణ ప్రభుత్వాన్ని అవార్డుల గురించి అడిగే దమ్ముందా? సినిమా రంగం విషయంలో పార్టీలకతీతంగా వ్యవహరించాలి.

▲ ఆ మధ్య చిరంజీవి, రాజమౌళి, ఇంకొందరు సినీ పెద్దలు ఏపీ ప్రభుత్వం పిలుపు మేరకు సీఎం జగన్‌ను కలసి వచ్చారు. 30% షూటింగ్ ఏపీలో చేస్తామని హామీ కూడా ఇచ్చారు. అక్కడ కనీసం 30% షూటింగ్ కూడా చేయడం లేదు.

▲ ఏపీలో ల్యాండ్స్ తీసుకున్న సినీ పెద్దలు స్టూడియోలు, రికార్డింగ్ థియేటర్స్ ఎందుకు నిర్మించట్లేదు? సినిమాల రిలీజులప్పుడు మాత్రం టికెట్ల ధరలు పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు. ఎంతసేపూ చిన్న నిర్మాతలను తొక్కేయాలని చూసే కొద్ది మంది స్వార్థపరుల వల్ల సినీ పరిశ్రమ మనుగడ ప్రమాదకరంగా మారింది.

ఏపీలో చిన్న చిత్రాలకు ఊరట


▲ తెలంగాణాలో చిన్న సినిమా బతికే పరిస్థితి కనిపించడం లేదు. రూ.7 లక్షలు, రూ.5 లక్షలు థియేటర్స్ రెంటల్స్‌తో చిన్న సినిమాలను ఇక్కడ విడుదల చేయడం ఎంతో కష్టమైంది. అదే ఆంధ్రప్రదేశ్‌లో రూ.లక్ష, రెండు లక్షల రెంటల్స్‌తో చిన్న సినిమాల విడుదలకు అవకాశం ఉంది.

▲ ప్రతి రోజు ఒక షో చిన్న సినిమాలకు అవకాశం ఇవ్వాలనే నిబంధన ఎందుకు అమలు కావడం లేదు? రెండు రేట్లతో మల్టీప్లెక్స్ పేదవాడికి అందుబాటులో ఉండేలా చూడాలి. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో బాగా న్యాయం జరిగింది. దాసరి నారాయణరావు చనిపోయాక ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆయన కోసం ప్రభుత్వాలు ఏదైనా చేయాలి. కాపు నాయకులు ముందుకొచ్చి అడగాలి. పెద్దల్ని కలవలేకపోతున్నాం. అందుకే మీడియా ముందుకు వచ్చాను.

ఏ పార్టీతోనైనా కలిసి పోటీచేస్తాం

- నా పాలనలో సన్‌రైజ్ రాష్ట్రం.. ఇప్పుడు దివాలా తీసింది
- దేశంలో మొదటి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ హైదరాబాద్‌లో నిర్మించింది టీడీపీనే
- మీడియా సమావేశంలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనైనా కలిసి పోటీచేస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. పవన్‌కళ్యాణ్‌ను కలిస్తే ఉలిక్కి పడుతున్నారని, ఓటమి భయంతో వణికిపోతున్నారని విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రివర్స్ పాలన సాగుతోందని, జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు భ్రష్టుపట్టి పతనావస్థకు చేరుకున్నాయని విమర్శించారు. తన హయాంలో సన్‌రైజ్ స్టేట్‌గా వెలుగొందిన రాష్ట్రం ఇప్పుడు దివాలా తీసిందన్నారు. జగన్ పాలనలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ 14వ స్థానంలో ఉందని కేంద్రసంస్థ తేల్చిందని చెప్పారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు సిగ్గుపడకపోవచ్చని, కానీ రాష్ట్ర యువత నష్టపోతోందని పేర్కొన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలంటేనే పారిశ్రామికవేత్తలు భయపడిపోతున్నారన్నారు. ప్రతిపక్షనేతగా గతంలో జగన్ భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కి రైతులు భూములివ్వొద్దని, ఇచ్చిన



భూములను తాము అధికారంలోకి వస్తే వెనక్కి ఇస్తామని చెప్పి కోర్టుల్లో కేసులు వేశారని చెప్పారు. అయినా తాము భూసేకరణ పూర్తిచేసి 2019లో శంకుస్థాపన చేశామని, కానీ ఇప్పుడు జగన్ మళ్లీ శంకుస్థాపన పేరుతో డ్రామాలాడుతున్నారని పేర్కొన్నారు. దేశంలో మొదటి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ హైదరాబాద్‌లో ఐదువేల ఎకరాల్లో నిర్మించిన ఘనత టీడీపీదేనని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కి నాడు తాము 2,700 ఎకరాలు కేటాయిస్తే ఇప్పుడు 2,220 ఎకరాల్లో కడుతున్నారని చెప్పారు. మిగిలిన భూముల్ని ఎవరు కొట్టేశారో చెప్పాలన్నారు. దుష్ట చతుష్టయం, దత్తపుత్రుడు అంటున్నారు.. అంటే రాష్ట్రంలో ఎవరూ కలిసి రాజకీయాలు చేయకూడదా అని ప్రశ్నించారు. రజనీకాంత్ హైదరాబాద్ గురించి మాట్లాడితే ఆయన్ని కూడా తిడుతున్నారన్నారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతుల్ని కనీసం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు.

అమరావతి పేరుతో భారీ అవినీతి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి పేరుతో భారీ అవినీతి జరిగిందని, చంద్రబాబు స్కామ్‌లపై అన్ని ఆధారాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. తాజాగా సుప్రీం కోర్టు తీర్పుతో చంద్రబాబు ధరించిన స్టే అనే ముసుగు తొలిగిపోయిందన్నారు. సిట్ దర్యాప్తులో మరిన్ని వాస్తవాలు బయటకు వస్తాయని, కచ్చితంగా అరెస్టులు కూడా జరుగుతాయన్నారు. బుధవారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల విలేకరులతో మాట్లాడారు.

దేశంలోనే కేస్ స్టడీ లాంటిది..

చంద్రబాబు అవినీతికి సంబంధించిన కేసుల్లో దేశ ఉన్నత న్యాయస్థానం ఏ దృక్కోణం నుంచి చూడాలో అలాగే చూసింది. అమరావతిలో జరిగిన అవినీతి దేశంలోనే ఒక కేస్ స్టడీ లాంటిది. తప్పు చేయకుంటే చంద్రబాబు బృందానికి ఎందుకంత భయం? అవినీతికి పాల్పడకుంటే స్టే కోసం న్యాయస్థానాలకు ఎందుకు వెళ్లారు? స్కిల్ డెవలప్‌మెంట్



స్కామ్‌లోనూ చంద్రబాబు హస్తం ఉంది. టీడీపీ హయాంలో జరిగిన స్కామ్‌లపై సబ్ కమిటీ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించాం. దీనిపై ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం అవసరమన్న స్పీకర్ సూచనల మేరకు విస్తృతంగా విచారించేందుకు సిట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇంత విశాల దృక్పథంతో తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ నేతలు చాలెంజ్ చేయడం దుస్సాహసమే. దొరికిపోయి ప్రజల ముందు దోషులుగా నిలబడతామన్న భయం వారిలో స్పష్టంగా కనిపిస్తోంది.

అరెస్టులు తథ్యం..

అమరావతి రింగ్‌రోడ్డు, అసైన్డ్ ల్యాండ్స్, ఫైబర్ నెట్ కుంభకోణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. చంద్రబాబు ఎప్పుడు అరెస్ట్ అవుతారో తేలాల్సి ఉంది. ఆయన సంతకంతోనే బోగస్ కంపెనీకి రూ.వందల కోట్లు పంపినట్లు నిరూపణ అయింది. దొరకకపోవడం ఏమీ లేదు. అన్నిటిలోనూ దొరుకుతూనే ఉన్నారు. అమరావతిలో జరిగిన స్కామ్ గురించి చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు. విచారణ చివరి దశకు వచ్చాక అరెస్టులు జరుగుతాయి.

కొబ్బరికాయ కొడితే పనులెక్కడ?

భోగాపురం ఎయిర్‌పోర్టుకు సంబంధించి చంద్రబాబు అసలు ఏం చేశారు? టెండర్లు ఎందుకు కొనసాగించలేదు? భూసేకరణ ఎందుకు పూర్తి చేయలేదు? చంద్రబాబు కొబ్బరికాయ కొడితే పనులెందుకు ప్రారంభం కాలేదు? గత ప్రభుత్వాలు చేసినవి కూడా తానే చేశానని చెప్పుకోవడం చంద్రబాబుకు అలవాటు. హైదరాబాద్‌లో రామోజీ ఫిలింసిటీ వైపు ధరలు పెరిగేందుకు రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టు విషయంలో చంద్రబాబు కాలయాపన చేశారు. దివంగత వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక దాన్ని పూర్తి చేశారు. పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేను కూడా వైఎస్సారే పూర్తి చేశారు. ఎన్నికలు వస్తున్నాయంటే నాలుగు కొబ్బరి కాయలు కొట్టడం మినహా చంద్రబాబు ఏమీ చేయరు. బాలినేని అంశం మా పార్టీ అంతర్గత వ్యవహారం. అది టీ కప్పులో తుపాన్ కూడా కాదు.

కథ రాసి కన్ఫ్యూజ్ చేయడమే ఎల్లో మీడియా పని

చంద్రబాబు – రజనీకాంత్ మాట్లాడుకుంటే ఎవరికి తెలుస్తుంది? చంద్రబాబు వల్ల తాను మాటలు పడాల్సి వస్తోందని రజనీ తిట్టారేమో? అసలు చంద్రబాబు ఫోన్ చేశాడో లేదో కూడా తెలియదు. ఒక కథ రాయడం.. జనం మీదకు వదిలి కన్ఫ్యూజ్ చేయడమే ఎల్లో మీడియా పని.

క్లుప్తంగా...

అమరావతిలో నిరుపేదలకు పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి/తాడికొండ: సీఆర్డీఏ పరిధిలో భూమి లేని నిరుపేదలకు సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ మొదలైంది. గతేడాది నవంబర్ నుంచి లబ్ధిదారులకు గ్రామ వలంటీర్ల ద్వారా సామాజిక పింఛన్లు పంపిణీకి సీఆర్డీఏ శ్రీకారం చుట్టింది. డేటా ఇంటిగ్రేషన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యతో మార్చి లో స్వల్ప అంతరాయం ఏర్పడింది. దాంతో సెర్ప్ సామాజిక భద్రత పింఛన్ల నిధి నుంచి 7,478 మందికి మార్చి నెల పింఛన్లు పంపిణీ చేశారు. తాజాగా అమరావతి పరిధిలోని 17,377 మంది లబ్ధిదారులకు ఏప్రిల్ నెల పింఛన్‌తో పాటు మార్చి బకాయిల పంపిణీ చేపట్టామని అదనపు కమిషనర్ కట్టా సింహాచలం తెలిపారు.

'ప్రైవేట్'లో ఉచిత విద్యకు 3,023 మందికి అవకాశం

9వ తేదీలోగా బడుల్లో చేరాలి: కమిషనర్

సాక్షి, అమరావతి: ఉచిత విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు మరో 3,023 మంది చిన్నారులను ఎంపిక చేశారు. మొదటి విడతలో తొలి జాబితాగా 9,064 మంది ఎంపికయ్యారు. ఇదే విడతలో అర్హత సాధించిన విద్యార్థుల రెండో జాబితాను బుధవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ విడుదల చేశారు. మొదటి విడతలో మిగిలిన సీట్లకు లాటరీ తీయగా 3,023 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఆ జాబితాను అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు, సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్లకు పంపించారు. విద్యార్థులకు కేటాయించిన పాఠశాలల్లో ఈ నెల 9 లోపు చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఈ నెల 6–15 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సైన్స్ సిటీ సీఈవో పదవీకాలం పొడిగింపు



సాక్షి, అమరావతి: ఏపీ సైన్స్ సిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) డాక్టర్ కొండా జయరామిరెడ్డి పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. కేంద్రం సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టులను పూర్తి చేయవలసిన అవసరం ఏర్పడటంతో మౌలిక వసతుల కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ కరికాల వలవన్ సీఈవో పదవీ కాలాన్ని పొడిగించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు పెంపు

గరిష్టంగా 23 శాతం వరకు పెరుగుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. వీరి వేతనాలను క్యాడర్‌ను బట్టి గరిష్టంగా 23% వరకు పెంచు తూ వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లతో పాటు వివిధ ఆరోగ్య కార్యక్రమాల్లో 20 వేలమంది ఒప్పంద ఉద్యోగులు పనిచేస్తుంటారు. వీరిలో 172 క్యాడర్లలో పనిచేసే 18 వేలమంది ఉద్యోగులకు వేతనాల పెంపుతో లబ్ధిచేకూరింది. క్యాడర్‌ను బట్టి ఒక్కో ఉద్యోగికి కనిష్టంగా రూ.3 వేల నుంచి గరిష్టంగా రూ.13 వేల వరకు ఉద్యోగుల వేతనాలు పెరగనున్నాయి. వేతనాల పెంపుతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.80 కోట్ల భారం పడనుంది.

అవినాశ్‌ను ప్రశ్నించాల్సి ఉంది: సీబీఐ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సాక్ష్యాలను చెరిపివేశారన్న అభియోగాలు ఉన్నాయని, ఈ కేసులో 438 సీఆర్‌పీసీ మెయింటెయినబుల్ కాదని తెలంగాణ హైకోర్టుకు సీబీఐ వెల్లడించింది. ముందస్తు బెయిల్ కోరుతూ అవినాశ్ దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణలో భాగంగా సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. అవినాశ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని పేర్కొంది. ఆయన విచారణకు సహకరించడం లేదని, అన్ని ప్రశ్నలకు సమాధానాలు దాటవేస్తున్నారని, ఆయన్ని అరెస్టు చేసి కస్టడీలో ప్రశ్నించాల్సిన అవసరం ఉందని తెలిపింది. దర్యాప్తును పక్కదారి పట్టించేందుకే ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారని పేర్కొంది. అవినాశ్‌కి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షులు కూడా ముందుకు రావట్లేదని, ఆయన అనుచరుల వల్ల దర్యాప్తునకు ఆటంకం కలిగిందని పేర్కొంది. దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేస్తున్నారని తెలిపింది.

వివేకా పీఏ, వంట మనిషి కుమారుడ్ని విచారించిన సీబీఐ

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకా హత్యకు ముందు రాసిన లేఖ, దానిని ఎవరు, ఎందుకు దాచిపెట్టారన్న విషయాలపై సీబీఐ దృష్టి పెట్టింది. ఈ లేఖ విషయమై వివేకా పీఏ కృష్ణారెడ్డిని, వంట మనిషి లక్ష్మీదేవి కుమారుడు ప్రకాశ్‌ను సీబీఐ అధికారులు ఇద్దరినీ కలిపి బుధవారం విచారించారు. కృష్ణారెడ్డి స్వయంగా ప్రకాశ్‌కు లేఖ ఇచ్చి దాచిపెట్టాలని చెప్పినట్లు ఆరోపణలురావడంతో వారిద్దరినీ కలిపి ప్రశ్నించినట్లు సమాచారం. కీలకమైన ఈ లేఖను ఎందుకు దాచిపెట్టారు? ఎవరి ఆదేశాల మేరకు దాచిపెట్టారన్న అంశంపై ప్రకాశ్‌ను విచారించి, స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు.



నెల్లూరు పత్తేఖాన్‌పేటలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న వలంటీర్ విక్టోరియా



ఏలూరులో మంతెన సుజాతకు వితంతు పింఛను అందజేస్తున్న వలంటీర్ పి.సత్యవతి



గుంటూరులోని నాయుడుపేటకు చెందిన ఎరుగుల శిరీషకు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వార్డు వలంటీరు శ్రీదేవి



ఒంగోలు విజయనగర్ కాలనీలో డయాలసిస్ పేషెంట్ అప్పిశెట్టి సుబ్బాయమ్మకు పింఛను నగదు రూ.10 వేలు అందజేస్తున్న వలంటీర్ సుశీల

61.41 లక్షల మందికి
1,696 కోట్లు

97 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నాటికి 61,41,855 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ల పంపిణీ పూర్తయింది. గత మూడు రోజులుగా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ.1,696 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేసినట్టు సెర్ప్ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు 97 శాతం పంపిణీ పూర్తయిందని, మిగిలిన వారికి మరో రెండు రోజుల పాటు వలంటీర్ల ద్వారా పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.

రైతులకు అండగా నిలవండి

- అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం
- వర్షాలకు తడిసిన ధాన్యం కొనేందుకు తక్షణ చర్యలు చేపట్టండి
- రైతుల వద్ద, ఎక్కడ ధాన్యం ఉన్నా గోడౌన్లు, ప్రభుత్వ భవనాల్లోకి చేర్చండి
- అకాల వర్షాలపై కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్ష

సాక్షి, అమరావతి: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్లను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. రాష్ట్రంలో అకాల వర్షాలు, తదనంతర పరిస్థితులపై ముఖ్యమంత్రి జగన్ బుధవారం విశాఖ నుంచి తిరిగి రాగానే సీఎంవో అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యం కొనుగోలుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. హార్వెస్టింగ్ చేసి ఉన్న ధాన్యం ఎక్కడ ఉన్నా వర్షాల బారి నుంచి కాపాడ్డానికి చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. రైతుల వద్ద, కొనుగోలు కేంద్రాల వద్ద, ఆర్బీకేల వద్దకాని ఎక్కడ ధాన్యం నిల్వలున్నా వెంటనే అందుబాటులోని గోడౌన్లకు, ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని చెప్పారు. ఎన్యుమరేషన్ ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ధాన్యం తరలింపునకు రవాణా ఖర్చుల కింద ప్రతి కలెక్టర్‌కూ కోటి రూపాయలు చొప్పున కేటాయించినట్లు అధికారులు తెలిపారు. వర్షాలు, పంట విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లాకు ఒక వ్యవసాయ శాస్త్రవేత్త ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు వివరించారు. చేలల్లో ఉన్న మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా వెంటనే కొనేందుకు చర్యలు చేపట్టామన్నారు. వర్షాలు తగ్గగానే పంట నష్టపోయిన ప్రాంతాల్లో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు.

సూత్రధారి చిక్కి 'నారా'!

ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో అమరావతిలో ఎల్లో గ్యాంగ్ భూ దందా

సాక్షి, అమరావతి: ఇన్నాళ్లూ సాంకేతిక కారణాలను సాకుగా చూపిస్తూ విచారణ నుంచి తప్పించుకుంటున్న మాజీ సీఎం చంద్రబాబు అవినీతి బండారం ఇక బద్దలు కానుంది. టీడీపీ హయాంలో అవినీతి బాగోతాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా విచారించవచ్చని తాజాగా సుప్రీంకోర్టు పచ్చ జెండా ఊపడంతో ఇక అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఇప్పటికే చంద్రబాబు, మాజీ మంత్రి నారాయణ, బినామీల అవినీతి దందాను ఆధారాలతో సహా గుర్తించిన 'సిట్' ఇక దూకుడుగా వెళ్లనుంది. ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా పొంగూరు నారాయణలతోపాటు వారి బంధువులు, బినామీలు, సన్నిహితులపై ఇప్పటికే కేసులు నమోదు చేసింది. ఇక అసలు సూత్రధారుల విచారణ, అరెస్టులకు సిట్ సన్నద్ధం కానుందని తెలుస్తోంది.

అక్రమాలను నిర్ధారించిన సబ్ కమిటీ

టీడీపీ హయాంలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణకు ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ గత సర్కారు విధానపరమైన నిర్ణయాలు, ప్రాజెక్టులు, కార్పొరేషన్లు, సొసైటీలు, కంపెనీలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను క్షుణ్నంగా సమీక్షించింది. విధానపరమైన లోపాలు, న్యాయపరమైన తప్పిదాలు, ఆర్థిక అక్రమాలు, మోసపూరిత లావాదేవీలను గుర్తించిన సబ్ కమిటీ ఈమేరకు 2019 డిసెంబర్ 27న ప్రాథమిక నివేదిక సమర్పించింది. ఈ నివేదికపై చర్చించిన రాష్ట్ర మంత్రి మండలి టీడీపీ హయాంలో అవినీతిపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు వీలుగా నిర్ణయం తీసుకుంది. ఈమేరకు 2020 ఫిబ్రవరి 21న పది మంది సభ్యులతో సిట్ ఏర్పాటైంది. అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సిట్‌కు నిర్దేశించారు.

సిట్ దర్యాప్తుతో అవినీతి బట్టబయలు

టీడీపీ సర్కారు అవినీతిపై సిట్ బృందం కీలక ఆధారాలు సేకరించి, శాస్త్రీయంగా నిరూపించి, పలువురిని విచారించి ఏకబిగిన దర్యాప్తు కొనసాగించింది. చంద్రబాబు, నారాయణ తమ బంధువులు, బినామీల ద్వారా సాగించిన అవినీతి బాగోతాన్ని ఆధారాలతో సహా వెలుగులోకి తెచ్చింది. ఈ దోపిడీలో పాత్రధారులైన పలువురిని అరెస్టు చేసింది. మరోవైపు సిట్ వినతి మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ కూడా టీడీపీ ప్రభుత్వంలోని అవినీతి వ్యవహారాలపై విచారణ చేపట్టి కీలక ఆధారాలు సేకరించాయి.



సిట్ దర్యాప్తులో నిగ్గు తేలిన నిజాలివీ..

రూ.5,600 కోట్ల అసైన్డ్ భూ దోపిడీ

టీడీపీ అధికారంలో ఉండగా రాజధాని ముసుగులో పచ్చ గద్దలు అమరావతిలో అసైన్డ్ భూములను కొల్లగొట్టాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలను భయభ్రాంతులకు గురి చేసి అసైన్డ్ భూములను చంద్రబాబు, నారాయణ తమ బినామీల పేరిట హస్తగతం చేసుకున్నారు. అసైన్డ్ భూముల చట్టాన్ని ఉల్లంఘించి ఏకంగా రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాల భూ దోపిడీకి పాల్పడినట్టు సీఐడీ ప్రాథమికంగా గుర్తించింది. రాజధాని నిర్మాణం తరువాత అమరావతిలో ఎకరా మార్కెట్ విలువ కనీసం రూ.4 కోట్లకు చేరుతుందని నాడు చంద్రబాబే ప్రకటించారు. ఆ ప్రకారం టీడీపీ నేతలు దక్కించుకున్న అసైన్డ్ భూముల విలువ రూ.5,600 కోట్లని నిర్ధారణ అయింది. టీడీపీ పెద్దలు కొల్లగొట్టిన 1,400 ఎకరాల్లో 23 సీఆర్‌డీఏ కార్యాలయాల పరిధిలోని 932.72 ఎకరాలను ఎవరెవరి పేరిట అన్యాక్రాంతం చేశారన్నది నిగ్గు తేల్చింది. మిగిలిన భూములపై దర్యాప్తు కొనసాగుతోంది.

నారా, నారాయణ బంధువులు, బినామీలే..

అసైన్డ్ భూముల అక్రమాల తీగ లాగితే నారా చంద్రబాబు, పొంగూరు నారాయణ బంధువులు, బినామీల పేరిట అసైన్డ్ భూములను జీపీఏ, సేల్ డీడ్ల ద్వారా హస్తగతం చేసుకున్నట్లు వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సమీప బంధువు పేరిట కూడా అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. నారాయణ సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ చిరుద్యోగుల పేరిట అసైన్డ్ భూములను కాజేశారు. అమరావతిలో సీడ్ క్యాపిటల్ అలైన్‌మెంట్‌ను చంద్రబాబు, నారాయణ కుటుంబ సభ్యుల ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించుకున్నారు. వారి భూముల సమీపంలోనే స్టార్టప్ ఏరియా వచ్చేలా ప్రణాళిక తయారైంది. ఈ కేసులో సిట్ అధికారులు ఇప్పటికే నారాయణ, ఆయన సతీమణి, కుమార్తెలు, అలుళ్లు, బినామీలను విచారించారు. వారి నివాసాల్లో సోదాలు చేసి కీలక ఆధారాలు సేకరించారు.

ఇన్నర్ రింగ్ రోడ్డులో అక్రమాలు..

చంద్రబాబు, నారాయణ బినామీలు, సన్నిహితులు, హెరిటేజ్ ఫుడ్స్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌కు చెందిన భూముల సమీపం నుంచే వెళ్లేలా అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. తాడిగడప – ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు నుంచి 3 కి.మీ. అవతలకు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చారు. నారాయణ విద్యా సంస్థలకు చెందిన 7 క్యాంపస్‌లకు సమీపం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు వెళ్లేలా మార్పులు చేశారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని సంస్థలకు చెందిన భూముల సమీపం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు వెళ్లేలా అలైన్‌మెంట్ రూపొందించారు.ఈ సంస్థల భూముల విలువ పెరిగేలా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు.

'స్కిల్'లో రూ.241 కోట్ల అవినీతి

జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకే తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ఓ ప్రాజెక్టును సృష్టించి మరీ చంద్రబాబు బృందం రూ.241 కోట్లు కొల్లగొట్టింది. చంద్రబాబు కనుసన్నల్లో ఎలాంటి శాస్త్రీయ మదింపు లేకుండానే రూ.3,300 కోట్లతో ప్రాజెక్టును రూపొందించడం గమనార్హం. 2014–15లో సీఎంగా ఉన్న చంద్రబాబును సీమెన్స్ ఇండియా లిమిటెడ్ ఎండీ సుమన్ బోస్, డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ కన్విల్కర్ కలిశారు. ప్రభుత్వం 10 శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ సంస్థలు 90 శాతం నిధులు పెట్టుబడి పెడతాయంటూ ఒప్పందం కుదుర్చుకున్నారు. అసలు సీమెన్స్ కంపెనీకి ఈ ఒప్పందం గురించే తెలియకపోవడం గమనార్హం. సుమన్ బోస్ అలియాస్ సౌమ్యాద్రి శేఖర్ బోస్‌తోపాటు టీడీపీ పెద్దలు డిజైన్ టెక్‌తో కలిసి కథ నడిపించారు. ప్రాజెక్టు పనులు మొదలు పెట్టకుండానే ప్రభుత్వం తరఫున 10 శాతం వాటాగా జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లను ఆ సంస్థలకు చెల్లించేశారు. షెల్ కంపెనీలకు కమీషన్లు చెల్లించి టీడీపీ పెద్దలు రూ.241కోట్లు కొల్లగొట్టారు. ఈ కేసులో సిట్ ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించింది. షెల్ కంపెనీల ప్రతినిధులు, అప్పటి అధికారులు 8 మందిని అరెస్టు చేసింది. స్కిల్ కుంభకోణంపై ఈడీ కూడా కొరడా ఝుళిపించింది. షెల్ కంపెనీల ప్రతినిధులను అరెస్టు చేయడంతోపాటు డిజైన్‌టెక్ సంస్థ బ్యాంకు డిపాజిట్లను జప్తు చేసింది.

ఫైబర్ నెట్‌లో రూ.284 కోట్లు స్వాహా

కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఫైబర్ నెట్ ప్రాజెక్టులో టీడీపీ పెద్దలు యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. రూ.333 కోట్ల విలువైన ఫైబర్ నెట్ ప్రాజెక్టు మొదటి దశ పనులను నిబంధనలకు విరుద్ధంగా లోకేశ్ సన్నిహితుడైన వేమూరి హరికృష్ణకు చెందిన టెరా సాఫ్ట్‌కు కేటాయించారు. అప్పటికప్పుడు విజయవాడ కేంద్రంగా నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్ ఎల్‌ఎల్‌పీ అనే మ్యాన్‌పవర్ సప్లై కంపెనీ పేరిట ఓ షెల్ కంపెనీని సృష్టించారు. ఆ కంపెనీ ఫైబర్ నెట్ ప్రాజెక్టుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చినట్లు, పర్యవేక్షించినట్లు కథ నడిపించారు. ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న టెరాసాఫ్ట్ కంపెనీ, ఇతర కంపెనీలకు గత సర్కారు ఏకంగా రూ.284 కోట్లు విడుదల చేసింది. టెరాసాఫ్ట్ లావాదేవీలపై సీఐడీ అధికారులు ఇండిపెండెంట్ ఏజెన్సీ ఐబీఐ గ్రూప్ ద్వారా ఆడిటింగ్ జరపడంతో బాగోతం బట్టబయలైంది. టెరాసాఫ్ట్ కంపెనీ నిబంధనలను ఉల్లంఘించిందని, నాసిరకం పరికరాలు సరఫరా చేసి ప్రభుత్వాన్ని మోసగించిందని ఐబీఐ గ్రూప్ నిర్ధారించింది.

అసైన్డ్ అరాచకాలు ఇలా..

- చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ నేతలు, బంధువులు — **616.73** ఎకరాలు
- బలుసు శ్రీనివాసరావు, వెంకటరావు (తూర్పు గోదావరి జిల్లా) — **14.34** ఎకరాలు
- నారాయణ విద్యా సంస్థలు, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ ఉద్యోగులు (సేల్ డీడ్ల ద్వారా అసైన్డ్ భూములు హస్తగతం చేసుకున్నారు)
- కసిరెడ్డి పేరయ్య (విశాఖపట్నం) — **13.96** ఎకరాలు
- పొంగూరు నారాయణ బంధువులు — **140.10** ఎకరాలు (సేల్ డీడ్ల ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)
- నిమ్మగడ్డ శాంతకుమారి (నిజామాబాద్) — **10.23** ఎకరాలు
- సుఖవాసి బసవరామయ్య, చైతన్య (హైదరాబాద్) — **7.88** ఎకరాలు
- పొట్లూరి జయంత్ (విజయవాడ) — **4.27** ఎకరాలు
- చెరుకూరి అచ్యుతకిరణ్, రోహిత్ కిరణ్ (విజయవాడ) — **3.33** ఎకరాలు
- కాట్రగడ్డ చంద్రశేఖరరావు — **5.23** ఎకరాలు
- బోయినపల్లి వెంకట నరసింహారావు (హనుమకొండ, తెలంగాణ) — **3.35** ఎకరాలు
- గుమ్మడి సురేశ్ (విజయవాడ) — **40.96** ఎకరాలు (ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీవీ వియ్యంకుడు. జీపీఏ ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)
- వెల్లంకి శ్రీనివాస సత్యప్రసాద్ — **5.10** ఎకరాలు
- పోలవరపు సోమశేఖర్ (హైదరాబాద్) — **5.62** ఎకరాలు
- కొల్లి శివరామ్, విజయవాడ — **52.12** ఎకరాలు (మాజీ మంత్రి నారాయణ సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లో ఉద్యోగి. జీపీఏ ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)
- యాగంటి శ్రీకాంత్, గుంటూరు — **9.50** ఎకరాలు (రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లో ఉద్యోగి. జీపీఏ ద్వారా అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు)


పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే వారికి ఏడుపెందుకు!

- తమ ఆకాశ సౌధాల పక్కన పేదలు ఉండకూడదన్నదే వారి ఉద్దేశం
- అందుకే చట్టప్రకారం చేస్తున్న పనులను కూడా అడ్డుకుంటున్నారు
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో పేదల కోసం ఇళ్ల స్థలాలు ఇస్తుంటే.. వారికి ఏడుపెందుకో అర్థం కావడం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. రాజధానిలో పేదలు ఉండకూడదన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ఒక్క ఇంచు భూమిని కూడా పేదల కోసం కేటాయించలేదన్నారు. ఆ తప్పును ఇప్పటి ప్రభుత్వం సరిదిద్దిందని తెలిపారు. రాజధాని ప్రాంతంలోని మొత్తం విస్తీర్ణంలో 5% భూమిని పేదలకు కేటాయించాలని సీఆర్‌డీఏ చట్టం చెబుతున్నా.. గత ప్రభుత్వం దానిని పట్టించుకోలేదన్నారు. పేదలకు మాస్టర్ ప్లాన్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదన్నారు. ఇప్పుడు తాము చట్ట ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఓర్వలేకపోతున్నారన్నారు. చట్ట ప్రకారం చేస్తున్న పనులను అడ్డుకుంటున్నారని, ఇంతకన్నా దారుణం ఏముండదన్నారు. తాము ఉండబోయే ఆకాశ సౌధాల పక్కన పేదలు ఉండకూడదన్న ఉద్దేశంతోనే.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు.

పేదలకు స్థలాలు ఇవ్వొద్దని ఏ కోర్టయినా ఎందుకు చెబుతుంది

ప్రతి దానికీ రాజధాని విషయంలో విస్తృత ధర్మాసనం ఇచ్చిన తీర్పును పిటిషనర్లు ప్రస్తావిస్తున్నారని.. వాస్తవానికి విస్తృత ధర్మాసనం ఎక్కడా తన తీర్పులో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని చెప్పలేదని ఏఏజీ పొన్నవోలు నివేదించారు. చట్ట ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఏ కోర్టయినా ఇవ్వొద్దని ఎందుకు చెబుతుందని పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలపై పిటిషనర్లు ఇప్పటికే సుప్రీంకోర్టుకు వెళ్లారని తెలిపారు. సుప్రీంకోర్టు సైతం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఎందుకు, ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించడంతో పిటిషనర్లు విధిలేక తమ వ్యాజ్యాలను ఉపసంహరించుకున్నారన్నారు. ఇప్పుడు మళ్లీ హైకోర్టుకు వచ్చి రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఇలా అయితే ఏ ప్రభుత్వం కూడా పేదవాడికి గూడు కల్పించలేదన్నారు. పేదలు ఎప్పటికీ రోడ్లపై, చెట్లపై, ఫుట్‌పాత్‌లపైనే జీవిస్తూ, అక్కడ మరణిస్తారని, ఇంతకన్నా దౌర్భాగ్యం ఏమీ ఉండదన్నారు. టిడ్కో ఇళ్లకూ, ఇప్పుడు ఇవ్వదలచిన పేదలకు ఇళ్ల స్థలాలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల అర్హతలు, ఇళ్ల స్థలాల లబ్ధిదారుల అర్హతలు వేర్వేరంటూ ఆ వివరాలను కోర్టు ముందుంచారు. టిడ్కో ఇళ్ల కేటాయింపు ఇప్పటికే పూర్తయిందన్నారు. 147 ఇళ్లు మాత్రమే కేటాయించాల్సి ఉందన్నారు. పేదలకిస్తున్న ఇళ్ల స్థలాలపై రాద్ధాంతం చేస్తున్న పిటిషనర్లకు కేవలం అభివృద్ధి చేసిన ప్లాట్లపై మాత్రమే హక్కు ఉంటుందన్నారు. ఇతర విషయాలను వారు ప్రశ్నించలేరన్నారు. భూములిచ్చి త్యాగాలు చేశాం అంటూ పదే పదే పిటిషనర్లు చెబుతున్నారని, వాళ్లు భూములను త్యాగం చేయలేదని, వాణిజ్యపరమైన లబ్ధి పొందవచ్చునన్న ఉద్దేశంతో ఇష్టపూర్వకంగానే భూములిచ్చారన్నారు. ఇళ్ల స్థలాల వ్యవహారంలో ఇరుపక్షాలు తమ వాదనలు ముగించడంతో, మధ్యంతర ఉత్తర్వులపై శుక్రవారం తమ నిర్ణయాన్ని వెలువరిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది.



అత్యవసరం అనడంతో మళ్లీ వాదనలు విన్న ధర్మాసనం

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించేందుకు సీఆర్‌డీఏకు అనుమతిస్తూ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 45ను సవాల్ చేస్తూ అమరావతి రైతులు హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలు చేశారు. జీవో 45 అమలును నిలుపుదల చేయడంతోపాటు పేదలకు ఎలాంటి ఇళ్ల స్థలాలు కేటాయించకుండా ప్రభుత్వాన్ని నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ అనుబంధ వ్యాజ్యాలు కూడా దాఖలు చేశారు. వీటిపై గత నెల 21న వాదనలు విన్న సీజే ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. ఇదిలా ఉండగానే.. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల పట్టాలు, స్థలాలు ఇచ్చేస్తోందని, అందువల్ల ఈ వ్యవహారంపై అత్యవసరంగా విచారణ జరపాలంటూ రైతుల తరఫు న్యాయవాది ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. దీంతో సీజే ఈ వ్యాజ్యాలపై విచారణ జరపాలని నిర్ణయించారు. బుధవారం ధర్మాసనం మరోసారి ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి, సీఆర్‌డీఏ తరఫున కాసా జగన్‌మోహన్‌రెడ్డి, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దేవ్‌దత్ కామత్, వీఎస్సార్ ఆంజనేయులు వాదనలు వినిపించారు. సీఆర్‌డీఏ తరఫున కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాజధాని అభివృద్ధి మొత్తం సీఆర్‌డీఏ బాధ్యత అన్నారు. ఇప్పుడు పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 1,134 ఎకరాల భూమిని సీఆర్‌డీఏ ప్రభుత్వానికి విక్రయిస్తుందన్నారు. దీనిద్వారా వచ్చే మొత్తాన్ని రాజధాని కోసం ఖర్చు చేస్తామన్నారు. రాజధానిని ఎలా అభివృద్ధి చేయాలి, ఎవరికి ఎలాంటి కేటాయింపులు చేయాలన్నది సీఆర్డీఏ చట్టంలో స్పష్టంగా నిర్దేశించారని, దాని ప్రకారమే తాము ముందుకు వెళుతున్నామని చెప్పారు.

కోర్టు తీర్పును పట్టించుకోవడం లేదు...

పిటిషనర్ల తరఫున దేవ్‌దత్ కామత్, వీఎస్సార్ ఆంజనేయులు వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టులో రాజధాని కేసు తేలేంత వరకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని నిరోధించాలని ధర్మాసనాన్ని కోరారు. ప్రభుత్వం కోర్టు ధిక్కారానికి పాల్పడుతోందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులపై శుక్రవారం నిర్ణయాన్ని వెలువరిస్తామని తెలిపింది.

వస్తోంది తుపాను

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టత వస్తుందని తెలిపింది. ఈ తుపాను మరింతగా బలపడేందుకు ఎక్కువ అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా మధ్య బంగాళాఖాతంలో ఏర్పడే తుపాను పశ్చిమ బెంగాల్, మయన్మార్‌ల వైపు పయనిస్తుందని చెబుతున్నారు. అయితే ఈ తుపాను కోస్తాంధ్ర వైపు కూడా రావొచ్చని చెబుతున్నారు. గతంలో మే నెలలో సంభవించిన తుపానులు ఆంధ్రప్రదేశ్ తీరం వైపు రావడాన్ని వీరు ఉదహరిస్తున్నారు. తుపాను ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ 'సాక్షి'కి చెప్పారు. ఫలితంగా రాష్ట్ర ప్రజలకు వారం రోజులపాటు ఉష్ణతాపం/వడగాడ్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని తెలిపారు.

మే నెలలో తుపానులు సహజమే

ప్రతి ఏటా మే నెలలో ఒకట్రెండు తుపానులు సహజమే. గత సంవత్సరం బంగాళాఖాతంలో మే మొదటి వారంలో 'అసని' తుపాను ఏర్పడింది. నైరుతి రుతుపవనాలు నాలుగు రోజులు ముందుగా కేరళలోకి ప్రవేశించడానికి ఇది దోహదపడింది. ఇది రాష్ట్రంలోని మచిలీపట్నం – నర్సాపురంల మధ్య తీరాన్ని దాటింది. 2021 మే రెండో వారంలో అరేబియా సముద్రంలో 'టౌక్టే' తుపాను ఏర్పడి బంగాళాఖాతంలో రుతుపవనాల ఆగమనానికి తోడ్పడింది. అదే సంవత్సరం మే 23న బంగాళాఖాతంలో 'యాస్' తుపాను సంభవించి సత్వరమే రుతుపవనాల ఆగమనానికి సహకరించింది. ఇది ఒడిశాలోని బాలసోర్ వద్ద తీరం దాటింది. 2020 మే 16న బంగాళాఖాతంలోనే 'అంఫన్' తుపాను ఏర్పడింది. ఇది పశ్చిమ బెంగాల్‌లో తీరాన్ని దాటింది. వీటన్నిటినీ పరిశీలిస్తే త్వరలో ఏర్పడనున్న తుపాను ప్రభావం ఏపీపై కూడా ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు. ఇది నైరుతి రుతుపవనాల ఆగమనంపై కూడా ప్రభావం చూపుతుందని చెబుతున్నారు.

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

మరోవైపు భూమిపై సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో తమిళనాడు, కర్ణాటక మీదుగా మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీనికి అరేబియన్ సముద్రం వైపు నుంచి గాలులు తోడవడంతో మరికొద్ది రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (ఏపీఎస్‌డీపీఎస్) డైరెక్టర్ శివశంకర్ తెలిపారు. గురు, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. అనేక చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడతాయని చెప్పారు.



ప్రపంచ నంబర్‌వన్ జోడీకి బోపన్న ద్వయం షాక్

రెండు నెలల వ్యవధిలో రెండోసారి ప్రపంచ నంబర్‌వన్ జోడీని బోల్తా కొట్టిస్తూ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ జోడీ 6–3, 6–2తో ప్రపంచ నంబర్‌వన్ వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)–నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) ద్వయంపై గెలిచింది. మార్చిలో ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ ఫైనల్లో కూలాఫ్–స్కుప్‌స్కీ జంటను ఓడించి బోపన్న ద్వయం విజేతగా నిలిచింది.



నిశాంత్ దేవ్ సంచలనం

ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ నిశాంత్ దేవ్ సంచలన విజయంతో శుభారంభం చేశాడు. తాష్కెంట్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో బుధవారం జరిగిన 71 కేజీల తొలి రౌండ్ బౌట్‌లో నిశాంత్ దేవ్ 5–0తో సర్ఖాన్ అలియెవ్ (అజర్‌బైజాన్)పై గెలుపొందాడు. 2021 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నిశాంత్ దేవ్ క్వార్టర్ ఫైనల్ చేరగా... ఇదే టోర్నీలో అలియెవ్ కాంస్య పతకం సాధించాడు.

ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ అథ్లెట్ టోరి బోవి హఠాన్మరణం



ఫ్లోరిడా: ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ మహిళా అథ్లెట్ టోరి బోవి (అమెరికా) హఠాన్మరణం చెందింది. ఫ్లోరిడాలోని ఆమె నివాసంలో విగత జీవిగా పడి ఉన్నట్లు గుర్తించారు. ఆమె మరణానికి గల కారణాలను ఇంకా వెల్లడి కాలేదు. కొంత కాలంగా ఆమె మానసిక ఒత్తిడితో బాధపడుతోందని సమాచారం. 32 ఏళ్ల టోరి బోవి 2016 రియో ఒలింపిక్స్‌లో 4x100 మీటర్ల రిలేలో స్వర్ణం, 100 మీటర్లలో రజతం, 200 మీటర్లలో కాంస్య పతకం సాధించింది. 2015 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో కాంస్యం నెగ్గిన ఆమె... 2017లో లండన్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది. అంతే కాకుండా 4x100 మీటర్ల రిలే పసిడి పతకం సొంతం చేసుకున్న అమెరికా జట్టులో సభ్యురాలిగా ఉంది. డైమండ్ లీగ్ మీట్‌లో ఆమె నాలుగుసార్లు 100 మీటర్లలో, నాలుగుసార్లు 200 మీటర్లలో స్వర్ణ పతకాలను సాధించింది. 2019లో దోహా వేదికగా జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన టోరి బోవి 100 మీటర్ల విభాగంలో సెమీఫైనల్‌కు చేరినా ఆమె సెమీఫైనల్ రేసులో పోటీపడలేదు. ఈ మెగా ఈవెంట్‌లోనే ఆమె లాంగ్‌జంప్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఆమె మరో అంతర్జాతీయ ఈవెంట్‌లో పోటీపడలేదు.

ఐపీఎల్ టోర్నీ మిగతా మ్యాచ్‌లకు రాహుల్ దూరం!



న్యూఢిల్లీ: లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ తొడ కండరాల గాయంతో... పేస్ బౌలర్ జైదేవ్ ఉనాద్కట్ భుజం గాయంతో ఈ ఐపీఎల్ సీజన్‌లోని మిగిలిన మ్యాచ్‌లకు దూరం కావడం ఖాయమైంది. బెంగళూరుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ రాహుల్ గాయపడ్డాడు. రాహుల్‌కు గురువారం ముంబైలో స్కానింగ్ చేసి గాయం తీవ్రతను పరిశీలిస్తారు. వచ్చే నెలలో లండన్‌లో ఆస్ట్రేలియాతో జరిగే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో తలపడే భారత జట్టులో రాహుల్, ఉనాద్కట్ సభ్యులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరి విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని బీసీసీఐ భావిస్తోంది.

ముంబై మెరుపులు

- 6 వికెట్లతో పంజాబ్‌పై విజయం
- చెలరేగిన ఇషాన్ కిషన్, సూర్య



సూర్య



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ ఇషాన్ కిషన్

మొహాలి: మూడు రోజుల క్రితం 213 పరుగుల లక్ష్యం...4 వికెట్లే కోల్పోయి 3 బంతులు మిగిలి ఉండగానే ఛేదన...ఇప్పుడు లక్ష్యం 215 పరుగులు...4 వికెట్లే కోల్పోయి 7 బంతులు ఉండగానే ఛేదన... ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ ముంబై ఇండియన్స్ మెల్లగా తమ స్థాయి ఏమిటో చూపిస్తోంది. మ్యాచ్ మ్యాచ్‌కూ మెరుపు ప్రదర్శనతో చెలరేగుతున్న ఆ జట్టు మరోసారి బ్యాటింగ్ బలంతో కీలక విజయాన్ని అందుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 6 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. లివింగ్‌స్టోన్ (42 బంతుల్లో 82 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), జితేశ్ శర్మ (27 బంతుల్లో 49 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు వేగంతో పరుగులు సాధించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 53 బంతుల్లోనే అభేద్యంగా 119 పరుగులు జోడించారు. అనంతరం ముంబై 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 216 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (41 బంతుల్లో 75; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (31 బంతుల్లో 66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) మూడో వికెట్‌కు 55 బంతుల్లోనే 116 పరుగులు జత చేసి గెలుపులో కీలకపాత్ర పోషించారు.

మెరుపు భాగస్వామ్యం...

ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (9) విఫలం కాగా, మరో ఎండ్‌లో కెప్టెన్ శిఖర్ ధావన్ (20 బంతుల్లో 30; 5 ఫోర్లు) కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లేలో పంజాబ్ స్కోరు 50 పరుగులకు చేరింది. శిఖర్, మాథ్యూ షార్ట్ (26 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్)లను తక్కువ వ్యవధిలో చావ్లా వెనక్కి పంపడంతో స్కోరు 11.2 ఓవర్లలో 95/3 వద్ద నిలిచింది. అయితే ఆ తర్వాత పంజాబ్ జోరు మొదలైంది. ఆర్చర్ ఓవర్లో జితేశ్ మూడు ఫోర్లతో దూకుడు మొదలు పెట్టగా, అర్షద్ ఓవర్లో లివింగ్‌స్టోన్ మూడు ఫోర్లు బాదాడు. ఈ క్రమంలో 32 బంతుల్లో లివింగ్‌స్టోన్ అర్ధసెంచరీ పూర్తయింది. అతని బ్యాటింగ్‌లో ఆర్చర్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్ హైలైట్‌గా నిలిచింది. ఈ ఓవర్ తొలి మూడు బంతుల్లో వరుసగా 6, 6, 6తో చెలరేగిన లివింగ్‌స్టోన్ ఆఖరి బంతికీ ఫోర్ కొట్టడంతో స్కోరు 200 దాటింది. ఈ ఓవర్లో మొత్తం 27 పరుగులు రావడం విశేషం.

రోహిత్ విఫలం...

తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ (0)ను డకౌట్ చేసి రిషి ధావన్ ముంబైని దెబ్బ తీశాడు. అయితే ఇషాన్, గ్రీన్ (18 బంతుల్లో 23; 4 ఫోర్లు) ధాటిగా ఆడి ఇన్నింగ్స్‌ను నడిపించారు. అర్ష్‌దీప్ ఓవర్లో 2 ఫోర్లు కొట్టిన ఇషాన్, రిషి ఓవర్లో రెండు సిక్సర్లు బాదాడు. గ్రీన్ వికెట్ కోల్పోయిన జట్టు పవర్‌ప్లే ముగిసేసరికి 54 పరుగులు చేసింది. ఈ దశలో ఇషాన్, సూర్యకుమార్ అద్భుత బ్యాటింగ్ ముంబైని గెలుపు దిశగా నడిపించింది. 29 బంతుల్లో ఇషాన్, 23 బంతుల్లో సూర్యకుమార్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నారు. కరన్ ఓవర్లో సూర్య వరుసగా 6, 6, 4, 4తో చెలరేగాడు. ఆ తర్వాత అర్ష్‌దీప్ ఓవర్లో ఇషాన్ వరుసగా సిక్స్, 2 ఫోర్లు బాదాడు. వీరిద్దరిని 8 పరుగుల వ్యవధిలో అవుట్ చేసి పంజాబ్ ఊపిరి పీల్చుకుంది. అయితే 23 బంతుల్లో 37 పరుగులు చేయాల్సిన ఈ స్థితిలో ముంబైకి ఎలాంటి ఇబ్బంది ఎదురు కాలేదు. తిలక్ వర్మ (10 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (10 బంతుల్లో 19 నాటౌట్; 3 ఫోర్లు) కలిసి జట్టును గెలిపించారు. అర్ష్‌దీప్ వేసిన 17వ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4, 6తో సత్తా చాటిన తిలక్...అర్ష్‌దీప్ తర్వాతి ఓవర్లోనే భారీ సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించడం విశేషం.



ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	9	6	3	0	12	0.532
లక్నో	10	5	4	1	11	0.639
చెన్నై	10	5	4	1	11	0.329
రాజస్తాన్	9	5	4	0	10	0.800
బెంగళూరు	9	5	4	0	10	-0.030
ముంబై	9	5	4	0	10	-0.373
పంజాబ్	10	5	5	0	10	-0.472
కోల్‌కతా	9	3	6	0	6	-0.147
హైదరాబాద్	8	3	5	0	6	-0.577
ఢిల్లీ	9	3	6	0	6	-0.768

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ x కోల్‌కతా (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) ఇషాన్ కిషన్ (బి) అర్షద్ 9; శిఖర్ ధావన్ (స్టంప్డ్) ఇషాన్ కిషన్ (బి) చావ్లా 30; షార్ట్ (బి) చావ్లా 27; లివింగ్‌స్టోన్ (నాటౌట్) 82; జితేశ్ (నాటౌట్) 49; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 214.** **వికెట్ల పతనం:** 1–13, 2–62, 3–95. **బౌలింగ్:** గ్రీన్ 2–0–15–0, అర్షద్ 4–0–48–1, ఆర్చర్ 4–0–56–0, చావ్లా 4–0–29–2, కార్తికేయ 3–0–24–0, ఆకాశ్ 3–0–37–0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) షార్ట్ (బి) రిషి 0; ఇషాన్ (సి) రిషి (బి) అర్ష్‌దీప్ 75; గ్రీన్ (సి) చహర్ (బి) ఎలిస్ 23; సూర్యకుమార్ (సి) అర్ష్‌దీప్ (బి) ఎలిస్ 66; డేవిడ్ (నాటౌట్) 19; తిలక్ వర్మ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (18.5 ఓవర్లలో 4 వికెట్లకు) 216. వికెట్ల పతనం:** 1–0, 2–54, 3–170, 4–178. **బౌలింగ్:** రిషి ధావన్ 3–0–20–1, అర్ష్‌దీప్ 3.5–0–66–1, స్యామ్ కరన్ 3–0–41–0, ఎలిస్ 4–0–34–2, రాహుల్ చహర్ 3–0–30–0, హర్‌ప్రీత్ 2–0–21–0.

లక్నో, చెన్నై మ్యాచ్ వర్షార్పణం

ఫలితం రాకపోవడంతో రెండు జట్లకు చెరో పాయింట్



లక్నో: ఐపీఎల్ 16వ సీజన్‌లో తొలిసారి మ్యాచ్ వర్షార్పణమైంది. లక్నో సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌కు అకాల వర్షం అంతరాయం కలిగించడంతో అర్ధంతరంగా ముగిసింది. మైదానం తడిగా ఉండటంతో 15 నిమిషాలు ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్‌లో చెన్నై జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దాంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు 19.2 ఓవర్లలో 7 వికెట్లకు 125 పరుగులు సాధించింది. ఈ దశలో వర్షం రావడంతో ఆట నిలిచిపోయింది. వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో ఫలితం నిర్ణయించేందుకు చెన్నై ఇన్నింగ్స్‌ను కనీసం ఐదు ఓవర్ల పాటైనా నిర్వహించేందుకు సాధ్యపడలేదు. దాంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఫలితంగా రెండు జట్లకు చెరో పాయింట్ లభించింది. చెన్నై బౌలర్ల దెబ్బకు ఒకదశలో లక్నో 44 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే ఆయుష్ బదోని (33 బంతుల్లో 59 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (31 బంతుల్లో 20) ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించి ఆదుకోవడంతో లక్నో జట్టు స్కోరు 100 పరుగులు దాటింది.

'సీల్డ్ కవర్‌లో అఫిడవిట్ ఇస్తాం'

- సుప్రీంకోర్టుకు మహిళా రెజ్లర్ల విజ్ఞప్తి
- ప్లేయర్లను కలిసిన పీటీ ఉష



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై తాము చేసిన లైంగిక ఆరోపణల విషయంలో మహిళా రెజ్లర్లు తమ వాదనలకు సంబంధించి కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే తాము ఈ సమాచారాన్ని గురువారం సీల్డ్ కవర్‌లో అందిస్తామని ఏడుగురు రెజ్లర్లు సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడిన బెంచీ దీనికి అంగీకరించింది. ఈ అఫిడవిట్ కాపీని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు కూడా అందించేందుకు తాము సిద్ధమని, అయితే దీనిని బహిరంగపర్చవద్దని రెజ్లర్ల తరఫు న్యాయవాది కోరారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉంది కాబట్టి విచారణాధికారికి మాత్రం దీనిని అందించవచ్చా అని మెహతా అడగ్గా... అభ్యంతరం లేదని బెంచీ సభ్యులు స్పష్టం చేశారు. గత శుక్రవారం బ్రిజ్‌భూషణ్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

హామీ ఏమీ లేదు!

భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష ఎట్టకేలకు రెజ్లర్లను కలిసింది. గత వారం రెజ్లర్ల నిరసన కారణంగా దేశం పరువు పోతోందంటూ వ్యాఖ్య చేసి విమర్శలపాలైన ఉష తాజా భేటీ ఆసక్తిని రేపింది. వారితో ఏం చర్చించిందనే అంశంపై పూర్తి స్పష్టత లేకున్నా... అధికారికంగా ఐఓఏ అధ్యక్షురాలి హోదాలో ఉష నుంచి రెజ్లర్లకు ఎలాంటి హామీ మాత్రం లభించలేదు. 'ఆలస్యంగానైనా ఉష ఇక్కడకు రావడాన్ని స్వాగతిస్తున్నాం. తాను గతంలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని, ఐఓఏ అధ్యక్షురాలికంటే ముందు తాను అథ్లెట్‌నని ఆమె చెప్పారు. మాకు న్యాయం కావాలని, రెజ్లింగ్ మేలు కోసమే ఇదంతా చేస్తున్నామని చెప్పాం. మా పరిస్థితి చూస్తే బాధేస్తుందంటూ సంఘీభావం తెలిపారు. అయితే తక్షణ పరిష్కారం గురించి మాత్రం ఆమె ఏమీ చెప్పలేదు' అని రెజ్లర్లు వెల్లడించారు. మరోవైపు ఉషపై ఒక మహిళ దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఉషపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెంపదెబ్బ కొట్టినట్లుగా ఒక వీడియో కనిపిస్తున్నా... దానిపై స్పష్టత లేదు.

మరోవైపు బుధవారం రాత్రి రెజ్లర్లు నిరసన చేస్తున్న జంతర్ మంతర్ వద్దకు ఢిల్లీ పోలీసులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. అక్కడి నుంచి రెజ్లర్లను తరలించడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, రెజ్లర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.

సినిమా



"అల్లరి'తో మొదలైన నా కెరీర్‌లో 'ఉగ్రం' 60వ చిత్రం. ఈ ప్రయాణంలో ఎత్తుపల్లాలు ఉన్నాయి. గెలుపు, ఓటములను ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలో నేర్చుకున్నాను. 60 సినిమాలు చేయడం అంత సులభం కాదు.. ప్రేక్షకుల ఆదరణ వల్లే ఇది సాధ్యపడింది. ఈ ప్రయాణంలో బాపుగారు, కె. విశ్వనాథ్‌గారు వంటి లెజెండరీ దర్శకులతో పాటు, వంశీగారు, కృష్ణవంశీగార్లతో పని చేసే చాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను" అని 'అల్లరి' నరేశ్ అన్నారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్, మిర్నా మీనన్ జంటగా సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన చిత్రం 'ఉగ్రం'. ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'అల్లరి' నరేశ్ పంచుకున్న విశేషాలు.

మహర్షితో ఆ ధైర్యం వచ్చింది

– 'అల్లరి' నరేశ్

● మహేశ్‌బాబుగారి 'మహర్షి' సినిమాకి ముందు నేను చేసిన పాత్రలు వినోదాత్మకంగా ఉంటాయి. 'మహర్షి'లో నా పాత్ర సీరియస్‌గా, సింపతీగా ఉన్నా ప్రేక్షకులకు బాగా నచ్చింది. దాంతో ఇలాంటి పాత్రల్లోనూ ఆడియన్స్ ఆదరిస్తారనే ధైర్యం నాకు కలిగింది. రచయితలకు కూడా నమ్మకం కలగడంతో నా కోసం కామెడీ కాకుండా సీరియస్‌గా ఉండే కొత్త కథలు రాయడం మొదలు పెట్టారు. అలా వచ్చిన 'నాంది' హిట్ అయింది. ఇప్పుడు 'ఉగ్రం' తర్వాత మరిన్ని కొత్త కథలు నా కోసం రాస్తారనే నమ్మకం ఉంది. ● కామెడీ పాత్రలు చేయడం సులభం అనుకుంటారందరూ. కానీ చాలా కష్టం. కామెడీ చేసేవారు ఏ పాత్రయినా చేయగలరు. 'రంగమార్తాండ'లో బ్రహ్మానందంగారు, 'విడుదల' చిత్రంలో సూరి అద్భుతంగా చేశారు. 'ఉగ్రం విషయానికి వస్తే దర్శకుడు విజయ్ నా ప్లస్సుల కంటే మైనస్సులు ముందుగా నాకు చెప్పడంతో జాగ్రత్తలు తీసుకొని 'ఉగ్రం' చేశాను. మనల్ని దర్శకుడు నమ్మితే దాని ఫలితం వేరేలా ఉంటుంది. నన్ను క్రిష్‌గారు నమ్మడంతో 'గమ్యం', సముద్రఖనిగారు నమ్మడంతో 'శంభో శివ శంభో' వచ్చాయి. ఇప్పుడు విజయ్‌కి నాపై ఉన్న నమ్మకంతో 'నాంది, ఉగ్రం' వచ్చాయి. ● 'ఉగ్రం' ఐదేళ్ల టైమ్ లిమిట్‌లో జరుగుతుంది. ఎస్ఐ శిక్షణలో ఉన్నప్పుడు ఒక అమ్మాయిని ప్రేమించడం, ఆ తర్వాత పెళ్లి, ఒక కూతురు.. ఇలా మూడు వేరియేషన్స్‌లో ఉండే శివకుమార్ పాత్రలో కనిపిస్తాను. యాక్షన్ సీన్స్‌ని డూప్ లేకుండా చేశాను. ● మనకి సమస్య వస్తే పోలీస్ దగ్గరికి వెళ్తాం. అదే పోలీస్‌కి సమస్య వస్తే ఏం చేస్తాడు? ఎలా ట్రీట్ చేస్తాడనేది 'ఉగ్రం'లో ఉంటుంది. సస్పెన్స్, యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో స్క్రీన్ ప్లే చాలా ఆసక్తిగా ఉంటుంది. ● కామెడీ, సీరియస్.. ఏదీ సేఫ్ జోనర్ కాదు. 'సుడిగాడు, బెండు అప్పారావు, కితకితలు' వంటి హిట్ సినిమాలు చూసినప్పుడు 'నరేశ్ సినిమా బావుంది అన్నారు కానీ నరేశ్ కామెడీ బాగా చేశాడనలేదు'. కానీ 'గమ్యం, శంభో శివ శంభో, మహర్షి' చూశాక 'నరేశ్ బాగా నటించాడు' అన్నారు. కామెడీ చేసేవాళ్లంటే ఇండస్ట్రీలో, ఆడియన్స్‌లో ఎక్కడో చిన్న చూపు ఉంది. ఈ విషయంలో నాకెక్కడో చిన్న గిల్ట్ ఫీలింగ్ ఉంది. ● 'వివాదాల జోలికి వెళ్లొద్దు, ఎవరి గురించి చెడుగా మాట్లాడొద్దు' అని మా నాన్న ఈవీవీ సత్యనారాయణగారు చెప్పారు. నాన్నగారు చెప్పినట్లు నాకు పని తప్ప మరో ఆలోచన లేదు. ఈవీవీగారి బ్యానర్‌లో నాన్నగారి మార్క్ సినిమాలు చేయాలి. సరైన కథ కుదిరితే నిర్మిస్తాను. నా సోదరుడు ఆర్యన్ రాజేశ్ తనని తాను నిరూపించుకునేందుకు సరైన కథ కోసం ఎదురు చూస్తున్నాడు. నాకు దర్శకత్వం ఆలోచన ఉంది కానీ అందుకు టైమ్ పడుతుంది.. అయితే నేను దర్శకత్వం వహించే మూవీలో నేను నటించను. ● నా సినిమాల్లో 'సుడిగాడు'కి సీక్వెల్ తీయొచ్చు. ఆ మూవీకి పని చేసిన అనిల్ రావిపూడి మొన్న కలిసినప్పుడు 'సుడిగాడు 2' చేద్దామా? అన్నాడు. 'నేను రూటు మార్చితే మళ్లీ కామెడీవైపు తీసుకెళ్తారా?' అని సరదాగా అన్నాను. నాన్నగారి చివరి రోజుల్లో 'అలీబాబా అరడజను దొంగలు' మూవీకి సీక్వెల్‌గా 'అలీబాబా డజను దొంగలు' సినిమా చేద్దామనుకున్నాం.. కానీ, కుదరలేదు. ప్రస్తుతం నేను, ఫరియా అబ్దుల్లా ఒక సినిమా చేస్తున్నాం. సుబ్బుగారి దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నాను. 'జెండా' అనే కథని కొన్నాను.. నేనే నిర్మిస్తా. అలాగే విజయ్‌తో మరో సినిమా ఉంటుంది.



● విజయ్ దేవరకొండ, శ్రీలీల

ఇక షురూ

కొత్త సినిమాకు శ్రీకారం చుట్టారు విజయ్ దేవరకొండ. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కుతున్న సినిమా బుధవారం ఆరంభమైంది. నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) స్క్రిప్ట్‌ను చిత్ర యూనిట్‌కు అందజేశారు. ప్రగతి ప్రింటర్స్ ఎండీ పరుచూరి మహేంద్ర కెమెరా స్విచ్చాన్ చేయగా, హానరరీ జనరల్ కాన్సుల్ ఆఫ్ సౌత్ కొరియా చుక్కపల్లి సురేశ్ క్లాప్ ఇచ్చారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ జూన్‌లో ఆరంభం కానుంది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: గిరీష్ గంగాధరన్.

కస్టడీ నాకు స్పెషల్ ఫిల్మ్

– నాగ చైతన్య



● పవన్ కుమార్, శ్రీనివాసా, నాగచైతన్య, కృతి, వెంకట్ ప్రభు

"ఎప్పటికప్పుడు ట్రెండ్ మారుతోంది. మూసధోరణి సినిమాలను ప్రేక్షకులు రిజెక్ట్ చేస్తున్నారు. అందుకే నా ప్రతి సినిమాకు కొత్త వేరియేషన్ చూపించాలనుకుంటున్నా. ఇందులో భాగంగానే 'కస్టడీ' సినిమా చేశాను. గతంలో నేను తమిళ దర్శకులతో చేసిన సినిమాలను తెలుగులో మాత్రమే తీశాం. కానీ 'కస్టడీ' సినిమాలోని ప్రతి సీన్‌ని తెలుగు, తమిళ భాషల్లో తీశాం. నా తొలి తమిళ చిత్రం 'కస్టడీ'. అందుకే ఇది నాకు స్పెషల్ ఫిల్మ్. ఈ సినిమా నాకో టర్నింగ్ పాయింట్ అవుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు నాగచైతన్య. వెంకట్‌ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీశెట్టి జంటగా నటించిన చిత్రం 'కస్టడీ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన 'కస్టడీ' సినిమా ప్రెస్‌మీట్‌లో నాగచైతన్య మాట్లాడుతూ– ''ఓ సింపుల్ కానిస్టేబుల్ చేతిలో ఉన్న ఓ పవర్‌ఫుల్ నిజం కోసం అతను ఎంత దూరమైనా వెళ్తాడు.. అంటూ వెంకట్‌ప్రభుగారు చెప్పిన స్టోరీ లైన్ నాకు బాగా నచ్చి 'కస్టడీ' ఒప్పుకున్నాను. వెంకట్‌ప్రభుగారి ట్రేడ్ మార్క్ స్క్రీన్ ప్లే తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుందని నమ్ముతున్నాను. అలాగే ఆయన 'కస్టడీ' స్టోరీ సింపుల్‌గా ఉంటుందని చెబుతున్నారు కానీ మా సినిమాలో చాలా లేయర్స్ ఉన్నాయి. అలాగే నా సినిమాకు ఇళయరాజా, యువన్‌శంకర్‌గార్లు మ్యూజిక్ ఇవ్వడం అనేది నా కల నిజమైనట్లు ఉంది'' అని అన్నారు. ''సాధారణంగా సినిమాల్లో విలన్‌ని హీరో, హీరోని విలన్ చంపాలనుకుంటారు. కానీ విలన్ చనిపోకుండా హీరో కాపాడడమే 'కస్టడీ' స్టోరీ లైన్. తెలుగులో నా తొలి చిత్రం 'కస్టడీ'. నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్ ఫిల్మ్ ఇది. కథను, నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన చైతూ, నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు వెంకట్ ప్రభు. ''ఈ సినిమా కథ విన్నప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. ఆడియన్స్ కూడా ఇదే ఫీలవుతారని ఆశిస్తున్నాను'' అన్నారు కృతీశెట్టి. ''కస్టడీ' బిజినెస్ పట్ల హ్యాపీగా ఉన్నాం. ప్రేక్షకుల స్పందనను బట్టి కన్నడ, హిందీ భాషల్లో కూడా విడుదల చేస్తాం'' అన్నారు శ్రీనివాసా చిట్టూరి.

> అభిమానులకు మంచి సక్సెస్ ఇవ్వాలనే అనుకుంటాం. వారి అభిమానం, ప్రేమలకు మేం తిరిగి ఇచ్చేది ఒక మంచి సినిమాయే. రీసెంట్‌గా మా నుంచి వచ్చిన కొన్ని సినిమాలకు మంచి రిజల్ట్ రాలేదు. యాక్టర్స్ కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజం. ఈ టైమ్ (బ్యాడ్ ఫేస్ అని పరోక్షంగా చెబుతూ..) వెళ్లిపోతుంది. తప్పకుండా మేం తిరిగి పుంజుకుంటాం. ఫ్యాన్స్ ఆశించే ఫలితం 'కస్టడీ' నుంచి రాబోతుందని నమ్ముతున్నాను. నాన్నగారి 'శివ' సినిమా అంటే అందరి ఆడియన్స్‌లానే నాకు చాలా గౌరవం. కస్టడీలో నా క్యారెక్టర్ పేరు శివ అయినప్పటికీ 'శివ' సినిమా మీద ఉన్న గౌరవంతో మా సినిమాకు ఆ టైటిల్ పెట్టలేదు.
> – నాగచైతన్య



● జగపతిబాబు

నేను హీరో కాదు.. విలన్ కాదు

"గతంలో నేను చేసిన 'శివ రామరాజు' చిత్రం అన్నదమ్ముల కథే. ఆ సినిమా చూశాక విడిపోయిన 24 కుటుంబాలు మళ్లీ కలిశాయి. 'రామబాణం' కూడా చాలా మంచి ఉద్దేశంతో చేసిన సినిమా'' అని నటుడు జగపతిబాబు అన్నారు. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రామ బాణం'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాత. ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ మూవీలో కీలక పాత్ర చేసిన జగపతిబాబు విలేకరులతో చెప్పిన విశేషాలు.

● ఇండస్ట్రీలో ఇప్పుడు హారర్, యాక్షన్, థ్రిల్లర్ సినిమాలు ఎక్కువగా వస్తున్నాయి... సెంటిమెంట్ తగ్గింది. నెగిటివిటీ పెరిగింది. సినిమా ఎంత క్రూరంగా ఉంటే అంత బావుంటోంది.. అందుకే నేను సక్సెస్ అయ్యాను (నవ్వుతూ). అయితే అంత నెగిటివిటీలోనూ పాజిటివిటీ ఉందని చెప్పడానికి 'రామ బాణం' వస్తోంది. ● సెకండ్ ఇన్నింగ్స్‌లో నేనిప్పటి వరకూ 70కిపైగా పాత్రలు చేశా. అయితే చెప్పుకోడానికి ఏడెనిమిది సినిమాలే ఉన్నాయి. కొందరు నన్ను సరిగ్గా వాడుకోలేదు. కానీ 'రామ బాణం' విషయంలో అలా కాదు. ఈ చిత్రాన్ని బలంగా మలిచాడు శ్రీవాస్. ఇందులో ఆర్గానిక్ ఫుడ్ ప్రాధాన్యతని చక్కగా చూపించాం. ● నేను హీరో కాదు.. విలన్ కాదు.. యాక్టర్‌ని. అందులోనూ డైరెక్టర్స్ యాక్టర్‌ని. మన నుంచి వాళ్లు ఏం రాబట్టుకోవాలనుకుంటున్నారో వారి కళ్లు చూస్తే అర్థమౌతుంది. నాకు ఎప్పుడైనా కథే ముఖ్యం. కాంబినేషన్ కాదు. పాత్ర నచ్చకపోతే కుదరదని చెబుతున్నాను. ● సెకండ్ ఇన్నింగ్స్‌తో నా జీవితమే మారిపోయింది. హీరో అనేది పెద్ద బాధ్యత.. ఒత్తిడి ఉంటుంది. కానీ, ఇప్పుడు ఆ ఒత్తిడి లేకపోవడంతో నటనపైనే దృష్టి పెడుతున్నాను. ● చిన్న సినిమా అనేది ఉండదు. హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతుంది. నాకు డబ్బు ముఖ్యం కాదు.. పాత్ర, సినిమా ముఖ్యం. సల్మాన్ ఖాన్‌తో చేసిన 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' తర్వాత బాలీవుడ్ నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి. గాడ్ ఫాదర్ లాంటి పాత్ర చేయాలని ఉంది. అలాగే 'గాయం'కి మరో స్థాయిలో ఉండే పాత్ర చేయాలనే ఆసక్తి ఉంది. ప్రస్తుతం నేను చేస్తున్న నాలుగైదు సినిమాలు పెద్ద బ్యానర్స్‌లోనివే.

పెళ్లికి తేదీ కుదిరింది



● పవిత్ర, నరేశ్

వీకే నరేశ్, పవిత్రా లోకేష్‌ల 'మళ్లీ పెళ్లి'కి థియేటర్స్‌లో ముహూర్తం కుదిరింది. నరేశ్, పవిత్ర, వనితా విజయ్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మళ్లీ పెళ్లి'. ఎమ్ఎస్ రాజు దర్శకత్వంలో విజయకృష్ణ మూవీస్‌పై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది చిత్ర యూనిట్. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: అరుల్ దేవ్, కెమెరా: ఎమ్ఎస్ బాల్ రెడ్డి.

నటుడు–దర్శక–నిర్మాత మనోబాల కన్నుమూత



ప్రముఖ తమిళ నటుడు, దర్శక–నిర్మాత మనోబాల (69) బుధవారం చెన్నైలో కన్నుమూశారు. దర్శకుడు భారతీరాజా వద్ద సహాయ దర్శకుడిగా కెరీర్ ఆరంభించారు మనోబాల. మరోవైపు నటుడిగానూ కొనసాగారు. 'ఆగాయ గంగై' (1982) చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అయ్యారు. ఆ తర్వాత మనోబాల దర్శకత్వం వహించిన చిత్రాల్లో రజనీకాంత్ హీరోగా ఘన విజయం సాధించిన 'ఊర్ కావలన్' ఒకటి. ఇంకా విజయకాంత్, ప్రభు, కార్తీక్ తదితర హీరోలతో మనోబాల దాదాపు 25 చిత్రాలకు దర్శకత్వం వహించారు. కన్నడంలో 'డిసెంబర్ 31', అలాగే తన దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'ఎన్ పురుషన్‌దాన్ ఎనక్కు మట్టుమ్‌దాన్'ని హిందీలో 'మేరా పతి సిర్ఫ్ మేరా హై'గా రీమేక్ చేశారు. మూడు చిత్రాలు నిర్మించారు. 200లకు పైగా చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా చేశారు. తెలుగులో మనోబాల నటించిన చిత్రాల్లో 'కథానాయకుడు', 'గగనం', 'మహానటి', 'దేవదాస్', గత సంక్రాంతికి విడుదలైన 'వాల్తేరు వీరయ్య' ఉన్నాయి. ఇక చెన్నైలోని సాలిగ్రామంలో నివసిస్తున్న మనోబాల ఇటీవల అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరి, ఆరోగ్యంగా ఇంటికి తిరిగొచ్చారు. అకస్మాత్తుగా బుధవారం ఉదయం ఇంటి వద్దే కన్ను మూశారు. మనోబాలకు భార్య, ఓ కొడుకు ఉన్నారు. ఆయన మృతికి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, నటులు కమల్‌హాసన్, రజనీకాంత్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కాగా మనోబాల భౌతిక కాయానికి గురువారం చెన్నైలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సాక్షి బిజినెస్
గురువారం
4-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	161	61,193
నిఫ్టీ ▽	58	18,090

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	12,144	△ 63
డోజోన్స్	33,735	△ 50
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,788	△ 15
డాక్స్	15,815	△ 88
షాంఘై (అక్టోబరు ముగింపు)	3,323	△ 37
నికాయ్ (మంగళవారం ముగింపు)	29,158	△ 35

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 గ్రాముల)	61,044	△ 627
బంగారం (99.5 గ్రాముల)	60,800	△ 624
వెండి (కిలో)	75,282	△ 1,056

ఫెడ్ 0.25% వడ్డీ పెంపు

5 శాతం దాటిన ఫండ్స్ రేట్లు



న్యూయార్క్: రెండు రోజుల సమీక్ష తదుపరి యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మరోసారి 0.25 శాతం వడ్డీ రేటును పెంచింది. దీంతో తాజాగా ఫెడ్ ఫండ్స్ రేట్లు 5-5.25 శాతానికి చేరాయి. 2022 మార్చి నుంచి నిరంతరంగా రేట్ల పెంపును చేపడుతున్న ఫెడ్ ఏడాది కాలంలోనే యూఎస్ వడ్డీ రేట్లను 0 నుంచి 5 శాతానికి చేర్చింది! ఈ బాటలో గత సమీక్షలోనూ వేగాన్ని తగ్గించి పావు శాతం రేట్ల పెంపును చేపట్టింది. ఇందుకు ధరల అదుపు ప్రధాన పాత్ర పోషించింది. అయితే ఫెడ్ ద్రవ్యోల్బణ లక్ష్యం 2 శాతంకాగా.. 2023 మార్చికల్లా 5 శాతంగా నమోదైంది. దీంతో ఫెడ్ మరోసారి రేట్ల పెంపునకే కట్టుబడింది. కాగా.. ఇటీవల సిలికాన్ వ్యాలీ, ఫస్ట్ రిపబ్లిక్ తదితర బ్యాంకుల దివాలాతో తలెత్తిన బ్యాంకింగ్ సంక్షోభం, మార్చిలో రెండేళ్ల కనిష్టానికి చేరిన ఉపాధి కల్పన, 2020 డిసెంబర్ తదుపరి అత్యధికంగా 1.8 మిలియన్ ఉద్యోగాల కోత వంటి అంశాలు ఫెడ్ వడ్డీ రేట్ల పెంపునకు చెక్ పెడుతున్నాయి. దీంతో ఫెడ్ ఇకపై రేట్ల పెంపును నిలిపివేయడం లేదా తగ్గించే వీలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏడాదికో ఎయిర్‌లైన్స్ కనుమరుగు

- చతికిలపడుతున్న విమానయాన సంస్థలు
- 1994 నుంచి ఇప్పటి వరకు 27 మూత
- కింగ్ ఫిషర్, జెట్, గో ఫస్ట్ కీలకం



న్యూఢిల్లీ/ముంబై: దేశ విమానయాన రంగం ఎయిర్‌లైన్స్ సంస్థలకు కలసిరావడం లేదు. దీనికి నిదర్శనంగా గడిచిన మూడు దశాబ్దాల కాలంలో 27 సంస్థలు కనుమరుగయ్యాయి. 1994లో మొదటిసారి దేశంలో ప్రైవేటు విమానయాన సంస్థలు (ఎయిర్‌లైన్స్ కంపెనీలు) కార్యకలాపాల నిర్వహణకు అనుమతించారు. ఆ తర్వాత రెండేళ్లకు అంటే 1996లో తొలి వికెట్ పడింది. ఈస్ట్ వెస్ట్ ట్రావెల్స్ అండ్ ట్రేడ్ లింక్ 1996 నవంబర్‌లో కార్యకలాపాలను (ఆరంభించిన రెండేళ్లకు) మూసివేసింది. అదే ఏడాది మోడిలుఫ్ట్ కార్యకలాపాలు కూడా నిలిచిపోయాయి. ఇలా మొత్తం మీద 27 సంస్థలు (సగటున ఏడాదికొకటి) వ్యాపార కార్యకలాపాలను మూసివేయడం, దివాలా తీయడం లేదా ఇతర సంస్థల్లో విలీనం కావడం, కొనుగోళ్లతో కనుమరుగు కావడం చోటు చేసుకుంది. కరోనా రాక ముందు 2019లోనూ జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. దివాలా పరిష్కారంలో భాగంగా ఓ కన్సార్షియం జెట్ ఎయిర్‌వేస్‌ను సొంతం చేసుకున్నప్పటికీ కార్యకలాపాలు ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. అదే ఏడాది జెట్‌లైట్ (సహారా ఎయిర్‌లైన్స్) కూడా మూతపడింది. జూమ్ ఎయిర్ పేరుతో కార్యకలాపాలు నిర్వహించే జెక్సస్ ఎయిర్ సర్వీసెస్, డెక్కన్ చార్టర్డ్ ప్రైవేటు లిమిటెడ్, ఎయిర్ ఒడిశా ఏవియేషన్ 2020లో మూసివేయగా, 2022లో హెరిటేజ్ ఏవియేషన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి.

17 ఏళ్లకు గో ఫస్ట్

2020లో కరోనా మహమ్మారి కారణంగా ఎయిర్‌లైన్స్ కంపెనీలు తమ కార్యకలాపాలను కొన్ని నెలల పాటు నిలిపివేయాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా పాక్షిక సర్వీసులకే పరిమితమయ్యాయి. దీని కారణంగా ఎయిర్‌లైన్స్ సంస్థలకు నష్టాలు పెరిగాయి. ఆ తర్వాత డిమాండ్ అనూహ్యంగా పుంజుకున్నప్పటికీ, గో ఫస్ట్ సంస్థకు చెందిన సగం విమానాలు ప్రాట్ అండ్ విట్నీ ఇంజన్లలో సమస్యలతో పార్కింగ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. దీంతో సగం సర్వీసులనే నడుపుతూ చివరికి కార్యకలాపాలు మొదలు పెట్టిన 17 ఏళ్ల తర్వాత గో ఫస్ట్ దివాలా పిటిషన్ దాఖలు చేసింది. జెట్ ఎయిర్‌వేస్ తర్వాత దివాలా పరిష్కారం కోసం ఎన్‌సీఎల్‌టీకి ముందుకు వెళ్లిన రెండో సంస్థ ఇది.

2012లో కింగ్‌ఫిషర్

ప్రముఖ సంస్థగా పేరొంది, పెద్ద ఎత్తున విమానయాన కార్యకలాపాలు నిర్వహించిన కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ మూతపడడం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 50 విమానాలతో వందలాది సర్వీసులు నిర్వహిస్తూ, ఎంతో మందికి ఉపాధి కల్పించిన ఈ సంస్థ 2012లో మూతపడడంతో బ్యాంకులకు రూ.9,000 కోట్లకు పైగా నష్టం ఏర్పడింది.

డిమాండ్‌కు తక్కువేమీ లేదు

ఒకవైపు భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్‌గా గుర్తింపు తెచ్చుకుంటుంటే, మరోవైపు ఒక్కో ఎయిర్‌లైన్ సంస్థ మూతపడుతుండడం సంక్లిష్టతలకు అద్దం పడుతోంది. కానీ, ఎయిర్‌లైన్స్ సేవలకు ఏటేటా డిమాండ్ పెరుగుతూనే ఉంది. 2023 మొదటి మూడు నెలల్లో దేశీ ఎయిర్‌లైన్స్ సంస్థలు 3.75 కోట్ల మంది ప్రయాణికులను చేరవేశాయి. అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 52% అధికం.

గుత్తాధిపత్యానికి బాటలు..

ప్రభుత్వరంగంలోని ఎయిర్ ఇండియాను టాటాలు గతేడాది జనవరిలో కొనుగోలు చేయడం తెలిసిందే. దీంతో ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో అలయన్స్ ఎయిర్ ఒక్కటే ఉంది. దీని సేవలు నామమాత్రమే. ఇక ప్రధానంగా సేవలు అందించే సంస్థలుగా ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, విస్తారా, ఏయిరేషియా, ఆకాశ ఎయిర్ ఉన్నాయి. ఇందులో ఆకాశ ఎయిర్ రాకేశ్ జున్‌జున్‌వాలా ఆరంభించినది. ఇది చాలా తక్కువ సర్వీసులకే పరిమితమైంది. ఎయిర్ ఏషియా, విస్తారా టాటాల జాయింట్ వెంచర్‌లు, వీటిని ఎయిర్ ఇండియాలో విలీనం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అదే జరిగితే అప్పుడు ప్రధానంగా సేవలు అందించేవి ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్ అని చెప్పుకోవచ్చు. స్పైస్‌జెట్ కూడా తీవ్ర ఆర్థిక సమస్యల్లో ఉంది. భారీ నష్టాలతో, రుణ భారంతో నడుస్తోంది. ఒకవేళ ఇది కూడా మూతపడితే అప్పుడు ఎయిర్ ఇండియా, ఇండిగోతో దేశ ఎయిర్‌లైన్స్ మార్కెట్ మోనోపలీగా మారిపోతుందన్న ఆందోళన వినిపిస్తోంది. అంతేకాదు, సేవలపైనా దీని ప్రభావం పడుతుందని అంటున్నారు.

కోల్ ఇండియా చీఫ్‌గా పీఎం ప్రసాద్!

పీఈఎస్‌బీ సిఫారసు



రాంచీ: కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బాధ్యతలకు తెలుగు వ్యక్తి పోలవరపు మల్లికార్జున ప్రసాద్ ఎంపికయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థల ఎంపిక వ్యవహారాల బోర్డ్ (పీఈఎస్‌బీ) ఏడుగురు అధికారులను ఇంటర్వ్యూ చేసి పీఎం ప్రసాద్ పేరును సిఫారసు చేసింది. ఎఫ్ఎస్ఐబీ సిఫారసుకు ప్రధాని అధ్యక్షతన గల కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. ప్రసాద్ ప్రస్తుతం రాంచీ కేంద్రంగా పనిచేస్తున్న కోల్ ఇండియా అనుబంధ సంస్థ సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (సీసీఎల్) సీఎండీగా పనిచేస్తున్నారు. 2019లో ఆయన భారత్ కోకింగ్ కోల్ (బీసీసీఎల్) సీఎండీగా కూడా ఎంపికయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బీఈ మైనింగ్‌లో గ్రాడ్యుయేటింగ్ తదుపరి 1984లో ఆయన సీఐఎల్‌లో తన కెరీర్‌ను ప్రారంభించారు. అటు తర్వాత అంచెలంచెలుగా విభిన్న హోదాల్లో పనిచేస్తూ, కోల్ ఫీల్డ్స్‌లోని వివిధ రంగాల్లో అపార అనుభవాన్ని గడించారు.

భారత్ 'సేవలు' పటిష్టం

- ఏప్రిల్‌లో 13 ఏళ్ల గరిష్ట స్థాయి
- 62కు ఎస్అండ్‌పీ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం ఏప్రిల్‌లో గణనీయమైన ఫలితాన్ని నమోదుచేసుకుంది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 13 నెలల గరిష్ట స్థాయిలో 62కు ఎగసింది. మార్చిలో సూచీ 57.8 వద్ద ఉంది. కొత్త వ్యాపారాల్లో వృద్ధి, మార్కెట్ పరిస్థితుల సానుకూల వంటి అంశాలు ఈ పటిష్ట ఫలితానికి కారణమని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. నిజానికి ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల సూచీ గడచిన 21 నెలల్లో వృద్ధి శ్రేణిలోనే ఉంది. భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో సేవల రంగం మెజారిటీ వాటాను కలిగిఉన్న సంగతి తెలిసిందే. కాగా, ఇంకా ఉపాధి అవకాశాలు ఈ రంగంలో భారీగా పుంజుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకు సంబంధించిన సర్వే పేర్కొంది.

ఇదిలావుండగా, తయారీ, సేవల రంగం రెండూ కలిపిన ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ కూడా ఏప్రిల్‌లో 61.6గా నమోదయ్యింది. మార్చిలో సూచీ 58.4 వద్ద ఉంది.

వచ్చే నెలలో హోండా 'ఎలివేట్'

న్యూఢిల్లీ: హోండా కార్స్ ఇండియా కొత్త ఎస్‌యూవీ పేరును 'ఎలివేట్'గా ప్రకటించింది. దీన్ని వచ్చే నెలలో భారత్‌లో ఆవిష్కరించనున్నట్లు వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్ల కోసం రూపొందించిన ఈ మోడల్‌ను ముందుగా భారత్‌లోనే లాంచ్ చేస్తున్నట్లు పేర్కొంది.



హోండా ప్రస్తుతం దేశీయంగా సిటీ, అమేజ్ పేరిట రెండు మోడల్స్‌ను మాత్రమే విక్రయిస్తోంది. భారీగా వృద్ధి చెందుతున్న ఎస్‌యూవీ విభాగంలో ఎలివేట్‌తో రీ-ఎంట్రీ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవాలని కంపెనీ భావిస్తోంది. ప్యాసింజర్ వాహనాల విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా 47% దాకా ఉంది.

ఫెడ్ ప్రకటనకు ముందు అప్రమత్తత

- సూచీల వరుస ర్యాలీకి బ్రేక్
- సెన్సెక్స్ నష్టం 161 పాయింట్లు
- 18,100 దిగువకు నిఫ్టీ



ముంబై: అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య పరపతి విధాన వైఖరి ప్రకటనకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో స్టాక్ సూచీల వరుస ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ షేర్ల బలహీన ట్రేడింగ్ సైతం ఒత్తిడిని పెంచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందడంతో ఉదయం సెన్సెక్స్ 80 పాయింట్ల పతనంతో 61,275 వద్ద, నిఫ్టీ 34 పాయింట్లు నష్టపోయి 18,114 వద్ద మొదలయ్యాయి. ఇటీవల వరుస ర్యాలీ క్రమంలో బ్యాంకింగ్, మెటల్, ఐటీ షేర్లు భారీ ఎత్తున లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఒక దశలో సెన్సెక్స్ 330 పాయింట్లు క్షీణించి 61,024 వద్ద, నిఫ్టీ 106 పాయింట్లు పతనమైన 18,042 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఆఖర్లో కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో కొంతమేర నష్టాలు తగ్గాయి. ఫలితంగా సెన్సెక్స్ 161 పాయింట్లు నష్టపోయి 61,193 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 58 పాయింట్లు పతనమై 18,100 స్థాయి దిగువున 18,090 వద్ద నిలిచింది. దీంతో సెన్సెక్స్ ఎనిమిది రోజులు, నిఫ్టీ ఆరు రోజుల వరుస ర్యాలీకి అడ్డుకట్ట పడినట్లైంది. ఎఫ్ఎంసీజీ, మీడియా, రియల్టీ షేర్లు రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,338 కోట్ల షేర్లను కొనుగోలు చేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.584 కోట్ల షేర్లను అమ్మేశారు. సెన్సెక్స్ 161 పాయింట్ల పతనంతో బీఎస్ఈలో రూ.1.63 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. ఆసియా మార్కెట్లు 0.50% నుంచి ఒకటిన్నర శాతం దాకా నష్టపోయాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్-2023

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఐదు ప్రాంతీయ విద్యా సంస్థ(ఆర్ఐఈ)ల్లో వివిధ ఉపాధ్యాయ విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎన్‌సీఈఆర్‌టీ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్-2023 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది.

» **రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఈ):** అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్, షిల్లాంగ్.

ఆర్ఐఈ క్యాంపస్ వివరాలు

» బీఎస్సీ బీఈడీ(నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు)- భువనేశ్వర్, మైసూరు.
» బీఏ బీఈడీ(నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్)-భువనేశ్వర్, మైసూరు.
» ఎంఎస్సీఈడీ(ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్)-మైసూరు.
» బీఎడ్(రెండేళ్లు)-అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్, షిల్లాంగ్.
» బీఈడీ-ఎంఈడీ(మూడేళ్లు)-భోపాల్.
» ఎంఈడీ(రెండేళ్లు)-అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్.
» **అర్హత:** హయ్యర్ సెకండరీ/+2/సీనియర్ సెకండరీ, డిగ్రీ, పీజీ, బీఈడీ.
» **ఎంపిక విధానం:** ప్రవేశపరీక్ష, కౌన్సెలింగ్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తు తేదీలు:** 25.04.2023 నుంచి 06.06.2023 వరకు.
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** 25.06.2023 నుంచి రూ.02.07.2023 వరకు.
» **ప్రవేశ పరీక్ష తేది:** 02.07.2023.
» **వెబ్‌సైట్:** www.cee.ncert.gov.in

తెలంగాణ గురుకులాల్లో 4,006 టీజీటీ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం,మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమం, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4,006.
» **సబ్జెక్టులు:** తెలుగు, సంస్కృతం, ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్.
» **సొసైటీ వారీగా ఖాళీలు:** టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్-728, టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ -218, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్-2379, టీఎంఆర్ఈఐఎస్-594, టీఆర్ఈఐఎస్-87.
» **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈడీ, టీపీటీ, హెచ్‌పీటీతోపాటు టెట్/సీటెట్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** రూ.42,300 నుంచి రూ.1,15,270.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష (పేపర్-1,2,3), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.04.2023 నుంచి 27.05.2023.
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

సీటెట్ జూలై- 2023

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ).. కేంద్రీయ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(సీటెట్)కు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఉపాధ్యాయ వృత్తిని కెరీర్‌గా ఎంచుకునే వారి కోసం సీబీఎస్ఈ ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తోంది. సీటెట్ స్కోర్‌ను కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

» సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) జూలై-2023
» **అర్హత:** బీఈడీ, డీఎడ్ ఉత్తీర్ణత ఉండాలి.
» **పరీక్ష విధానం:** పేపర్-1, పేపర్-2. పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ఉంటుంది. పేపర్-1 ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ బోధించే వారి కోసం; పేపర్-2 ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించే వారి కోసం నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 26.05.2023
» **పరీక్ష తేదీ:** జూలై-ఆగస్టు, 2023 మధ్యలో ఉంటుంది.
» **వెబ్‌సైట్:** https://ctet.nic.in

సంగారెడ్డి జిల్లాలో వివిధ ఉద్యోగాలు

సంగారెడ్డిలోని మహిళలు,పిల్లలు,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ.. ఒప్పంద ప్రాతిపదికన డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌లో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **పోస్టుల వివరాలు:** జిల్లా మిషన్ కోఆర్డినేటర్-01, జెండర్ స్పెషలిస్ట్-02, ఫైనాన్స్ లిటరసీ స్పెషలిస్ట్-01, మల్టీ-పర్పస్ స్టాఫ్-01.
» **వయసు:** 01.07.2023 నాటికి 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా సంక్షేమ అధికారి, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, కలెక్టరేట్, సంగారెడ్డి చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.05.2023.
» **వెబ్‌సైట్:** www.sangareddy.telangana.gov.in

ఐఐఎస్ఈఆర్‌ల్లో.. ఇంటిగ్రేటెడ్ బీఎస్+ఎంఎస్

» ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2023 నోటిఫికేషన్ విడుదల
» ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌ల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభం
» అయిదేళ్ల బీఎస్+ఎంఎస్, నాలుగేళ్ల బీఎస్ కోర్సులు
» ఏడు క్యాంపస్‌ల్లో దాదాపు రెండు వేల సీట్లు



ఐసర్ అప్టిట్యూడ్ టెస్ట్ 2023

దేశంలో పేరున్న విద్యాసంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్) క్యాంపస్‌లు! ఇంటర్ తర్వాత సైన్స్‌లో పరిశోధనల దిశగా అడుగులు వేయాలనుకునే విద్యార్థులకు ఇవి చక్కటి వేదికలు!! యువత భావి శాస్త్రవేత్తలుగా రాణించేలా బాటలు వేస్తున్న ఐఐఎస్ఈఆర్‌లు.. అయిదేళ్ల బీఎస్+ఎంఎస్, నాలుగేళ్ల బీఎస్ (ఇంజనీరింగ్/ఎకనామిక్ సైన్స్) కోర్సులను అందిస్తున్నాయి. 2023-24కు సంబంధించి ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌ల్లో ప్రవేశానికి ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు, అందిస్తున్న కోర్సుల ప్రత్యేకత, ప్రవేశ విధానం తదితర వివరాలు...

ఏడు క్యాంపస్‌లు-1808 సీట్లు

ప్రస్తుతం దేశంలో ఏడు చోట్ల ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో.. అయిదేళ్ల బీఎస్+ఎంఎస్ కోర్సులో 1777 సీట్లు ఉన్నాయి. క్యాంపస్ వారీగా సీట్ల వివరాలు.. ఐఐఎస్ఈఆర్-భోపాల్ 240, బరంపూర్ 170, కోల్‌కత 250, మొహాలీ 250, పుణె 288, తిరువనంతపురం 320, తిరుపతి 200. వీటితోపాటు ఐఐఎస్ఈఆర్ భోపాల్‌లో నాలుగేళ్ల బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో 60 సీట్లు, బీఎస్ ఎకనామిక్ సైన్సెస్‌లో 30 సీట్లు ఉన్నాయి.

అర్హత

2022 లేదా 2023లో ఇంటర్మీడియెట్(ఎంపీసీ, బైపీసీ)లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ కేటగిరీ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. 2023లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్

ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు అందిస్తున్న బీఎస్+ఎంఎస్ కోర్సు.. మొత్తం పది సెమిస్టర్లుగా అయిదేళ్ల వ్యవధిలో ఉంటుంది. మొదటి రెండేళ్లు ఫౌండేషన్ కోర్సులో ఉమ్మడి సబ్జెక్టులు ఉంటాయి. ఆ తర్వాత మూడు, నాలుగు సంవత్సరాల్లో విద్యార్థులు ఎంచుకున్న మేజర్(బయాలజీ/కెమిస్ట్రీ/ఫిజిక్స్/మ్యాథమెటిక్స్) సబ్జెక్టులపై బోధన ఉంటుంది. వీటితోపాటు.. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న మైనర్ సబ్జెక్టులను కూడా ఎంచుకోవచ్చు. అయిదో సంవత్సరంలో పూర్తిగా రీసెర్చ్ యాక్టివిటీస్‌పైనా, థీసిస్ వర్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఐఐఎస్ఈఆర్-భోపాల్ క్యాంపస్‌లోని నాలుగేళ్ల బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో.. మొదటి రెండేళ్లు ఉమ్మడి కరిక్యులం ఉంటుంది. ఆ తర్వాత రెండేళ్లు కెమికల్ ఇంజనీరింగ్ లేదా డేటాసైన్స్ అండ్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్ మేజర్ సబ్జెక్టులుగా బోధన సాగిస్తారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టును మేజర్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది.

బీఎస్ ఎకనామిక్స్

ఐఐఎస్ఈఆర్-భోపాల్ క్యాంపస్‌లోనే అందిస్తున్న బీఎస్ ఎకనామిక్స్ కోర్సును మరింత వినూత్నమైనదిగా పేర్కొనొచ్చు. సైన్స్, హ్యూమానిటీస్ అంశాలు కలయికగా ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్‌తో దీని కరిక్యులం రూపొందించారు. ఫలితంగా విద్యార్థులకు ఒకే సమయంలో సైన్స్, హ్యూమానిటీస్‌లపై నైపుణ్యం లభిస్తుంది.

మొదటి ఏడాది బేసిక్ సైన్సెస్, కోర్ ఎకనామిక్స్‌కు సంబంధించి ప్రాథమిక అంశాలను బోధిస్తారు. ఆ తర్వాత మూడేళ్లు ఎకనామిక్ సైన్సెస్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్స్‌పై బోధన ఉంటుంది. నాలుగేళ్లు పూర్తయిన తర్వాత విద్యార్థులు తమకు ఆసక్తి ఉంటే..బీఎస్+ఎంఎస్ కోర్సుగా కొనసాగొచ్చు. మరో ఏడాది మేజర్ సబ్జెక్టులలో రీసెర్చ్, థీసిస్ సమర్పించాలి. ఆ తర్వాత ఇంటిగ్రేటెడ్ బీఎస్+ఎంఎస్ సర్టిఫికెట్ అందిస్తారు.

మూడు మార్గాల్లో ప్రవేశాలు

- ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లలోని బీఎస్+ఎంఎస్, బీఎస్ కోర్సుల్లో మూడు మార్గాల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. అవి..
- **జేఈఈ-అడ్వాన్స్‌డ్ 2023 ర్యాంకు:** ఈ విధానంలో జేఈఈ-అడ్వాన్స్‌డ్‌లో 15వేల లోపు ర్యాంకు సాధించిన అభ్యర్థులు నేరుగా ఐఐఎస్ఈఆర్ అడ్మిషన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- **కేవీపీవై ఎస్ఏ ఉత్తీర్ణత:** ఈ విధానంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన ఎస్ఏ స్ట్రీమ్- 2021లో సైన్స్ సబ్జెక్టులలో ఉత్తీర్ణత సాధించిన వారు కూడా నేరుగా ఐఐఎస్ఈఆర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఐఏటీ ఛానెల్:** జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు పొందని వారు, అదే విధంగా కిశోర్ వైజ్ఞానిక ప్రోత్సాహన్ యోజన సర్టిఫికెట్ లేని విద్యార్థులు ఐఐఎస్ఈఆర్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించే మార్గమిది. దీనినే ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐఏటీ) ఛానెల్ అని పేర్కొంటారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ లేదా బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులు.

ఆప్టిట్యూడ్ టెస్ట్

- ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐఏటీ)లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్‌లలో ప్రతి సబ్జెక్ట్‌పై 15 ప్రశ్నలు చొప్పున మొత్తం 60 ప్రశ్నలతో ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు చొప్పున 240 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రతి తప్పు సమాధానానికి 1 మార్కు తగ్గింపు నిబంధన అమలు చేస్తారు.
- ఐఏటీలో పొందిన మార్కులు, నిర్దిష్ట కటాఫ్‌లు, అందుబాటులోని సీట్లను పరిగణనలోకి తీసుకుంటూ.. సీట్ల భర్తీ ప్రక్రియ చేపడతారు.

స్కాలర్‌షిప్

కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన ఉత్తీర్ణత ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేసుకున్న విద్యార్థులకు-తొలి మూడేళ్లు నెలకు రూ.5వేల స్కాలర్‌షిప్ లభిస్తుంది. దీనికి అదనంగా ప్రతి ఏటా రూ.20 వేల కాంటింజెన్సీ గ్రాంట్ అందిస్తారు. ఆ తర్వాత రెండేళ్లను పీజీ స్థాయిగా పరిగణించి..నెలకు రూ.ఏడు వేల స్కాలర్‌షిప్, ఏడాది రూ.28 వేల కాంటింజెన్సీ గ్రాంట్‌ను అందిస్తారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు

ఐఏటీ కోసం విద్యార్థులు సీబీఎస్ఈ పదకొండు, పన్నెండు తరగతులకు సంబంధించి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను ఆధారంగా చేసుకుని అభ్యసనం సాగించాలి. గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తూ.. ఆయా అంశాలకు లభిస్తున్న వెయిటేజీని పరిగణనలోకి తీసుకోవాలి. వీటితోపాటు మోడల్ టెస్టులు, మాక్ టెస్టులకు హాజరవడం కూడా మేలు చేస్తుంది. అదే విధంగా జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్ గత ప్రశ్న పత్రాల సాధన కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

బేసిక్స్‌పై పట్టు సాధిస్తూ

ఐఐఎస్ఈఆర్ ఐఏటీ ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు అన్ని సబ్జెక్టులలోని బేసిక్ కాన్సెప్ట్స్, ఫార్ములాలపై పట్టు సాధించాలి. ఆయా అంశాలను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ముఖ్యంగా ఫిజిక్స్‌లో న్యూమరికల్ టైప్ టాపిక్స్ చదువుతున్నప్పుడు అభ్యసనానికే పరిమితం కాకుండా.. ప్రాక్టీస్ చేయడం అలవర్చుకోవాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లు, ఫార్ములాలు, నిర్వచనాలను షార్ట్ నోట్స్‌గా రాసుకోవాలి. ఇది రివిజన్ సమయంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ఈ ర్యాంకులకే సీటు!

గత మూడేళ్ల గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే..జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో అయిదు వేల లోపు ర్యాంకుతో; కేవీపీవైలో రెండు వేలలోపు ర్యాంకుతో, ఐఏటీలోనూ మూడు వేల లోపు ర్యాంకుతోనే సీట్ల భర్తీ పూర్తవుతోంది. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు ఓపెన్ కేటగిరీతో పోల్చితే మరో అయిదు వందలు లేదా ఆరు వందల ఎక్కువ ర్యాంకులోపు సీటు లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 25.05.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** మే 28, 29
- **ఐఏటీ హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:** 10.06.2023
- **ఐఏటీ పరీక్ష తేది:** 17.06.2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://iiseradmission.in

క్లుప్తంగా...

తెలుగులో తీర్పు వెలువరించిన న్యాయమూర్తి

రోడ్డు ప్రమాద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు


న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి

కర్నూలు(లీగల్): కర్నూలు ఏడో అదనపు జిల్లా కోర్టులో రోడ్డు ప్రమాదం కేసులో తీర్పును తెలుగులో వెల్లడించి న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి తెలుగు భాషపై తన మక్కువను చాటుకున్నారు. వెల్దుర్తి మండలం రామళ్లకోటకు చెందిన ఎస్‌.శ్రీనివాసులు లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. 2020 జూన్‌ 17న నంద్యాల సమీపంలో శాంతిరాం వైద్యశాల సమీపంలో లారీ టైరు పంక్చర్‌ కావడంతో వాహనం నిలిచిపోయింది. లారీ టైరు మారుస్తుండగా ఆగివున్న లారీని మరో లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఇందులో తీవ్రంగా గాయపడి కోలుకోలేక శ్రీనివాసులు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తమకు రూ.12 లక్షల నష్టపరిహారం చెల్లించాలంటూ కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం బాధితులకు న్యూ ఇండియా అస్యూరెన్స్‌ బీమా కంపెనీ రూ.16.50 లక్షలు చెల్లించాలని తీర్పులో న్యాయమూర్తి ఆదేశించారు. బాధితులు కోరిన దానికంటే అధిక నష్టపరిహారం మంజూరు చేస్తూ 7.5 శాతం వడ్డీతో కేసు దాఖలు చేసిన నాటి నుంచి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

సీబీసీ ఏపీ జేడీగా రత్నాకర్‌

సాక్షి, అమరావతి: సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌(సీబీసీ) ఆంధ్రప్రదేశ్‌ ప్రాంతీయ కార్యాలయం జాయింట్‌ డైరెక్టర్‌గా పి.రత్నాకర్‌ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్‌ ఇన్ఫర్మేషన్‌ సర్వీస్‌కు చెందిన ఆయన దూరదర్శన్‌ విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం అధిపతిగా సేవలందిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. రత్నాకర్‌ రెండు దశాబ్దాల కాలంలో సమాచార, ప్రసారశాఖలో పలు విభాగాల్లో పనిచేశారు. పత్రికా సమాచార కార్యాలయం హైదరాబాద్‌లో అసిస్టెంట్‌ డైరెక్టర్‌గా, డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలందించారు.

ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు నేటి వరకు పెంపు

సాక్షి, అమరావతి: విద్యార్థులు, తల్లిదండ్రుల వినతుల నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ పబ్లిక్‌ అడ్వాన్స్‌డ్‌ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును గురువారం (నేడు) వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్‌ బోర్డు ప్రకటించింది. ఇంటర్మీడియట్‌ జనరల్‌, ఒకేషనల్‌ కోర్సుల 1వ, 2వ సంవత్సరాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బోర్డు కార్యదర్శి సూచించారు.

కిడ్నీ రాకెట్‌లో మరో ఇద్దరి అరెస్టు

- కోర్టులో లొంగిపోయిన ప్రధాన నిందితుడు
- ఆపరేషన్‌ చేసిన డాక్టర్‌ రాజశేఖర్‌ కూడా అరెస్టు


పెందుర్తిలోని తిరుమల ఆస్పత్రి


నిందితులు వెంకటేశ్వరరావు, డాక్టర్‌ రాజశేఖర్‌

సింహాచలం: విశాఖ నగరంలో సంచలనం రేకెత్తించిన కిడ్నీ రాకెట్‌ కేసులో మరో ఇద్దరిని అరెస్ట్‌ చేసినట్టు పెందుర్తి సీఐ గొలగాని అప్పారావు బుధవారం తెలిపారు. ఈ వ్యవహారంలో ఎలీనా, కామరాజు, మద్రి శ్రీను, కొండమ్మతో పాటు ల్యాబ్‌ టెక్నీషియన్‌ శేఖర్‌, తిరుమల ఆస్పత్రి వైద్యుడు డాక్టర్‌ పరమేశ్వరరావును నగర పోలీసులు ఇప్పటికే అరెస్ట్‌ చేశారు. తాజాగా కిడ్నీ ఆపరేషన్‌ చేసిన హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి చెందిన డాక్టర్‌ రాజశేఖర్‌ పెరుమాళ్లను, తూర్పుగోదావరి జిల్లా కరపకి చెందిన ప్రధాన నిందితుడు నార్ల వెంకటేశ్వరరావును అరెస్ట్‌ చేశారు. నార్ల వెంకటేశ్వరరావు కోర్టులో లొంగిపోయినట్టు సీఐ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కిడ్నీ రాకెట్‌ మొత్తం నార్ల వెంకటేశ్వరరావు నడిపాడు. అతనికి ఇదే వృత్తి. కిడ్నీ అవసరమైన వారి వివరాలు, దాతల వివరాలన్నీ ముందుగా సేకరిస్తాడు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వారికి డబ్బు ఆశ చూపించి, కిడ్నీ అమ్మేందుకు ఒప్పిస్తాడు. కిడ్నీ ఇచ్చేవారికి, కావాల్సిన వారికి మధ్యవర్తిగా వ్యవహరించి, నగదు బేరం పెడతాడు. రహస్యంగా ఆపరేషన్లు చేయిస్తుంటాడు. 2019లో నగరంలోని శ్రద్ధ ఆస్పత్రిలో జరిగిన కిడ్నీ రాకెట్‌లో కూడా వెంకటేశ్వరరావు పట్టుబడి జైలుశిక్ష అనుభవించాడు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా ఇదే వ్యవహారం నడుపుతున్నాడు. ఈ తరుణంలో ఎలీనా, కామరాజు గ్యాంగ్‌తో పరిచయమైంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వినయ్‌కుమార్‌కు డబ్బు ఆశ చూపించి కిడ్నీ ఇచ్చేందుకు ఒప్పించారు. పెందుర్తి తిరుమల ఆస్పత్రిలో గతేడాది డిసెంబర్‌లో వినయ్‌కుమార్‌కు డాక్టర్‌ రాజశేఖర్‌ పెరుమాళ్ల ఆపరేషన్‌ చేసి కిడ్నీని తొలగించారు. కామినేనితో పాటు పలు ఆస్పత్రులకు కన్సల్టెంట్‌గా కూడా డాక్టర్‌ రాజశేఖర్‌ వ్యవహరిస్తున్నట్టు సీఐ తెలిపారు.

శ్రీరామ్‌ రాఘవేంద్ర చిట్స్‌లో తనిఖీలు

ఉల్లంఘనల గుర్తింపు.. చర్యలకు ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని శ్రీరామ్‌ రాఘవేంద్ర చిట్స్‌ బ్రాంచీల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు బుధవారం తనిఖీలు చేసి పలు ఉల్లంఘనలు గుర్తించారు. ఈ కంపెనీకి చెందిన నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, తిరుపతి బ్రాంచీల్లో తనిఖీలు చేశారు. 1982 చిట్‌ఫండ్‌ చట్టానికి విరుద్ధంగా ఈ కంపెనీలో వ్యవహారాలున్నట్లు తేల్చారు. చిట్‌ పాడుకున్నవారికి సకాలంలో సొమ్ము చెల్లించడం లేదని గుర్తించారు. కొన్నిసార్లు నాలుగైదు నెలలు దాటిన తర్వాత కూడా సొమ్ము చెల్లించడంలేదని తేలింది. కంపెనీ బ్యాలెన్స్‌ షీట్లలో కంపెనీలో ఉన్న నగదు, జారీచేసిన చెక్కుల మధ్య తేడాలు గుర్తించారు. ఒకే చెక్కు నంబరును పలువురు వ్యక్తులకు డబ్బు చెల్లించేందుకు వినియోగిస్తున్నట్లు తేలింది. ఫోర్‌మెన్లు ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా అకౌంట్స్‌ను క్లోజ్‌ చేయకుండా రోజువారీ అకౌంట్ల నిర్వహణలో అవకతవకలు పాల్పడినట్లు గుర్తించారు. ఇవేగాక ఇంకా పలురకాల ఉల్లంఘనలు, నగదు లావాదేవీల్లో భారీ అవకతవకలు ఉన్నట్లు తేలింది. వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌ అండ్‌ ఐజీ రామకృష్ణ చిట్స్‌ డిప్యూటీ, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్లను ఆదేశించారు.

అక్రిడేటెడ్‌ జర్నలిస్టుల కోసం ఉచిత హెల్త్‌ క్యాంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అక్రిడేటెడ్‌ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఈ నెల 13, 14వ తేదీల్లో ఉచిత హెల్త్‌ క్యాంప్‌ నిర్వహించనున్నట్టు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్‌ విజయ్‌ కుమార్‌ రెడ్డి బుధవారం తెలిపారు. విజయవాడలోని లయోలా ఇంజినీరింగ్‌ కాలేజ్‌లో 2 రోజుల పాటు హెల్త్‌ క్యాంపు ఉంటుందన్నారు. హెల్త్‌ క్యాంపులో సేవలు పొందాలనుకునే అక్రిడేటెడ్‌ జర్నలిస్టులు తమ వివరాలతో పాటు, కుటుంబ సభ్యుల వివరాలు పొందుపరుస్తూ మే 10లోగా https://forms.gle/UEKdx4fZG7yUGBns7లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే హెల్త్‌ క్యాంప్‌లో మామోగ్రామ్‌, హృద్రోగ సహా 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. హెల్త్‌ క్యాంపులో నిర్ధారిత పరీక్షలు చేస్తారని చెప్పారు. అత్యవసర వైద్య సేవలు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య సాయం పొందాల్సి వస్తే వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ అనుబంధిత ఆస్పత్రులకు వెళ్లడానికి జర్నలిస్ట్‌ హెల్త్‌ కార్డు తప్పనిసరి కావున కొత్తగా అక్రిడేటెడ్‌ కార్డులు పొందిన జర్నలిస్టులు హెల్త్‌ కార్డు పొందడానికి వీలైనంత త్వరగా రూ.1,250 చెల్లించాలన్నారు. హెల్త్‌ క్యాంపులో కొత్తగా హెల్త్‌ కార్డు పొందే సదుపాయాన్ని ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు.

బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం చర్యలు

సీఎస్‌ జవహర్‌ రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బాల్య వివాహాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. 18 ఏళ్లకు ముందే బాలికల వివాహాలు జరగడం ఆందోళన కలిగిస్తోందని, ఈ సాంఘిక దురాచారాన్ని అంతమొందించడానికి అధికారులు, పౌర సమాజ సంస్థలు మొత్తం సమాజాన్ని కలుపుకొని కేంద్రీకృత విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా బాల్య వివాహాలు జరగకుండా స్పష్టమైన వ్యూహాన్ని సూచించేందుకు మహిళా కలెక్టర్లు, ఎస్పీలతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్‌ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లా కలెక్టర్‌ ఎస్‌.నాగలక్ష్మి అధ్యక్షతన కాకినాడ కలెక్టర్‌ కృతిక శుక్ల, తూర్పుగోదావరి కలెక్టర్‌ కె.మాధవీలత, పశ్చిమగోదావరి కలెక్టర్‌ పి.ప్రశాంతి, అనంతపురం కలెక్టర్‌ ఎం.గౌతమి, కర్నూలు జిల్లా కలెక్టర్‌ జి, సృజన, శ్రీకాకుళం ఎస్పీ జీఆర్‌ రాధిక, విజయనగరం ఎస్పీ దీపికా పాటిల్‌, ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్‌ సభ్యులుగా కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విజయనగరం ఎస్పీ దీపికా పాటిల్‌ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీ బాల్య వివాహాల నివారణకు స్పష్టమైన వ్యూహాన్ని సూచిస్తూ ఈ నెలాఖరులోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. 'బాల్య వివాహాలు ప్రస్తుత జనరేషన్‌తోపాటు భవిష్యత్‌ జనరేషన్‌ పైన దుష్ప్రభావం చూపుతాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఉద్వాదకత, ఆరోగ్యంతో పాటు సామాజిక పరిమితులపై ప్రభావం చూపిస్తాయని తెలిపింది. ఐదో జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే ప్రకారం దేశంలో, రాష్ట్రంలోనూ బాల్య వివాహాల సంఖ్య ఎక్కువగా ఉందని, ఈ సాంఘిక దురాచారాన్ని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న'ట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

'ఉద్యానం' పెరిగింది





సాక్షి, అమరావతి: ఏపీలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి, ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నట్లు నాబార్డు 2023–24 ఫోకస్‌పత్రం వెల్లడించింది. దేశంలోనే తొలిసారిగా కేంద్రంతో పాటు ఇతర రాష్ట్రాలు సైతం కనీస మద్దతు ధర ప్రకటించని పంటలకు ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం ఒక్కటే ఎమ్మెస్పీని ప్రకటించిందని ప్రశంసించింది. మిర్చి క్వింటాల్‌కు రూ.7,000, పసుపు క్వింటాల్‌కు రూ.6,850, క్వింటాల్‌ ఉల్లికి రూ.770, చిరు ధాన్యాలకు క్వింటాల్‌కు రూ.2,500, అరటి క్వింటాల్‌ రూ.800, బత్తాయి క్వింటాల్‌కు రూ.1,400 చొప్పున ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించిందని తెలిపింది. 2019–20తో పోల్చితే 2021–22లో ఏపీలో ఉద్యాన పంటల ఎగుమతులు పెరిగినట్లు నాబార్డు నివేదిక వెల్లడించింది. ప్రధానంగా అరటి, పసుపు, మిర్చి, కూరగాయల ఎగుమతులు పెరిగినట్లు తెలిపింది.

రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు ఇలా...

	2020-21		2021-22	
పంట	విస్తీర్ణం హెక్టార్లలో	ఉత్పత్తి మె.టన్నుల్లో	విస్తీర్ణం హెక్టార్లలో	ఉత్పత్తి మె.టన్నుల్లో
మామిడి	3,78,940	49,26,220	4,17,052	54,88,401
అరటిపండు	1,08,083	64,84,968	1,00,156	72,11,234
బొప్పాయి	15,311	14,54,555	14,051	14,91,060
టమాటా	61,571	22,16,540	61,669	27,13,436
మిర్చి	1,58,586	11,10,102	2,05,073	6,68,537
ఆయిల్‌పామ్‌	1,79,560	32,32,080	1,77,489	34,37,925

• తెలంగాణ

మేడారం మహాజాతర తేదీలు ఖరారు

- 2024, ఫిబ్రవరి 21నుంచి 24వ తేదీ వరకు తెలంగాణ కుంభమేళా
- షెడ్యూల్‌ను ప్రకటించిన సమ్మక్క– సారలమ్మ పూజారులు



సాక్షిప్రతినిధి, వరంగల్‌: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర తేదీలు ఖరారయ్యాయి. రెండేళ్లకోసారి ఆదివాసి గిరిజన సంప్రదాయ పద్ధతిలో నిర్వహించే మహాజాతరను ఈసారి 2024 ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించాలని పూజారుల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం షెడ్యూల్‌ను ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న మాఘశుద్ధ పంచమి బుధవారం రోజున మండెమెలగడం, గుడి శుద్ధీకరణతో జాతర ప్రక్రియను ప్రారంభించి.. 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు.

జాతర తేదీలు ఇవే..

ఫిబ్రవరి 21: మాఘశుద్ధ ద్వాదశి బుధవారం సాయంత్రం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను గద్దెల మీదికి తీసుకొస్తారు.

- **ఫిబ్రవరి 22:** చిలకలగుట్ట నుంచి సమ్మక్క దేవతను గద్దెల వద్దకు చేరుస్తారు.
- **ఫిబ్రవరి 23:** సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లకు ప్రజలు మొక్కులు సమర్పించుకోవడం.
- **ఫిబ్రవరి 24:** మాఘశుద్ధ పౌర్ణమి శనివారం అమ్మవార్ల వన ప్రవేశం, మహాజాతర ముగింపు.
- **ఫిబ్రవరి 28:** మాఘశుద్ధ బహుళ పంచమి బుధవారం రోజున తిరుగువారం పండుగ నిర్వహణ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.